అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 31-12-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 01 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



నోటికాడి కూడు లాక్కుంటే

కొట్లాడాలి

పెద్దల భూములకో నీతి పేదల భూములకో నీతా ?

గరీబోళ్ల జోలికొస్తే ఎర్రజెండా అడ్డుగా నిలుస్తుంది

భూమిని పంచిన, సాధించిన చరిత్ర ఎర్రజెండాదే

లగచర్ల భూముల రక్షణకు అండగా ఉంటాం

ఫార్మాను వెనక్కు తీసుకునేలా సీఎంపై ఒత్తిడి పెంచి విజయం సాధించాం

ఇండస్ట్రియల్ కారిడార్‌కు ప్రత్యామ్నాయ భూములు చూడాలి :

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హకీంపేటలో లగచర్ల బాధిత రైతులతో సభ

నవతెలంగాణ-కొడంగల్

'మీ నోటికాడి కూడు లాక్కుంటుంటే చూస్తూ ఊరుకోకుండా గట్టిగా కొట్లాడాలి. మీ పిల్లలు, భవిష్యత్ తరాలు బతికేది భూమిపైనే. అలాంటి భూమి తల్లి దూరమైతే బతుకే లేదు. పేదల భూముల జోలికొస్తే ఎర్రజెండా అడ్డంగా నిలుస్తుంది. ఐక్యంగా చీమల గుంపు వలే కదిలేందుకు సిద్ధంగా ఉండాలి' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం పంటలు పండే భూములు కాకుండా ప్రత్యామ్నాయ భూములు చూడాలంటూ వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం హకీంపేటలో సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో లగచర్ల, పోలేపల్లి, హకీంపేట్, రోటి బండతండా, పులిచర్లకుంట తండా రైతులతో 'రైతాంగ సభ' నిర్వహించారు. లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లిన రైతులను సన్మానించారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తేసేందుకు కృషి చేయాలని తమ్మినేని వీరభద్రంకు రైతులు వినతిపత్రం అందజేశారు. అనంతరం నిర్వహించిన సభలో తమ్మినేని ప్రసంగించారు.

ప్రభుత్వం 1300 ఎకరాల భూమిని ఫార్మాసిటీ కోసం సేకరించేందుకు ప్రయత్నించిందని తమ్మినేని చెప్పారు. వామపక్ష పార్టీల నేతలు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించాక ముఖ్యమంత్రిని కలిసినప్పుడు చట్టాన్ని గౌరవించరా? అని ప్రశ్నించామన్నారు. ఇక్కడ తొండలు గుడ్లు పెట్టే భూములు లేవని, రెండు పంటలు పండే భూములు, బోరు బావులు ఉన్నాయని చెప్పామన్నారు. పచ్చని పొలాల్లో ఫార్మా పెడితే గిరిజనులు ఎక్కడికి పోవాలని, ఎట్లా బతకాలని 'మీ గొంతును మా గొంతు చేసుకుని' సీఎంకు విన్నవించినట్టు తెలిపారు. దాంతో సీఎం పునరాలోచించి నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారన్నారు. ఫార్మా వెనక్కి తీసుకోవడం ప్రజలందరి విజయమన్నారు. ఇబ్రహీంపట్నం లాంటి ప్రాంతంలో 13వేల ఎకరాల భూమి సేకరించి ఫార్మా పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ...6లో

ఉపాధ్యాయునిపై మతోన్మాదుల

దాడి అత్యంత హేయం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని 13లో

తెలంగాణ ఆత్మబంధువు

నీతినిజాయితీలకు రోల్‌మోడల్ మన్మోహన్ సింగ్



పేదల కోసం కీలక చట్టాలు చేశారు

ఆయనకు భారతరత్న ఇవ్వాలి

ఫైనాన్స్ డిస్ట్రిక్ట్‌లో విగ్రహం ఏర్పాటు చేస్తాం :

మాజీ ప్రధాని సంతాప తీర్మానంలో సీఎం రేవంత్‌రెడ్డి

అసెంబ్లీ ఘన నివాళులు



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ తెలంగాణకు పురుడుపోసిన వ్యక్తి అనీ, నాలుగు కోట్ల మంది తెలంగాణ బిడ్డల గుండెల్లో ఆయన చిరకాలం ఆత్మబంధువుగా నిలిచిపోతారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎల్పీజీ విధానాలను తీసుకురావడంలో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రణాళికసంఘం సభ్యులుగా, ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రొఫెసర్‌గా ఆర్థిక రంగంలో రాణించిన ఆయనలోని ప్రతిభా పాటవాలను గుర్తించిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు తన క్యాబినెట్‌లో ఆర్థిక మంత్రిగా మన్మోహన్‌ను నియమించుకున్నారని తెలిపారు. ఆయన ఓ స్థితప్రజ్ఞుడని కొనియాడారు. ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించేందుకు రాష్ట్ర శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశమైంది. సీఎం రేవంత్‌తోపాటు మంత్రులు, శాసనసభ్యులు ఈ సందర్భంగా మన్మోహన్‌కు ఘన నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం ఈ దేశానికి తీరని లోటు. మౌనముని అంటూ ఎన్ని విమర్శలు వచ్చినా ఆయన తన సహనాన్ని కోల్పోలేదు. దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడంపైనే దృష్టిసారించారు. ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఆదర్శంగా తీసుకునే వారిలో మన్మోహన్ సింగ్ మొదటి వరుసలో ఉంటారు. ఆయన నీతినిజాయితీలకు రోల్‌మోడల్. మాజీ ప్రధాని నిరాడంబరత మనందరికీ ఆదర్శనీయం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్లమెంటు సభ్యులుగా మాతో పాటు ఆయన ఢిల్లీలో నిరసనలో పాల్గొన్నారు. ఇది మాకు జీవిత కాలం గుర్తుండిపోయే సంఘటన. పార్లమెంట్ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నిరసనలో పాల్గొనడం ఆయన నిరాడంబరతకు నిదర్శనం. ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చి పేదలకు 100 రోజులు పని కల్పించిన వ్యక్తి మన్మోహన్ సింగ్. ఆహార భద్రత, సమాచార హక్కు చట్టాలను తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి ఆయన. 2013 భూసేకరణ చట్టం తెచ్చి భూమి లేని పేదలకు మేలు జరిగేలా చేశారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని తీసుకొచ్చిన వ్యక్తి మన్మోహన్‌సింగ్. అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆయన చట్టాలు తీసుకొచ్చారు. అలాంటి గొప్ప మానవతావాదిని కోల్పోవడం దురదృష్టకరం. ఆయన తీసుకొచ్చిన సరళీకృత విధానాలు మన దేశ దశ-దిశను మార్చాయి. ప్రపంచానికి మేధోసంపత్తిని ఎగుమతి చేసేస్థాయికి దేశం ఎదగడానికి కారణం మన్మోహన్‌సింగ్ తీసుకొచ్చిన సంస్కరణలే కారణం. దేశానికి ఆయన మాజీ ప్రధాని, మాజీ ఆర్థిక మంత్రి...కానీ తెలంగాణకు మాత్రం ఆత్మబంధువు. తెలంగాణకు పురుడుపోసిన వ్యక్తిగా ఆయన్ను ఇక్కడి ప్రజలు గుండెల్లో ...13లో

సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్

మోడ్రన్ ఇండియా..

బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్

వివరాలు 3లో

మన్మోహన్ గొప్ప నేత

చనిపోయాడని తెలిసీ

రాహుల్‌గాంధీ వియత్నాం వెళ్లడమేంటి?

బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

సంతాప తీర్మానంపై ఇలా మాట్లాడటం తగదు

ఆయన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలి :

మంత్రి శ్రీధర్‌బాబు... తొలగించిన సభాపతి

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటాం

నైపుణ్యాభివృద్ధి..మౌలిక వసతుల పెంపు సీఎం దార్శనికతకు నిదర్శనం :

మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల

సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేక భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటామని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల తెలిపారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మంత్రులు



శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆయనతో భేటీ అయ్యారు. ఐటీ రంగంలో రాష్ట్ర ప్రగతి, పెట్టుబడులు, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాలపై ఈ ...13లో



టీఎస్ యూటీఎఫ్

రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షులుగా చావ రవి,

ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకట్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

నల్లగొండ జిల్లా కేంద్రం లక్ష్మీగార్డెన్స్‌లో జరిగిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర 6వ మహాసభ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా 21 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా చావ రవి, ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకట్, ఉపాధ్యక్షులుగా కె.జంగయ్య, సిహెచ్.దుర్గాభవాని ఎన్నికయ్యారు. కోశాధికారిగా ...13లో

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు కేంద్రమంత్రిగా కొనసాగే అర్హత లేదు

రాష్ట్రపతి జోక్యం చేసుకుని

ఆయన్ను బర్తరఫ్ చేయాలి :

వామపక్ష పార్టీల డిమాండ్

హైదరాబాద్‌లో నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు కేంద్ర మంత్రిగా కొనసాగే అర్హత లేదన్నాయి. ఆయన దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. రాష్ట్రపతి



ద్రౌపది ముర్ము జోక్యం చేసుకుని కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కోరాయి. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని నారాయణ గూడ వైఎంసీఏ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. 'రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని రక్షించుకుందాం, అమిత్‌షా రాజీనామా చేయాలి, కేంద్రమంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటులో అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన కేంద్ర హోంమంత్రి రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా మాట్లాడారని చెప్పారు. దేశ ప్రజలు ఖండిస్తున్నా, దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నా అమిత్‌షా తన తప్పును అంగీకరించడం లేదనీ, ప్రజలకు క్షమాపణ చెప్పడం లేదని అన్నారు. ఆయన అనుచిత వ్యాఖ్యలపై ఇతర మంత్రులు, ...13లో

నిప్పులు చిమ్ముతూ


నింగిలోకి

అంతరిక్షంలోకి

2 స్పేడేక్స్ ఉపగ్రహాలు

పీఎస్ఎల్వీ సీ-60 ప్రయోగం

విజయవంతం 5లో..





ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం

ఆర్ఎస్ఎస్, బీజేపీ నుంచి దేశాన్ని విముక్తి చేయాలి

లౌకిక, వామపక్ష శక్తులన్నీ ఐక్యంగా పోరాడాలి

దేశాన్ని మతతత్వ దేశంగా

మార్చడాన్ని వ్యతిరేకించిన అంబేద్కర్ :

నల్లగొండలో సీపీఐ 100 వసంతాల

బహిరంగ సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

వివరాలు 5లో



గర్జించిన రైతన్న

6లో..

కేంద్రం వైఖరికి నిరసనగా పంజాబ్ బంద్

స్తంభించిన జనజీవనం

163 రైళ్లు రద్దు... నిలిచిన రాకపోకలు

ప్రజల నుంచి విశేష స్పందన

వాణిజ్య సంస్థల మద్దతు, మూసివేత

వైద్య బీమా కంపెనీల దోపిడీ



13లో

29 శాతం క్లెయిమ్స్ తిరస్కరణ

71 శాతం కేసుల పరిష్కారం

పాలసీదారులపై

రూ. 16,000 కోట్ల భారం

అంబుడ్స్‌మెన్‌కు 34వేల ఫిర్యాదులు :

ఐఆర్‌డీఏఐ రిపోర్ట్



గుదిబండగా మెట్రోలు!

ఖర్చు ఎక్కువ..రాబడి తక్కువ | తగ్గిపోతున్న ప్రయాణికుల డిమాండ్

- దూర ప్రయాణాలకే పరిమితం
- చౌకైన ప్రజా రవాణా వ్యవస్థ ఉండాలంటున్న నిపుణులు

న్యూఢిల్లీ : పేదలు, సామాన్య ప్రజల ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రధాన నగరాల్లో మెట్రో రైళ్లను పరుగులు పెట్టించేందుకు కృతనిశ్చయంతో ఉంది. యాభై నగరాల్లో మెట్రోలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోడీ 2016లో పూనే మెట్రోకు



భూమిపూజ చేసిన సందర్భంగా ప్రకటించారు. రాబోయే పాతిక ముప్పై సంవత్సరాల కాలంలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. మెట్రో రైలు నడిపిన వెంటనే లాభాలు రావని, కానీ అవి నడవడం మొదలు పెట్టిన 2-4 సంవత్సరాల్లో లాభాల బాట పడతాయని కూడా చెప్పారు.

2014కు ముందు...ఆ తర్వాత

2014కు ముందు మెట్రో రైల్ వ్యవస్థ కేవలం ఐదు నగరాలకే... కోల్‌కతా, ఢిల్లీ, గుర్‌గావ్, బెంగళూరు, ముంబయి...పరిమితమైంది. ఈ నగరాలన్నింటిలో కలిపినా ఆ వ్యవస్థ కేవలం 229 కిలోమీటర్లకే పరిమితమైంది. పది సంవత్సరాలు గడిచిన తర్వాత...అంటే ఈ ఏడాదిలో మెట్రో నెట్‌వర్క్ 900 కిలోమీటర్లకు పైగా విస్తరించింది. ప్రస్తుతం 13 ప్రధాన నగరాల్లో (సమీపంలోని ...13లో

ఎమ్మెల్సీ ఓటర్ల

తుది జాబితా విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజకవర్గాలతో పాటు వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజక వర్గాల ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి.సుదర్శన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు స్వీకరించిన అభ్యంతరాల అనంతరం తుది జాబితాను ఖరారు చేసినట్టు ఆయన వెల్లడించారు. గతంలో కంటే మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో 26,782, టీచర్స్ నియోజకవర్గంలో 2,319, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 2,351 ఓటర్లు పెరిగారని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎన్నికల సంఘం వెబ్‌సైట్ చూడాలని పేర్కొన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల తుది జాబితా
మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్
గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం

ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్లు: 499
పురుష ఓటర్లు - 2,18,060
మహిళా ఓటర్లు - 1,23,250 ...13లో



సభా పర్వం

దేశానికి దిశ, దశ చూపారు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశ ఆర్థిక వ్యవస్థకు దశ, దిశ చూపిన వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆయనపై పీవీ నరసింహారావు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయలేదని వ్యాఖ్యానించారు. లైసెన్స్ రాజ్, పర్మిషన్ రాజ్, కోటా రాజ్ విధానాలకు మన్మోహన్ స్వస్తి పలికారని తెలిపారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో సోమవారం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై ఆయనకు నివాళి అర్పించింది ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ యూపీఏ హయాంలో ఎన్నో కుంభకోణాలు జరిగినట్టు వార్తలు వచ్చాయని చెప్పారు. కానీ ప్రధానిగా ఉన్న మన్మోహన్‌సింగ్‌పై ఒక్క అవినీతి ఆరోపణ రాలేదని గుర్తుచేశారు. మన్మోహన్ జీవితం దేశ సేవలో ధన్యమైందని చెప్పారు. ఆయన సేవలను గుర్తుంచుకునేలా ప్రభుత్వాలు ఏం చేసినా బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని అభిప్రాయపడ్డారు. పీవీ ఖ్యాతిని చాటేలా బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందనీ, స్కిల్ వర్సిటీకి మన్మోహన్ పేరు పెట్టాలని ప్రతిపాదించారు. భారతరత్న అవార్డుకు మన్మోహన్ సింగ్ 100 శాతం అర్హులేనని చెప్పారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని బీఆర్ఎస్ కోరుతున్నదని తెలిపారు. గతంలో పీవీకి భారతరత్న ఇవ్వాలని బీఆర్ఎస్ తీర్మానించిందనీ, దానికి అనుగుణంగా కేంద్రం దేశ అత్యున్నత పౌర పురస్కారం ఇచ్చిందని గుర్తుచేశారు. గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను బాగుచేసేందుకు పీవీ-మన్మోహన్ ద్వయం కృషి చేసిందని వివరించారు. 1996లో కాంగ్రెస్ ఓటమికి ఆర్థిక సంస్కరణలూ కారణమని ఓ కమిటీ నివేదిక ఇచ్చిందనీ, దానిని చూసిన మన్మోహన్ సింగ్ కంటతడి పెట్టారని పేర్కొన్నారు. మన్మోహన్ భౌతికంగా లేకున్నా ఆయన చేసిన సేవలు ఎప్పటికీ ఉంటాయన్నారు. విదేశాల్లోనూ ఆయనకు ఉన్నత ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వాటికంటే దేశమే ముఖ్యమని చాటిన గొప్ప వ్యక్తి మన్మోహన్ అని చెప్పారు. ఆయన ఎప్పుడూ పదవుల కోసం చూడలేదని, పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. మన్మోహన్ సంతాప తీర్మానాన్ని మండలిలోనూ పెట్టి ఉంటే బాగుండేదని చెప్పారు.

హైదరాబాద్‌లో మన్మోహన్ స్మారకం :మంత్రి కోమటిరెడ్డి



రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జీవిత చరిత్ర తెలిపేలా విగ్రహంతోపాటు స్మారకం ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లాల్లోనూ విగ్రహాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. ప్రపంచం మెచ్చిన ఆర్థికవేత మన్మోహన్ అని కొనియాడారు. పార్లమెంటుకు లంచ్‌బాక్స్ తెచ్చుకునేవారని గుర్తు చేశారు. నోట్ల రద్దుచేస్తే భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని చెప్పారని చెప్పారు. 2016లో అది నిజమైందని వివరించారు. తెలంగాణ కోసం ఢిల్లీలో ధర్నా చేస్తే, ఆయన సైతం అందులో పాల్గొన్నారని గుర్తు చేశారు.

రాజ్యసభలోనూ సేవలందించారు :మంత్రి పొన్నం ప్రభాకర్



మన్మోహన్‌సింగ్ రాజ్యసభలోనూ 33 ఏండ్లపాటు సేవలందించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన కీలకపాత్ర వహించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడారని చెప్పారు. వెంకయ్యనాయుడు, అద్వానీ, అరుణ్‌జైట్లీతో మాట్లాడి తెలంగాణకు మద్దతు ఇవ్వాలని ఒప్పించారని గుర్తు చేశారు. ఆధార్‌తో ప్రజలకు మేలు జరిగిందని వివరించారు. జైపాల్‌రెడ్డి వంటి నాయకులతో తరచూ తెలంగాణ కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. మౌనంగా ఉంటూ అనేక పనులు చేశారని చెప్పారు.

చట్టాలతో ప్రజలకు మేలుచేశారు : మంత్రి సీతక్క



ఉపాధి హామీ చట్టం, ఆహార భద్రత చట్టం, సమాచార హక్కు చట్టాలతో ప్రజలకు మేలు చేశారని సీతక్క చెప్పారు. మన్మోహన్ మాట్లాడితే ప్రపంచం వింటుందని అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా చెప్పేవారని గుర్తు చేశారు. అడవులపై గిరిజనులకు హక్కులు కల్పించారని చెప్పారు. 30 వేల స్కూళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించారని వివరించారు.

విమర్శకుల ప్రశంసలు పొందారు : ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



భరతమాత ముద్దుబిడ్డ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని ఎమ్మెల్యే పి సబితాఇంద్రారెడ్డి తెలిపారు.తన ఆర్థిక విధానాల ద్వారా ప్రపంచానికి మార్గనిర్దేశం చేశారని అన్నారు. ఆయన విమర్శకుల ప్రశంసలు పొందారని అభిప్రాయపడ్డారు. ఉపాధి హామీ చట్టాన్ని చేవెళ్ల మండలం ఆలూరులో ప్రారంభించారని చెప్పారు. దేశాభివృద్ధి కోసం కీలకంగా పనిచేశారని వ్యాఖ్యానించారు.

చర్చలో పలువురు

మన్మోహన్‌సింగ్‌కు నివాళి అర్పించడానికి పలువురు సభ్యులు చర్చలో పాల్గొన్నారు. వేముల ప్రశాంత్‌రెడ్డి, వెంకట్‌రామిరెడ్డి, వివేక్ వెంకటస్వామి, రాజ్‌గోపాల్‌రెడ్డి తదితరులు మాట్లాడి సంతాపం తెలియజేశారు.

కేసీఆర్‌కు స్వయంగా కాల్ చేశా స్పీకర్ ప్రసాద్‌కుమార్




మన్మోహన్‌సింగ్‌కు నివాళి అర్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి ఆహ్వానిస్తూ కేసీఆర్‌కు స్వయంగా కాల్ చేశానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. అయినా ఆయన రాలేదని అన్నారు. అంతకుముందు నివాళి అర్పించేందుకు హరీశ్‌రావు మాట్లాడుతున్న క్రమంలో మన్మోహన్‌తోపాటు కేసీఆర్ గురించి ఎక్కువగా హరీశ్‌రావు మాట్లాడటాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు అభ్యంతరం చెప్పారు. ఎజెండా వరకు పరిమితం కావాలని వారు హరీశ్‌రావుకు సూచించారు. గతంలో జరిగిన పరిణామాలు, మన్మోహన్ ఔన్నత్యాన్ని మాత్రమే తాను గుర్తు చేస్తున్నానని హరీశ్‌రావు వివరణ ఇచ్చారు. ఇందుకు స్పీకర్ సైతం జోక్యం చేసుకుంటూ ఎజెండాకే పరిమితం కావాలని సూచించారు.

జిమ్మి కార్టర్ ఇక లేరు

శాంతి కోసం కృషి చేసిన నేత

పలువురు నేతల సంతాపం



(ఫైల్)

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత జిమ్మి కార్టర్ ఆదిరవారం నాడు కన్ను మూశారు.ఆయన వయసు 100 సంవత్సరాలు. 2000 సంవత్సరంలో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. అమెరికా 39వ అధ్యక్షుడిగా 1977-81 మధ్య పనిచేశారు. కేన్సర్ నుంచి బయటపడిన ఆయన మొన్నటి అధ్యక్ష ఎన్నికల్లోనూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎక్కువ కాలం బతికిన అమెరికా అధ్యక్షుల్లో జిమ్మీ కార్టర్ మొదటి స్థానంలో ఉన్నారు. ఆయన మృతికి పలు దేశాధినేతలు సంతాపం తెలిపారు. ఇటీవలే వందవ పుట్టిన రోజు జరుపుకున్న కార్టర్ భారత్‌కు అత్యంత సన్నిహితుడు. రాజకీయాల నుంచి వైదొలగిన తర్వాత కూడా మరింత శాంతియుతమైన విదేశాంగ విధానం కోసం కృషి చేసిన కార్టర్ మృతికి క్యూబా, వెనిజులా, చైనా తదితర దేశాల నుంచి సంతాపాలు వెల్లువెత్తాయి.

అధికంగా తెలుగు రాష్ట్రాల్లోనే

వ్యవసాయ కార్మికులు అత్యధికంగా 6.8 శాతం

గర్భాశయ శస్త్రచికిత్సలు





- మహిళల ఆరోగ్యంపై ప్రభావం
- కీలకంగా మారిన సామాజిక, ఆర్థిక అంశాలు
- దుర్వినియోగమవుతోన్న ఆరోగ్య బీమా : అధ్యయనం

న్యూఢిల్లీ : భారతీయ మహిళల్లో (పునరుత్పత్తి వయస్సు గల) 4.8 శాతం మంది గర్భసంచిని తొలగించే శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఇవి ఎక్కువగా తెలంగాణ, ఏపీలో ఉన్నాయి. ఈ శస్త్ర చికిత్స చేయించుకున్నవారిలో వ్యవసాయ కార్మికులు అత్యధికంగా 6.8 శాతం మంది ఉన్నారు. అయితే, చాలా మంది మహిళలు ఈ అనవసర విధానాల కోసం ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాలను ఉపయోగించుకోవటం ఆందోళనకరమని ఒక అధ్యయనం వివరించింది. అనేక రాష్ట్రాల్లో ఆరోగ్య సంరక్షణ కోసం ఉద్దేశించిన ఆరోగ్య బీమా పథకాలు ఈ శస్త్రచికిత్స ద్వారా దుర్వినియోగమవుతున్నాయని పేర్కొన్నది.

జర్నల్ ఆఫ్ మెడికల్ ఎవిడెన్స్‌లో ఈ అధ్యయనాన్ని ప్రచురించారు. ముంబయిలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్‌కు చెందిన గౌరవ్ సురేశ్ గున్నాల్, న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు చెందిన డాక్టర్ సుధేష్నా రాయ్‌లు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ అధ్యయనం 25-49 ఏండ్ల వయసు గల భారతీయ మహిళలలో గర్భాశయ శస్త్రచికిత్స ప్రాబల్యం, నమూనాలను హైలెట్ చేసింది.

శ్రమతో కూడిన పని, క్రమం తప్పకుండా పురుగుమందులకు గురికావటంతో వ్యవసాయ కార్మిక స్త్రీలు అధిక రుతుస్రావం, ఫైబ్రాయిడ్లు, గర్భాశయ లోపాలు వంటి స్త్రీ జననేంద్రియ సమస్యలకు గురవుతున్నారు. చాలా మంది వ్యవసాయ కార్మికులు గర్భాశయాన్ని తొలగించటాన్ని ఒక పరిష్కారంగా చూస్తారనీ, ప్రత్యామ్నాయాల గురించి వీరికి అవగాహన లేదని గౌరవ్ గున్నాల్ వివరించారు. అనవసరమైన శస్త్రచికిత్సలను తగ్గించటానికి మరింత అవగాహన, సంరక్షణ తక్షణ అవసరాన్ని ఇది హైలెట్ చేస్తుందని పేర్కొన్నారు.

హెల్త్‌కేర్‌ను మెరుగుపర్చటానికి ఉద్దేశించిన ఆరోగ్య బీమా కొన్ని రాష్ట్రాల్లో సమస్యను మరింత తీవ్రతరం చేసిందని అధ్యయనం వివరించింది. ఆరోగ్య బీమా ఉన్న మహిళలు గర్భాశయ శస్త్ర చికిత్స చేయించుకునే అవకాశం పది శాతం ఎక్కువగా ఉన్నది. బీహార్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాలు అనవసరమైన శస్త్ర చికిత్సలతో ముడిపడి ఉన్నాయి. అవసరం లేని శస్త్ర చికిత్సల కోసం ఆరోగ్య బీమా దుర్వినియోగమవుతున్నదనీ, ఇది ఆరోగ్య సంరక్షణలో అంతరాలను హైలెట్ చేస్తుందని డాక్టర్ సుధేష్నా రాయ్ వివరించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ

దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ(11.1 శాతం), ఏపీ(12.6 శాతం)లో గర్భాశయ శస్త్రచికిత్సలు అత్యధికంగా నమోదవుతున్నాయి. అసోం(1.4 శాతం), మిజోరం(1.5శాతం)లలో తక్కువగానే ఉన్నాయి. ఈ శస్త్ర చికిత్సల్లో 67.5 శాతం ప్రయివేటు హెల్త్‌కేర్‌లలో జరగటం గమనార్హం. మహిళల పునరుత్పత్తి ఆరోగ్యం ఒక వ్యాపారమయంగా మారే విషయాన్ని ఇది వెల్లడిస్తున్నదనీ, ఇది ఆందోళనకరమని అధ్యయనం వివరించింది.

గర్భాశయ విచ్ఛేదన అంశంలో సామాజిక ఆర్థిక కారణాలు కూడా కీలక పాత్ర వహించాయి. పట్టణ ప్రాంతాల్లోని మహిళల కంటే గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీలు ఈ ప్రక్రియకు గురయ్యే అవకాశం 30 శాతం అధికంగా ఉన్నది. ఇందులో విద్య అనే అంశం కూడా కీలకంగా మారింది. తక్కువ విద్యావంతులైన మహిళలు శస్త్రచికిత్సను భరించే అవకాశం ఎక్కువగా ఉన్నది. అత్యంత ధనవంతులైన స్త్రీలు.. అత్యంత పేదరికంలో ఉన్నవారితో పోలిస్తే గర్భాశయ శస్త్రచికిత్స చేయించుకునే అవకాశం రెండు రెట్లు ఎక్కువ అని అధ్యయనం వెల్లడించింది.

40-49 ఏండ్ల వయస్సున్న మహిళలు అత్యధికంగా 9.2 శాతం మంది ఈ శస్త్ర చికిత్సను చేయించుకున్నారు. వారిలోనూ స్థూలకాయులైన మహిళలు 9.2 శాతం మంది, తక్కువ బరువున్న స్త్రీలు 5.1 శాతం మంది ఉన్నారు. గర్భసంచి తొలగింపు అనేది చివరి ప్రయత్నంగానే ఉండాలనీ, ఇది వారి ఆరోగ్యంపై ప్రభావం చూపేలా ఉండొద్దని గౌరవ్ గున్నాల్ వివరించారు.

కంటైనర్ బీభత్సం

- మూడు డీసీఎంలు, టాటా ఏసీ, ద్విచక్ర వాహనం, పోలీస్ రక్షక వాహనాన్ని ఢీకొట్టిన కంటైనర్
- డీసీఎం డ్రైవర్ మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- హైదరాబాద్ ముషీరాబాద్ చౌరస్తాలో ఘటన



నవతెలంగాణ-ఓయూ

రోడ్డు మీద పార్కు చేసి ఉన్న వాహనాలపైకి కంటైనర్ వాహనం దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటనలో పోలీస్ వాహనం సహా ఆరు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముషీరాబాద్ చౌరస్తాలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం..

మేడ్చల్ మనీరాబాద్‌కు చెందిన వరప్రసాద్ తన డీసీఎం వాహనంలో సరుకులు లోడుచేసుకుని ముషీరాబాద్‌కు వెళ్తున్నాడు. ముషీరాబాద్ చౌరస్తాకు చేరుకోగానే టైరు పంక్చర్ అయింది. దాంతో విషయాన్ని అబ్దుల్లా అనే వ్యక్తికి ఫోన్ చేసి చెప్పడంతో ఉప్పల్‌లో ఉన్న అతను స్టెప్నీ టైరును మరో డీసీఎం వాహనంలో వేసుకుని వచ్చి, ఆ వాహనాన్ని పంక్చర్ అయిన డీసీఎం వెనుకనే నిలిపాడు. టైరు మార్చేందుకు జాకీ లేకపోవడంతో గాంధీ ఆస్పత్రి సమీపంలో లారీల వద్దకు వెళ్లి అక్కడ అఖిల్, అహ్మద్ దగ్గర జాకీని తీసుకొని, వారిని కూడా తోడుగా తీసుకొచ్చారు. వెంట వచ్చిన సహాయకులతో కలిసి వరప్రసాద్ టైరు మార్చే పనిలో ఉండగా.. అబ్దుల్లా సెల్‌ఫోన్ లైట్ పెట్టి నిలబడ్డాడు. ఇంతలో రెడీమిక్స్ వాహనం వేగంగా దూసుకొచ్చి రెండు డీసీఎంలను బలంగా ఢీ కొట్టింది. దాంతో అవి ముందుకు కదిలి వరుసగా ఉన్న మరో డీసీఎం, టాటా ఏసీ, సహాయకులకు చెందిన యాక్టివా ద్విచక్ర వాహనం, ఆ తర్వాత పార్క్ చేసిన ముషీరాబాద్ ఠాణాకు చెందిన పోలీస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ క్రమంలో అబ్దుల్లా మీదకు ఓ వాహనం దూసుకు రావడంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. వరప్రసాద్‌కు కూడా తీవ్రగాయాలు కాగా.. అఖిల్, అహ్మద్ స్వల్పంగా గాయపడ్డారు. వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

మృతిచెందిన అబ్దుల్లాది బీహార్ రాష్ట్రంలోని మధుబని జిల్లా అంధ్రాతడే గ్రామం. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ములుగు మండలం బండమైలారంలో ఉంటూ వరప్రసాద్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ముషీరాబాద్ పోలీసులు తనిఖీలు చేపట్టేందుకు చౌరస్తాకు వచ్చి పెట్రోలింగ్ వాహనాన్ని పార్కు చేసి వెళ్లిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. రెడీ మిక్స్ వాహన డ్రైవర్ మద్యం సేవించలేదని, ఆ సమయంలో నిద్ర వచ్చినందన ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చునని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పదేండ్ల కాలంలో బీసీలకు ఏం చేశారో చెప్పాలి

- కల్వకుంట్ల కవితకు చనగాని దయాకర్ ప్రశ్న



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చాక బీసీలపై ఎనలేని ప్రేమ ఒలకబోస్తున్నదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విమర్శించారు. పదేండ్లలో బీసీలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీసీల గురించి కవిత మాట్లాడటం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఏనాడు బీసీల గురించి ఆలోచించలేదని విమర్శించారు. బీసీలకు అవకాశాలు కల్పించేందుకే కాంగ్రెస్ పార్టీ కులగణన చేపట్టాలని కోరుతున్నదని తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ అరెస్టు అయ్యాక ఆ స్థానం కోసం కవిత పోటీ పడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఎత్తుగడలో భాగంగానే బీసీల పేరుతో కవిత ఎంట్రీ ఇచ్చారని తెలిపారు. హరీశ్‌రావు వైపు బీఆర్ఎస్ వెళ్లకుండా కవిత బీసీ వాదంతో డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి బీసీల భవిష్యత్తు కోసం ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. బీసీలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు. రాహుల్ గాంధీ వెనుకబడిన వర్గాల వారికి పెద్దన్నగా ఉందని ఆయన చెప్పారు.

చరిత్రను వక్రీకరించే యత్నమిది

- షేక్ అబ్దుల్లా జయంతి, అమరవీరుల దినం శలవుల రద్దుపై సీపీఐ(ఎం) విమర్శ



శ్రీనగర్ : షేక్ మహ్మద్ అబ్దుల్లా జయంతి, అమరవీరుల దినోత్సవాలను శలవు దినాలుగా రద్దు చేస్తూ జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సీపీఐ(ఎం) విమర్శించింది. ఈ నిర్ణయాన్ని చరిత్రను వక్రీకరించేందుకు చేసే ప్రయత్నంగా సీపీఐ(ఎం) నేత, ఎంఎల్ఏ కుల్గామ్ మహ్మద్ యూసుఫ్ తరిగామి సోమవారం విమర్శించారు. స్వాతంత్ర్యోద్యమానికి, జమ్మూ కాశ్మీర్ ప్రజల సాధికారత కోసం షేక్ మహ్మద్ అబ్దుల్లా చేసిన సేవలను విస్మరించరాదని ఆయన పేర్కొన్నారు. మహిళల సాధికారత, అందరికీ విద్య, నష్టపరిహారం లేకుండా దున్నేవాడికే భూమి వంటి నిర్ణయాల ద్వారానే ప్రజలకు సాధికారత లభించిందని, ఇవన్నీ వారు సాగించిన ఉద్యమాల ద్వారానే వచ్చాయని తరిగామి పేర్కొన్నారు.

అంతటి మహోన్నతుడిని ఇలా అప్రతిష్టపాల్జేయడమంటే చరిత్రను వక్రీకరించడమేనని ఆయన విమర్శించారు. 2025 క్యాలండర్ సంవత్సరంలో శలవు దినాల జాబితా నుంచి జులై 13, డిసెంబరు 5లను తొలగించడం చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. జులై 13 అంటే జమ్మూ కాశ్మీర్‌కు చారిత్రక ప్రాధాన్యత చాలా వుందన్నారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తమ జీవితాలను అర్పించిన వారి త్యాగాలను గుర్తు చేసుకునే రోజదని అన్నారు. అలాగే డిసెంబరు 5 షేక్ సాహిబ్ జయంతి అని, అది కూడా గొప్ప ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. సమాజాన్ని ప్రజాస్వామ్యీకరించడం ద్వారా, నయా కాశ్మీర్ మేనిఫెస్టోలో భాగంగా సమూలంగా భూ సంస్కరణలను అమలు చేయడం, ఉచిత విద్యను ప్రవేశపెట్టడం, మహిళలకు సాధికారత కల్పించడం ద్వారా షేక్ సాహిబ్ ఆయన సహచరులు గొప్ప సేవలందించారని కొనియాడారు. అటువంటి కీలకమైన మైలురాళ్ళను మన స్మృతిపథం నుండి చెరిపివేయడానికి చేసే ప్రయత్నాల వల్ల వారు ఏ విలువలకైతే ప్రాతినిధ్యం వహించారో ఆ విలువలు దెబ్బతింటాయన్నారు. ఇలా చరిత్రను వక్రీకరించడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఒనగూడవన్నారు. ప్రజలను మరింతగా చీల్చడానికే ఈ ప్రయత్నాలు పనికొస్తాయన్నారు. ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా జమ్మూ కాశ్మీర్ ప్రజలను ప్రభుత్వం అవమానపరుస్తోందన్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఇటువంటి విచ్ఛిన్నకర విధానాలను సమైక్యంగా ప్రతిఘటించాల్సిందిగా జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రజలకు సిపిఎం విజ్ఞప్తి చేస్తోందన్నారు.

టీటీడీలో తెలంగాణ మంత్రుల, ప్రజాప్రతినిధుల లేఖలకు అంగీకారం

ఏపీ సీఎం చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో తెలంగాణ ప్రజాప్రతినిధుల విజ్ఞాపన లేఖలను అనుమతించడానికి ఆదేశాలిచ్చిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు టీటీడీకి వెళ్తారని వివరించారు. అనేక రాష్ట్రాల నుంచి వచ్చే సామాన్య భక్తుల సౌకర్యం, రద్దీ, సులభంగా దర్శనం కలిగించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తెలుగు జాతి సత్సంబంధాల నేపథ్యంలో అనుమతి ఇవ్వాలని తాను ఏపీ సీఎం లేఖ రాశానని గుర్తు చేశారు. ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నుంచి ప్రతివారం ఏదైనా రెండు రోజుల్లో (సోమవారం నుంచి గురువారం వరకు) వీఐపీ బ్రేక్ దర్శనం కోసం రెండు లేఖలు, స్పెషల్ ఎంట్రీ దర్శన్ (రూ.300) కోసం రెండు లేఖలు స్వీకరించబడతాయని వివరించారు. ఏపీ సీఎం చంద్రబాబు సమాధానం ఇస్తూ తిరిగి లేఖ పంపించారని తెలిపారు.

చంద్రబాబుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ధన్యవాదాలు

శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి తెలంగాణ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను అంగీకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. సానుకూలంగా నిర్ణయం తీసుకున్నందుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీటీడీ చైర్మెన్ బీఆర్ నాయుడుకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. సిఫారసు లేఖల అంగీకారంతో తెలంగాణ భక్తులకు వెంకటేశ్వర స్వామి దర్శనం, వసతి మరింత సులభమవుతుందని పేర్కొన్నారు. తిరుమలలో తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అంగీకరించాలని కొద్ది రోజుల క్రితం తాను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ చైర్మెన్ బీఆర్ నాయుడుకు వినతిపత్రం అందించామని గుర్తు చేశారు.

విద్యకు కేటాయింపులేవీ..?

అసంతృప్తి వ్యక్తం చేసిన సీఐఐ | నిధులు పెంచాలని సూచన | వృత్తి విద్యను బలోపేతం చేయాలని సిఫారసు

దేశ ప్రగతికి కీలకమైన విద్యా రంగానికి ప్రభుత్వ కేటాయింపులు నానాటికీ తీసికట్టుగా ఉంటున్నాయి. పాఠశాల విద్యా వ్యవస్థ తీరుతెన్నులపై ఎనిమిది దేశాల్లో ఇటీవల నిర్వహించిన అధ్యయనం ప్రకారం మన దేశంలో విద్యా రంగానికి కేటాయింపులు చాలా తక్కువగా ఉంటున్నాయి. గత ఆరు సంవత్సరాల కాలంలో జీడీపీలో విద్యకు కేటాయింపులు కేవలం 2.7-2.9 శాతం మధ్యలోనే ఉన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలంటే కేటాయింపులను జీడీపీలో 6 శాతానికి పెంచాల్సిన అవసరం ఉన్నదని భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన అధ్యయనం తెలిపింది. భారత్, ఆస్ట్రేలియా, చైనా, ఇండోనేషియా, స్వీడన్, థాయిలాండ్, బ్రిటన్, అమెరికా దేశాల్లోని విద్యా వ్యవస్థల తీరుతెన్నులను సీఐఐ పరిశీలించింది.

కేటాయింపులు ఇలా...



పరిశ్రమకు భాగస్వామ్యం కల్పించాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ : 2018-2023 మధ్య కాలంలో భారత్ తమ జీడీపీలో విద్య కోసం 2.7-2.9 శాతం నిధులను మాత్రమే ఖర్చు చేయగా స్వీడన్ (6.7-6.9 శాతం), బ్రిటన్ (5.3-5.6 శాతం) వంటి సంపన్న దేశాలతో పాటు ఇండోనేషియా (3.7-4.3 శాతం), థాయిలాండ్ (4.0-4.3 శాతం) వంటి వర్ధమాన దేశాలు అధిక కేటాయింపులు జరిపాయి. గత ఆరు సంవత్సరాల కాలంలో విద్యా రంగానికి ఆస్ట్రేలియా కేటాయింపులు 8 శాతం, చైనా కేటాయింపులు 2.4 శాతం పెరగగా భారత్‌లో మాత్రం ఎలాంటి పెరుగుదల కన్పించలేదు. ఇండోనేషియాలో విద్యా రంగానికి కేటాయింపులు 2.8 శాతం తగ్గగా స్వీడన్‌లో పెద్దగా మార్పులు జరగలేదు.

వీడని మొద్దు నిద్ర

ఇతర వర్ధమాన దేశాలు తమ జీడీపీలో విద్యకు కేటాయింపులను 5-7 శాతం పెంచుతుంటే భారత్ మాత్రం మొద్దు నిద్ర వీడడం లేదని నివేదిక ఎత్తిపొడిచింది. సీఐఐ తన అధ్యయనం కోసం ప్రభుత్వ నివేదికలతో పాటు ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ), ఐరాస ఎడ్యుకేషన్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) వంటి అంతర్జాతీయ సంస్థలు, విద్యా సంబంధమైన ప్రచురణల నుండి సమాచారాన్ని సేకరించింది.

2020లో జాతీయ విద్యా విధానాన్ని (ఎన్‌ఈపీ) ప్రకటించిన తర్వాత విద్యా రంగాన్ని సంస్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు నూతన చర్యలను చేపట్టిందని సీఐఐకి చెందిన అధికారి ఒకరు తెలిపారు. భారతీయ పాఠశాల విద్యా వ్యవస్థ ప్రమాణాలను ఇతర దేశాల్లోని ప్రమాణాలతో పోల్చడంపై దృష్టి సారించామని ఆయన చెప్పారు.

సెకండరీ స్థాయిలో తగ్గిన ప్రవేశాలు

ప్రాథమిక విద్యలో ప్రవేశాలు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ సంపన్న దేశాలతో పోలిస్తే దేశంలో సెకండరీ స్థాయిలో ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని సీఐఐ అధ్యయనం తెలిపింది. ప్రాథమిక విద్యలో ప్రవేశాల రేటు 103.4 శాతం ఉంటే సెకండరీ స్థాయికి వచ్చే సరికి 79.6 శాతం మాత్రమే ఉన్నదని చెప్పింది. దీనికి భిన్నంగా బ్రిటన్ (100 శాతం), స్వీడన్ (100 శాతం), అమెరికా (98 శాతం), చైనా (92 శాతం) ఆస్ట్రేలియా (90 శాతం), ఇండోనేషియా (82 శాతం), థాయిలాండ్ (80 శాతం)లో సెకండరీ విద్యలో ప్రవేశాలు అధికంగా ఉన్నాయి. సెకండరీ స్థాయిలో ప్రవేశాలు పడిపోవడానికి ప్రధాన కారణం సామాజిక ఆర్థిక అంశాలేనని నివేదిక చెప్పింది. దేశంలో ప్రాంతీయ అసమానతలు, లింగ వ్యత్యాసాలు, గ్రామీణ ప్రాంతాల్లో అవకాశాలు సరిగా లేకపోవడం, మౌలిక సదుపాయాల లేమి వంటి అంశాలు కూడా ఈ పరిస్థితికి కారణమే.

నివేదిక ఏం చెప్పింది?

విద్య విషయంలో ఇతర దేశాలు కూడా సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నాయి. అయినప్పటికీ అవి అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నాయి. మన దేశంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం, ఉపాధ్యాయుల నియామకం కోసం పెట్టుబడులు పెంచాలని, తద్వారా గ్రామీణ-పట్టణ అసమానతలను తగ్గించాలని అధ్యయన నివేదిక సూచించింది. చైనా, ఆస్ట్రేలియా, థాయిలాండ్ దేశాల నుంచి పాఠాలు నేర్చుకొని విద్యా రంగాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించింది. స్పష్టమైన విధానాలు, ఉపాధ్యాయులకు శిక్షణ, వనరుల కేటాయింపు ద్వారా పురోగతి సాధించాలని సిఫారసు చేసింది. విద్యను అభ్యసించడంలో సామాజిక, ఆర్థిక అసమానతలు అడ్డంకి కారాదని, ఆస్ట్రేలియా తరహాలో ఈ రంగానికి నిధులు సమకూర్చుకోవాలని చెప్పింది. వృత్తి విద్యను బలోపేతం చేసి దానిని పరిశ్రమతో అనుసంధానం చేయాలని సూచించింది. స్వీడన్, ఆస్ట్రేలియా దేశాలు విద్యను నేర్పడంతో పాటు అప్రెంటీస్‌షిప్ అవకాశాలు కూడా కల్పిస్తున్నాయని గుర్తు చేసింది. చైనా, థాయిలాండ్‌లో పరిశ్రమ భాగస్వామ్యం ఎక్కువగా ఉంటుందని, అలాగే బ్రిటన్, అమెరికాలో సెకండరీ పాఠశాలలోనే వృత్తి విద్యను నేర్పుతారని, దీనివల్ల విద్యార్థులు విద్యా సంబంధమైన పరిజ్ఞానంతో పాటు వృత్తి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటారని సీఐఐ నివేదిక తెలియజేసింది. భారత్ కూడా అప్రెంటీస్‌షిప్ కార్యక్రమాలను విస్తరించాలని, పరిశ్రమ-పాఠశాల మధ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పాలని సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లో వర్చువల్ ల్యాబ్స్, మొబైల్ ట్రైనింగ్ యూనిట్లను విస్తరించాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. కార్మికులు, ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచాలని, ఉద్యోగావకాశాలు మెరుగుపరచాలని సీఐఐ అధ్యయన నివేదిక ప్రభుత్వాన్ని కోరింది.

సమస్య ఏదైనా కొట్లాడేది ఎర్రజెండానే..

ప్రజలు వామపక్షాలను కోరుకుంటున్నారు

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభకు చారిత్రాత్మక ప్రాధాన్యత : సంగారెడ్డిలో 'మీట్ ది ప్రెస్'లో ఎస్.వీరయ్య



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"రాష్ట్రం వామపక్షాలను కోరుతోంది. ఇప్పుడు ఎర్రజెండా అవసరం ఏర్పడింది. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ పాలన చూశాం. తాజాగా ఏడాదిపాటు కాంగ్రెస్ పాలననూ చూశాం. కేంద్రంలో బీజేపీ అధికారం చెలాయిస్తోంది. వీరి పాలనలో తెలంగాణ ప్రజల జీవితాలు బాగుపడలేదు. మూడు పార్టీలకూ పెద్దోళ్ల, సంపన్నుల ప్రయోజనాలు తప్ప కార్మికులు, కర్షకులు, పేదల సంక్షేమం పట్టలేదు. ప్రజల జీవితాలను, ప్రజాస్వామ్య విలువలను గాలికొదిలేశారు. ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజల పక్షాన కొట్లాడుతున్న ఎర్రజెండా, సీపీఐ(ఎం) అధికారంలోకి వస్తేనే రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రం మార్పు.. ప్రజల జీవితాల్లో మౌలికమైన మార్పులు సాధ్యం' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. జనవరి 25-28 తేదీల్లో సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో "మీట్ ది ప్రెస్" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభకు చారిత్రాత్మక ప్రాధాన్యత ఉందన్నారు. తెలంగాణ ముఖ చిత్రాన్ని మార్చేందుకు అవసరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతికాంశాలను చర్చించి తగిన తీర్మానాలు, నిర్ణయాలు చేయనున్నట్టు తెలిపారు. కార్మికుల కనీస వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా మాత్రమే కొట్లాడిందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఏనాడూ కార్మికుల కష్టాల గురించి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


రాష్ట్రంలో ఎర్రజెండా నాయకత్వంలో లక్ష గుడిసెలేయించి ఇండ్లు లేని పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలని సీపీఐ(ఎం) పోరాడిందని గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాడితే గత ప్రభుత్వం కేసులు పెట్టిందని, తాము అధికారంలోకి రాగానే కేసుల్ని కొట్టేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని విస్మరించారని అన్నారు. ఏడాది పాలన చూస్తే పచ్చి అవకాశవాదమే కనిపిస్తోందన్నారు. మెదక్, కొమురంభీం ప్రాంతాల్లో బీజేపీ మత కల్లోహాలు లేపి అల్లర్లు చేస్తే.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కనీసం ఖండించలేదన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలంటే సీపీఐ(ఎం) బలపడాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. మరోపక్క సామాజికంగా జరుగుతున్న వివక్ష, దాడులకు వ్యతిరేకంగా కూడా సీపీఐ(ఎం) మాత్రమే బాధితుల పక్షాన నిలబడి పోరాడిందన్నారు. కులదురహంకార హత్యలు, దాడుల్ని బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో ఒక్కరోజైనా తప్పుపట్టిన పరిస్థితి లేదన్నారు. రాజకీయాల కోసం మాత్రం మూడు పార్టీలు అంబేద్కర్ పేరును వాడుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో సామాజిక దాడులు జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం కులదురహంకార చర్యలకు వ్యతిరేకంగా కనీసం ప్రచారమైనా చేయడం లేదన్నారు

ప్రజా ఉద్యమాల సారధి సీపీఐ(ఎం): చుక్క రాములు

ప్రజా ఉద్యమాల సారధిగా సీపీఐ(ఎం) పని చేస్తోందని రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం చైర్మెన్ చుక్క రాములు అన్నారు. మహాసభ జయప్రదం కోసం ఆహ్వాన సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తోందన్నారు. 25న స్థానిక పీఎస్‌ఆర్ గార్డెన్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, బివి.రాఘవులు, ప్రతినిధుల సభకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్, ప్రకాశ్‌కరత్ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.మాణిక్, ఎం.నర్సింహులు పాల్గొన్నారు.

వామపక్షాల వల్లే ఆ చట్టాలు



డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు పూర్తి గౌరవమిస్తూనే... దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఆయన భారతదేశ ఆర్థిక విధానాల రూపకల్పనలో పోషించిన కీలక పాత్రను గుర్తిస్తూనే అతి అంచనాలకు లోను కాకూడదు. ముఖ్యంగా 1991-96, 2004-2014 మధ్య సరళీకృత ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర కీలకం. ఈ విషయంలో ఆశ్చర్యకరంగా రఘురామ్‌రాజన్ ఒక విషయం చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని , ఆహార భద్రతా చట్టాన్ని తీసుకొచ్చిన ఘనతను డాక్టర్ సింగ్‌కు అంటగట్టే వాళ్లు ఓ విషయాన్ని మరిచిపోతున్నారని అన్నారు. వామపక్షాలు, అనేక స్వచ్ఛంద సంస్థలు నిర్విరామంగా సల్పిన పోరు వల్లే ఆ చట్టాలు దేశంలో సుసాధ్యమయ్యాయని ఆయన తెలిపారు. పాలకవర్గాలు ఏకగ్రీవంగా అమలు చేయటం నయా ఉదారవాద విధానాల అమల్లో భాగంగానే ఇవి ఉన్నాయి. కష్టజీవులపై ఆ విధానాల విపత్కర పరిణామాలను మన దేశ ఆర్థిక, రాజకీయ స్వావలంబనపై దాడిని నేడు మనం చూస్తున్నాం. వీటిని తేలికగా పక్కకు చెరిపివేయజాలమని గుర్తుంచుకోవాలి.

- వెంకటేష్ ఆత్రేయ

సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా కార్యదర్శిగా పగడాల యాదయ్య

25 మంది సభ్యులతో కమిటీ .. యువతకు చోటు



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా 10వ మహాసభలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా పగడాల యాదయ్య ఎన్నికయ్యారు. 25 మందితో జిల్లా కమిటీని ఎన్నుకోగా.. అందులో 9 మంది సభ్యులతో జిల్లా కార్యదర్శివర్గం ఏర్పాటైంది. ఇబ్రహీం పట్నంలో రెండ్రోజుల పాటు జరిగిన జిల్లా మహాసభలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా రైతు, కార్మిక, నిరుద్యోగం, దళిత, మహిళల సమస్యల పరిష్కారంపై భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళికలను రూపొందించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కాడిగళ్ల భాస్కర్, బి.సామేల్, చంద్రమోహన్, కవిత, జగదీష్, దుబ్బాక రాంచందర్, కందుకూరి జగన్, ఏర్పుల నర్సింహ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా కె.సుమలత, ఆర్.జంగయ్య, కె.శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం సుందర్, ఏ.నర్సింహ, పి.అంజయ్య, సీహెచ్.బుగ్గ రాములు, సిహెచ్.జంగయ్య, డి.కిషన్, జె.రుద్రకుమార్, కె.నర్సిరెడ్డి, జి.నర్సింహ, సి.శోభన్, ఎన్.రాజు, పి.జగన్, కో-ఆప్షన్‌గా మహిళ ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ప్రారంభోపన్యాసం చేయగా.. భవిష్యత్ ప్రణాళికలు ప్రకటిస్తూ నూతన కమిటీని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ పరిచేయం చేస్తూ ముగింపు ప్రసంగం చేశారు.

బోయింగ్ విమానాలన్నింటికీ

భద్రతా తనిఖీలు

దక్షిణ కొరియా అధ్యక్షుని ఆదేశాలు



సియోల్ : దక్షిణ కొరియా ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తున్న బోయింగ్ విమానాలన్నింటికీ భద్రతా తనిఖీలు నిర్వహిస్తామని దక్షిణ కొరియా అధికారులు సోమవారం తెలిపారు. ఇటువంటి తరహా బోయింగ్ విమానాలు 101 వున్నాయి. ఆదివారం జరిగిన విమాన ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. ఈ విమాన ప్రమాదంతో దేశ వైమానిక రంగం భద్రతపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. దేశ వైమానిక నిర్వహణా వ్యవస్థలపై అత్యవసరంగా సమీక్ష చేపట్టాల్సిన అవసరం వుందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కొత్త తాత్కాలిక అధ్యక్షుడు చోయి సాంగ్ మాక్ సోమవారం అధికారులను ఆదేశించారు. ఈ విమాన ప్రమాదంపై ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వుండేందుకు మొత్తంగా వైమానిక రంగ భద్రతా వ్యవస్థను పునర్వ్యవస్థీకరిచండం అవసరమని చోయి అభిప్రాయపడ్డారు.

మన్మోహన్ గొప్ప నేత

చనిపోయాడని తెలిసీ రాహుల్‌గాంధీ వియత్నాం వెళ్లడమేంటి? : బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

సంతాప తీర్మానంపై ఇలా మాట్లాడటం తగదు

ఆయన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలి: మంత్రి శ్రీధర్‌బాబు... తొలగించిన సభాపతి



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గొప్ప నేత అనీ, ఆయనపై శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నామని బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. పీవీ పట్ల కాంగ్రెస్ కక్ష పెంచుకున్నదని ఆరోపించారు. పదేండ్లు యూపీఏ ప్రభుత్వమే అధికారంలో ఉండగా పీవీకి భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు ఆ పురస్కారాన్ని ఇచ్చామని గుర్తు చేశారు.

ఒకానొక దశలో మన్మోహన్‌సింగ్ తెచ్చిన ఆర్డినెన్స్ కాపీలను రాహుల్‌గాంధీ చించేశారని వ్యాఖ్యానించారు. ఓపక్క మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి కేంద్ర ప్రభుత్వం ఐదు రోజుల సంతాప దినాలు ప్రకటిస్తే.. రాహుల్ గాంధీ న్యూ ఇయర్ వేడుకల కోసం వియత్నాం వెళ్లడమేంటని నిలదీశారు. ఈ దశలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ... సంతాప తీర్మానంపై ఇలా మాట్లాడటం సరిగాదన్నారు.

ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరారు. ఆ వ్యాఖ్యలను తొలగిస్తున్నట్టు సభాపతి ప్రకటించారు. అయినా ఏలేటి మళ్లీ రాహుల్‌గాంధీపై అవే వ్యాఖ్యలు చేయడంతో మంత్రి పొన్నం సీరియస్ అయ్యారు. ఇది సభామర్యాద కాదని హితవు పలికారు. సభలో ఏవోమాటలు మాట్లాడి తానున్న (బీజేపీ) పార్టీలో పేరుతెచ్చుకోవాలని చూడటం ఏలేటికి మంచిది కాదని సూచించారు. ఆయన సభలో ఏం మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదని విమర్శించారు.

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ..దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి సంక్షేమం వైపు నడిపించిన మహనీయుడు మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. ఆర్థిక వేత్తగా, ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధానిగా దేశంపై ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఆ మహనీయుని మరణం యావత్ దేశానికి తీరనిలోటని తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, దేశ ఆర్థిక స్థితిగతులను మార్చేసిన మన్మోహన్ ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ సంస్కరణల్లో మానవీయ దృక్పథాన్ని జొప్పించారన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా లక్షలాది మంది గిరిజనులకు ఉపయోగం జరిగిందని తెలిపారు. మన్మోహన్‌సింగ్ హయాంలో దేశంలోని రైతులందరి రుణాలు మాఫీ చేశారని గుర్తుచేశారు. తెలంగాణ బిల్లు సభలోకి వచ్చిన క్లిష్టసమయంలో ప్రధానిగా ఆ బిల్లును ఆమోదించడంలో ఆయన ప్రదర్శించిన రాజకీయ చతురతను కొనియాడారు.

ఎంఐఎం సభ్యులు మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ..మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన తీసుకొచ్చిన కీలక చర్యలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని చెప్పారు. ఆయన గొప్ప నేత అని కొనియాడారు. బీఆర్‌ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో పీవీ నర్సింహారావు ప్రధాని పదవిని చేపట్టారనీ, పీవీ-మన్మోహన్‌సింగ్‌తో కలిసి దేశాన్ని గాడిలో పెట్టారని కొనియాడారు.

సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్

మోడ్రన్ ఇండియా...

బీఆర్‌ఎస్ సభ్యులు కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్థికరంగంలో దేశాన్ని ముందుకు నడిపించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్...సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడ్రన్ ఇండియా అని అసెంబ్లీలో బీఆర్‌ఎస్ సభ్యులు కేటీఆర్ అభివర్ణించారు. ఆయన గొప్పతనాన్ని, సామర్థ్యాన్ని, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన ఘనత తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకే దక్కుతుందని కొనియాడారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదనీ, ఆ రకంగానే మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ ఏర్పడిందని గుర్తుచేశారు. సోమవారం శాసనసభలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి కేటీఆర్ మద్దతు తెలిపారు. మన్మోహన్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నా మన్నారు. ఢిల్లీలో మాజీ ప్రధానులందరి పేరిట మెమోరియల్స్ ఉన్నాయనీ, తెలంగాణ బిడ్డ పీవీ నర్సింహారావు పేరిట లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. దేశ రాజధానిలో పీవీ మెమోరియల్ భవనాన్ని ఏర్పాటు చేయాలంటూ అసెంబ్లీలో తీర్మానించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'లాటరీ ఎంట్రీ రాజకీయాల'తో సంబంధ లేని ఆర్థిక వేత్త అయిన మన్మోహన్‌సింగ్‌ను పీవీ...ఆర్థిక మంత్రిగా నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన మంత్రి అయ్యే నాటికి కేవలం 15 రోజుల విదేశీ నిల్వలు మాత్రమే మనదగ్గర ఉన్నాయని తెలిపారు. ఆ దశ నుంచి విప్లవాత్మక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారని కొనియాడారు. మన్మోహన్ సింగ్ ఎక్కడా డాంబికాలకు, ఆర్భాటాలకు పోకుండా 'సింపుల్ లివింగ్-హై థింకింగ్' అనే పద్ధతినే చివరి వరకూ కొనసాగించారని ప్రశంసించారు, తనకు రాజకీయ అవకాశమిచ్చిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం విశ్వాసపాత్రుడుగా ఉన్నారని కొనియాడారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌కు మన్మోహన్‌సింగ్‌తో ఉన్న అనుబంధాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని మాట్లాడేందుకు వెళ్లినప్పుడు తెలంగాణ బృందానికి గంటన్నరకుపైగా సమయం ఇచ్చి సమస్య తీవ్రతను అర్థం చేసుకున్నారని తెలిపారు. యూపీఏ-1 హయాంలో కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇచ్చినప్పుడు డీఎంకేతో చిక్కుముడి ఏర్పడిందనీ, అప్పుడు తమ నేత కేసీఆర్ ప్రధాని మన్మోహన్ వద్దకు వెళ్లి తాను వచ్చింది పదవుల కోసమో, పోర్టుఫోలియోల కోసమో కాదు.. తెలంగాణ కోసమని చెప్పి, ఆ మంత్రిత్వ శాఖను డీఎంకేకి ఇచ్చారని గుర్తుచేశారు. 'మీరు తీసుకున్న నిర్ణయంతో గుర్తింపు వస్తుంది, కర్మయోగిగా నిలుస్తారంటూ' ఆనాడు మన్మోహన్... కేసీఆర్‌కు చెప్పిన మాటల్ని ప్రస్తావించారు. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని అర్థం చేసుకున్నారు కాబట్టే రాష్ట్ర ఏర్పాటుకు ఆయన సహకరించారని చెప్పారు. కేసీఆర్ ఆదేశాల మేరకు మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల్లో తాము పాల్గొన్నామనీ, కుటుంబ సభ్యులను పరామర్శించామని తెలిపారు.

సంపాదకీయం

ఈశ్వర్ అల్లా తేరానామ్..!

నేడు దేశంలో బీజేపీ బాపుజీపై చూపుతున్న గౌరవం కానీ, ఒలకపోస్తున్న ప్రేమ కానీ చూస్తుంటే

"పైపై సొగసులు కల్ల సుమా!
లోపలిదంతా డొల్ల సుమా!
నిజం తెలియమని నేనంటాను
లేదా కొంపే గుల్ల సుమా!"

అన్న దాశరథి కృష్ణమాచార్య కవితా వాక్కులు గుర్తుకు రాకమానవు. నిన్న (సోమవారం) మహాత్మాగాంధీ 76వ వర్ధంతి సందర్భంగా బాపు ఘాట్‌కు ప్రధానమంత్రి దగ్గర నుంచి చోటామోటా నేతల వరకు క్యూ కట్టి నివాళులర్పించి, అక్కడ జరిగే సామూహిక ప్రార్థనల్లో కూడా పాల్గొన్నారు. వాళ్లే నిన్నటికి నిన్న పాట్నాలో నిర్వహించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో మహాత్ముడిపై ద్వేషాన్ని వెళ్లకక్కారు. భోజ్‌పురి గాయకురాలు దేవి గాంధీజీకి అత్యంత ప్రీతిపాత్రమైన 'రఘుపతి రాఘవ రాజారామ్' భజనను ఆలపిస్తున్న తరుణంలో అందులో 'అల్లా' అన్న పదం వచ్చిందన్న కారణంతో ఆమెను కమల దళం అడ్డుకున్నది. కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే సహా పలువురు నాయకులు ఆమె నుండి మైక్రోఫోన్ లాక్కొని జైశ్రీరాం అంటూ నినాదాలు చేయడం గర్హనీయం. అల్లా పేరును ఉచ్ఛరించి నందుకు క్షమాపణ చెప్పాలంటూ ఆమెపై ఒత్తిడి తెచ్చి మరి చెప్పించారు. 'జై సీతారామ్'కు బదులు 'జై శ్రీరాం' అని నినదించాలని ఒత్తిడి తెచ్చారని ఆమె వాపోయారు.

> మన దేశ సామాజిక సాంస్కృతిక బహుళత్వాన్ని అర్థం చేసుకుని, ఐక్యతను సాధించాలని తపన పడిన నాయకుడు గాంధీజీ. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర, ప్రజలను ఏకం చేసిన తీరు చరిత్రలో నిలిచిపోయే ఒక అధ్యాయం. కానీ నేడు ఆ చరిత్రనూ కనుమరుగు చేసే ప్రయత్నాలూ జోరుగా సాగుతున్నాయి. ఆయన ఆలోచనలపై ఆచరణపై భిన్నమైన అభిప్రాయాలెన్ని ఉన్నప్పటికీ నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకూ, భిన్నత్వంలో ఏకత్వానికి ముంచుకొస్తున్న ముప్పుకూ ఆనాటి విద్వేష హింసాలోచనల పరంపరనే.



'ఈశ్వర్ అల్లా తేరానామ్, సబ్‌కో సమ్మతి దేభగవాన్' అని పాడుకున్న జాతిపిత గుండెలను తుపాకీ గుండుతో చీల్చిన గాడ్సే వారసులకు ఆ గీతంలో విద్వేషం కాక ఐక్యత కనబడాలని ఆశించడం అత్యాశే అవుతుంది. ఈ దేశంలో ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని కాంక్షిస్తూ మహాత్ముడు 'రఘుపతి రాఘవ రాజారామ్' భజన గీతానికి 'ఈశ్వర్ అల్లా తేరే నామ్, సబ్‌కో సమ్మతి దేభగవాన్' అన్న వాక్యాలను జోడించారు. సూమారు వంద ఏండ్లకు ఆ గీతంలోని 'అల్లా' అన్న పదం కేంద్రపాలకులను కలవరపాటుకు గురిచేస్తోంది. మహాత్ముడి సత్యాహింసలు, సత్యాగ్రహ సూత్రాలు ప్రపంచ ప్రాచుర్యం పొందినట్టుగానే, నిన్నటి విద్వేషాన్ని కూడా ప్రపంచ మీడియా చర్చిస్తున్నది. కానీ అధర్మం, అసత్యం రాజ్యమై సత్యాలోచనలను అణచివేస్తున్నది.

అన్ని మతాల ప్రజలు అన్నదమ్ములుగా సహనంతో జీవించాలని ఘోషించినందుకు ఆనాడు మతోన్మాదికి ఆగ్రహం తెప్పించింది. స్వేచ్ఛ, సమానత్వాలను కోరుకున్నాడు గాంధీ. ఇవేవీ గాడ్సే భావానుచరులకు మింగుడుపడని విషయాలు. అందుకే వాళ్లిప్పుడు సత్యం, న్యాయం, సమానత్వం గురించి మాట్లాడే వారిని అణచివేసే హతమార్చే పనిలో ఉన్నారు. అందుకు అనేక ఉదాహరణలున్నాయు."యూపీ మే కాబా?" అని ఉత్తరప్రదేశ్‌లో ప్రజల బాధలను, రాజకీయుల దుర్మార్గాలను, సామాజిక పరిస్థితులను వ్యంగ్యంగా గానం చేసిన భోజ్‌పురి జానపద గాయని నేహాసింగ్‌కు నోటీసులిచ్చి నానా యాగీ చేసింది యోగీ సర్కార్. ఎవరు గొంతు విప్పినా వీరు నిర్బంధకాండకు పూనుకుంటున్నారు. ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మత సామరస్యత పోయి, మత విద్వేషం, మానవతా విధ్వంసం పెల్లుబుకుతున్న సందర్భాన శాంతి, అహింసల గాంధీతత్వాన్ని చర్చించటం సాహసమే.

మన దేశ సామాజిక సాంస్కృతిక బహుళత్వాన్ని అర్థం చేసుకుని, ఐక్యతను సాధించాలని తపన పడిన నాయకుడు గాంధీజీ. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర, ప్రజలను ఏకం చేసిన తీరు చరిత్రలో నిలిచిపోయే ఒక అధ్యాయం. కానీ నేడు ఆ చరిత్రనూ కనుమరుగు చేసే ప్రయత్నాలూ జోరుగా సాగుతున్నాయి. ఆయన ఆలోచనలపై ఆచరణపై భిన్నమైన అభిప్రాయాలెన్ని ఉన్నప్పటికీ నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకూ, భిన్నత్వంలో ఏకత్వానికి ముంచుకొస్తున్న ముప్పుకూ ఆనాటి విద్వేష హింసాలోచనల పరంపరనే. ఇప్పుడదే ఉన్మాదం సామూహిక విపత్తుగా పరిణమించిందన్న వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవాలి.

వాళ్లు వేటినీ వొదలటం లేదు. విద్యను కాషాయీకరించటమే కాదు, విద్యార్థులనూ, ఉపాధ్యాయులనూ మార్చేందుకు బలమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. చైతన్యయుతమైన తెలంగాణ నడిబొడ్డున అయ్యప్పమాలలో ఉన్న విద్యార్థికి పొరపాటున ప్రధానోపాధ్యాయుడి కాలు తగిలిందన్న కారణంతో మతోన్మాదులు రెచ్చిపోయారు. దళిత ఉపాధ్యాయుడిపై కక్షగట్టింది అక్కడి మతతత్వం. బలవంతంగా ఆ గురువుతో విద్యార్థి కాలుపట్టించి క్షమాపణలు చెప్పించటం గమనిస్తే, మన విద్యా వ్యవస్థలోకి మూఢత్వ విద్వేషం ఎలా దూసుకొస్తుందో తేటతెల్లమవుతోంది. ఇది కేవలం ఒక సంఘటనగానే అర్థం చేసుకోలేము. రాబోయే కాలంలో విజ్ఞానానికి, స్వేచ్ఛకు, విద్యార్థులకు, విద్యా వికాసానికి ఎన్ని అడ్డంకులు రానున్నాయో తెలిపే సూచిక కూడా. రామరాజ్యమని చెప్పుకునే పాలకుల కాలంలో ఈ ఘటనలు ఆశ్చర్యపర్చవు. కానీ, కళాకారులు, రచయితలు, మేధావులు గొంతెత్తాల్సిన అవసరాన్ని ఇలాంటి సంఘటనలు ఎరుకపరుస్తున్నాయి.

ట్రంప్ సుంకాల బెదిరింపులు-పర్యవసానాలు



ప్రభాత్ పట్నాయక్

అధిక సుంకాలను విధిస్తానంటూ ట్రంప్ తక్కిన దేశాలను బెదిరిస్తున్నాడు. మొదట బ్రిక్స్ దేశాలను బెదిరించాడు. ఆ దేశాలు గనుక డాలర్ మాధ్యమంలో వ్యాపారం చేయడం మానుకుంటే వాటి సరుకులపై అమెరికాలో 100 శాతం దిగుమతి సుంకం విధిస్తానని ప్రకటించాడు. ఆ తర్వాత వంతు యూరోపియన్ యూనియన్ (ఇ.యు) దేశాలది. 2023లో ఆ దేశాలు అమెరికాకు చేస్తున్న ఎగుమతులు అమెరికా నుండి చేసుకుంటున్న దిగుమతులకన్నా 208.7 బిలియన్ డాలర్ల మేరకు ఎక్కువగా ఉన్నాయి. అంటే వాటితో అమెరికా వాణిజ్యం లోటులో ఉంది. అందుచేత ఆ దేశాలు గనుక అమెరికా నుండి ముడిచమురు, సహజ వాయువు కొనుగోళ్ళను పెంచకపోతే ఆ దేశాల నుండి అమెరికాకు వచ్చే దిగుమతుల మీద సుంకాలను పెంచుతానని హెచ్చరించాడు. ఇవిగాక ప్రపంచంలో ఏ దేశం నుండి అయినా అమెరికాకు దిగుమతయ్యే సరుకులన్నింటి మీదా 10 శాతం సుంకం పెంచుతానని, ప్రత్యేకించి చైనా నుండి వచ్చే దిగుమతుల మీద 60 శాతం పెంచుతానని ప్రకటించాడు. 2023లో చైనా నుండి అమెరికాకు దిగుమతయ్యే సరుకులు ఎగుమతులకన్నా 279.4 బిలియన్ డాలర్ల మేరకు ఎక్కువగా ఉన్నాయి. 2018లోనైతే అవి 418 బిలియన్ డాలర్లు అధికంగా ఉన్నాయి. అప్పటి నుంచి కొంత తగ్గినా, ఇంకా చైనాతో అమెరికా వాణిజ్య లోటు గణనీయంగానే ఉంది.

ఇలా విధించే అధిక సుంకాల ఫలితంగా ఆర్థిక రంగంలో ముఖ్యమైన పరిణామాలు జరుగుతాయి. ఇప్పటికీ ఇ.యు దేశాలు ఇంకా రష్యన్ ముడిచమురు, సహజ వాయువు దిగుమతుల మీద కొంతవరకూ ఆధారపడతూనే వున్నాయి. అది కూడా లేకుండా మొత్తం అమెరికా నుండే కొనుగోలు చేస్తే అప్పుడు దానివలన ఇ.యు దేశాల్లో చమురు ధరలు ఏమీ పెరగకపోవచ్చు. కాని అమెరికాలో పెట్రోలు, సహజ వాయువు ధరలు కనీసం 30 శాతం పెరగుతాయి. ఇయు దేశాలు అదనంగా కొనుగోళ్ళు పెంచిన ఫలితంగా అమెరికన్ చమురు డిమాండ్ పెరుగుతుంది. ముడిచమురు అంతర్జాతీయ ధరలు ఒకే విధంగా ఉంటాయి గనుక ఇ.యు లో దాని ప్రభావం ఉండదు. కాని అమెరికా వద్ద చమురు నిల్వలు తగ్గిపోయి, ఆ దేశంలో పెరిగే డిమాండ్ ను తట్టుకోడానికి అక్కడ ధరలు పెరుగుతాయి. ఇలా పెరిగిన డిమాండ్ ను తట్టుకోడానికి అమెరికా తన చమురు ఉత్పత్తిని అందుకు తగినట్టు పెంచుతుందని ట్రంప్ ప్రకటించాడు. కాని అమెరికాలో చమురు ఉత్పత్తి వ్యాపారం అంతా ప్రైవేటు రంగంలోనే ఉంది. చమురు ఉత్పత్తిని పెంచాలంటే ప్రైవేటు కార్పొరేట్లు అందుకు అదనంగా పెట్టుబడులు పెట్టాలి. అది అంత తేలికేమీ కాదు. ముడిచమురు, సహజ వాయువులను వెలికి తీయడం అనేది పర్యావరణ సమస్యను పెంచుతుంది. పర్యావరణ సమతుల్యతను నిలబెట్టడానికి అమెరికా ఆమోదించిన పరిమి తులను ఉల్లంఘించడం అంత సులభసాధ్యం ఏమీ కాబోదు. దానిని దృష్టిలో ఉంచుకునే ప్రైవేటు పెట్టుబడిదారులు అదనపు పెట్టుబడులను పెట్టడానికి అంత ఉత్సాహాన్ని చూపకపోవచ్చు. అదే విధంగా బ్రిక్స్ దేశాల మీద 100 శాతం సుంకాన్ని అదనంగా విధించడం వలన ఆ దేశాలు దానికి ప్రతీకారంగా తీసుకునే చర్యలు అమెరికన్ ఎగుమతులను దెబ్బ తీసే అవకాశం ఉంది.

అయితే ప్రస్తుతానికి ఇవన్నీ ఇంకా ఆచరణ రూపం దాల్చలేదు. కాని అన్ని దిగుమతులపైనా 10 శాతం సుంకం పెంపు అనే ప్రతిపాదన, చైనా దిగుమతుల మీద 60 శాతం సుంకం పెంపు ప్రతిపాదన కార్యరూపం ధరించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ చర్యల పర్యవసానాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద ఏ విధంగా ఉండబోతున్నాయో ఇప్పుడు చూద్దాం. కాస్సేపు ఈ రెండు చర్యలకూ తక్కిన దేశాల నుండి ప్రతీకార చర్యలు ఉండవనే అనుకుందాం. బైట దేశాల దిగుమతుల మీద సుంకాలు పెరిగితే వాటి ధరలు అమెరికాలో పెరుగుతాయి. అప్పుడు వాటికి బదులు అమెరికన్ ఉత్పత్తులనే కొనుగోలు చేయడానికి అక్కడి ప్రజలు మొగ్గు చూపుతారు. దానివలన అమెరికన్ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. ఆ డిమాండ్‌ను అందుకోడానికి వీలుగా అమెరికన్ కంపెనీలు తమ ఉత్పత్తిని పెంచవలసి వుంటుంది. దాని పర్యవసానంగా అమెరికాలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.



అదే సమయంలో దిగుమతుల మీద సుంకాలు పెంచినందువలన వాటి ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా అమెరికన్ ప్రజల కొనుగోలుశక్తి దెబ్బ తింటుంది. అది ఉపాధి అవకాశాలు తగ్గిపోడానికి దారి తీస్తుంది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి ట్రంప్ ప్రభుత్వం గనుక 'పొదుపు' చర్యలు చేపట్టడం కూడా జరిగితే (అంటే ప్రజా సంక్షేమం మీద ఖర్చు తగ్గిస్తే) ప్రజల కొనుగోలు శక్తి ఇంకా బాగా తగ్గుతుంది. దాని వలన ఉపాధి ఇంకా ఎక్కువగా దెబ్బ తింటుంది. అయితే, రెండోవైపు దిగుమతుల మీద సుంకాలు పెంచినందువలన దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి దాని వలన ఉపాధి అవకాశాలు పెరుగుతాయి గనుక నికరంగా అమెరికాలో అటు ఉత్పత్తి, ఇటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అనుకుందాం.

> నిజానికి అమెరికాలో దిగుమతి సుంకాల పెంపు అనేది కూడా ఎంతో కొంత మేరకు నయా ఉదారవాద చట్రానికి భిన్నమైన చర్యగానే చెప్పవచ్చు. అటువంటి చర్యలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కొంత వరకు సహిస్తుంది. అదే గనుక ఏ దేశమైనా పెట్టుబడుల సంచారం మీద ఆంక్షలు విధిస్తే ఏ మాత్రమూ సహించదు. అందుకే ట్రంప్ పెట్టుబడుల కదలికలను నియంత్రించే విషయంలో ఒక్కమాట కూడా అనలేదు. చైనా పరిస్థితి పూర్తిగా భిన్నం. నిజానికి కొంతకాలంగా అమెరికన్ ప్రభుత్వాలు తమ దేశంలోకి వచ్చిపడుతున్న చైనా ఉత్పత్తుల తాకిడి నుంచి తమ దేశాన్ని కాపాడుకోడానికి చర్యలు తీసుకుంటూనే వున్నాయి.

అయితే తక్కిన ప్రపంచంలో పరిణామాలు వేరేగా ఉంటాయి. అమెరికా విధించిన సుంకాల పెంపు వలన ఆ దేశాల నుండి అమెరికాకు జరిగే ఎగుమతులు తగ్గుతాయి. ఆ మేరకు తమ తమ దేశాల్లో డిమాండ్‌ను పెంచే చర్యలు చేపట్టడం సాధ్యపడదు కనుక ఆ దేశాల్లో ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. నయా ఉదారవాద చట్రంలో చైనా మినహా తక్కిన దేశాలన్నీ ఉన్నాయి కనుక ఆ దేశాల ప్రభుత్వాలు తమ తమ దేశాల్లో డిమాండ్‌ను పెంచడానికి కావలసిన చర్యలను చేపట్టడం సాధ్యపడదు.

అలా డిమాండ్‌ను పెంచాలంటే ప్రభుత్వం చేసే వ్యయాన్ని పెంచాలి. అందుకు తమ దేశ ద్రవ్యలోటునైనా పెంచాలి. లేదా పెట్టుబడిదారుల మీద అదనపు పన్నులనైనా వేయాలి. కాని ఈ రెండు రకాల చర్యలనూ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. ఐనా దానిని లెక్క చేయకుండా ఏ దేశమైనా వ్యయాన్ని పెంచడానికి చర్యలు చేపడితే ఆ దేశం నుండి ద్రవ్య పెట్టుబడి క్షణాల్లో బైటకు తరలిపోతుంది. దాని ఫలితంగా ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ అస్థిరతకు లోనౌతుంది.

నిజానికి అమెరికాలో దిగుమతి సుంకాల పెంపు అనేది కూడా ఎంతో కొంత మేరకు నయా ఉదారవాద చట్రానికి భిన్నమైన చర్యగానే చెప్పవచ్చు. అటువంటి చర్యలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కొంత వరకూ సహిస్తుంది. అదే గనుక ఏ దేశమైనా పెట్టుబడుల సంచారం మీద ఆంక్షలు విధిస్తే ఏ మాత్రమూ సహించదు. అందుకే ట్రంప్ పెట్టుబడుల కదలికలను నియంత్రించే విషయంలో ఒక్కమాట కూడా అనలేదు.

చైనా పరిస్థితి పూర్తిగా భిన్నం. నిజానికి కొంతకాలంగా అమెరికన్ ప్రభుత్వాలు తమ దేశంలోకి వచ్చిపడుతున్న చైనా ఉత్పత్తుల తాకిడి నుంచి తమ దేశాన్ని కాపాడుకోడానికి చర్యలు తీసుకుంటూనే వున్నాయి. అందుకే అమెరికాకు చైనా దిగుమతులు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. అయితే దాని ప్రభావాన్ని వీలైనంత మేరకు తగ్గించడానికి చైనా తన దేశీయ మార్కెట్ ను విస్తరించుకుంటోంది. ఇలా చైనా చేయగలగడానికి కారణం చైనా ఆర్థిక వ్యవస్థ, అందులో ఎన్ని రకాల మార్పులు జరిగినా, ఇప్పటికీ ప్రధానంగా ప్రభుత్వ నియంత్రణలో నడిచే వ్యవస్థగానే కొనసాగుతోంది. అక్కడ రాజకీయ నిర్ణయాలకు లోబడి ఆర్థిక వ్యవహారాలు సాగుతాయి. ఇంకా అక్కడ ప్రభుత్వ రంగమే గణనీయమైన భాగంగా ఉంది. పెట్టుబడిదారుల చేతుల్లో లేని ఈ భాగంలో పెట్టుబడికి, వేతనాలకు సంబంధించిన నిర్ణయాలన్నీ ప్రభుత్వమే చేస్తుంది. తక్కిన ప్రపంచంలో కార్మికుల నిజ వేతనాలు దాదాపు స్తంభించిపోయివున్న ప్రస్తుత కాలంలో చైనాలో కార్మికుల నిజవేతనాలు పెరుగుతున్నాయి. ఇందుకు కారణం అక్కడ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలే. అందుచేత చైనాలోని దేశీయ మార్కెట్ విస్తరణను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలు అడ్డుకోలేవు. కాని తక్కిన పెట్టుబడిదారీ దేశాల్లో అడ్డుకోగలుగుతాయి.

> పెట్టుబడిదారీ విధానం ముందుకు సాగుతున్నకొద్దీ ప్రజలు సోషలిజం, లేదా ఆటవిక వ్యవస్థ-ఈ రెండింటిలో ఏదో ఒకదానిని ఎంచుకోక తప్పని అనివార్య పరిస్థితి ఏర్పడుతుందని రోజా లగ్సెంబర్గ్ చెప్పినది నేడు వాస్తవ రూపం ధరిస్తోంది. పెట్టుబడిదారీ విధానపు తాజా దశ అయిన నయా ఉదారవాద వ్యవస్థ ముందు ఇప్పుడున్న దారులన్నీ మూసుకుపోయాయి. అది ప్రపంచవ్యాప్తంగా మానవ సమాజాన్ని ఆటవిక స్వభావం కల నయా ఫాసిజం వైపు నెడుతోంది. ఈ పరిస్థితి నుండి బైట పడడానికి సోషలిజం కోసం పోరాడడం ఒక్కటే మార్గం.

ఈ కారణంగా అమెరికా విధించే అధిక సుంకాల ప్రభావం వలన చైనా మినహా తక్కిన ప్రపంచ దేశాల్లో ఆర్థిక మాంద్యం మరింత తీవ్రం అవుతుంది (నయా ఉదారవాద చట్రం నుండి బైట పడినప్పుడే ఈ పరిస్థితి నుండి బైట పడడం సాధ్యం). మూడవ ప్రపంచదేశాల్లో, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఈ తీవ్రత మరి కాస్త ఎక్కువగా ఉంటుంది. అమెరికాలో ట్రంప్ దిగుమతి సుంకాలు పెంచితే మౌన ముద్ర పాటించే బ్రెట్టన్‌వుడ్ సంస్థలు మూడవ ప్రపంచ దేశాలకు మాత్రం అటువంటి రక్షణాత్మక చర్యలు చేపట్టవద్దని,

స్వేచ్ఛా వ్యాపారం చాలా విశిష్టమైనదని జ్ఞానబోధలు చేస్తాయి. దానితోబాటు ఆ దేశాలు ద్రవ్యలోటును నియంత్రించే విషయంలో షరతులకు కచ్చితంగా లోబడి వుండేలా ఒత్తిడి చేస్తాయి. ఆ విధంగా మూడవ ప్రపంచ దేశాలన్నీ నిస్సహాయంగా అమెరికన్ ప్రభుత్వం తీసుకునే రక్షణాత్మక చర్యల దుష్ప్రభావాన్ని భరించవలసి వస్తుంది. దానితోబాటు నానాటికీ తీవ్రమయ్యే ఆర్థిక మాంద్యం ప్రభావాన్ని కూడా మోయవలసి వుంటుంది.

ఇలా ఆర్థిక మాంద్యం తీవ్రం అవుతున్నకొద్దీ, రెండో పక్క నయా ఫాసిస్టు ధోరణులు కూడా ప్రపంచవ్యాప్తంగా బలపడతాయి. ఆర్థిక సంక్షోభ కాలంలో కార్పొరేట్లకు, నయా ఫాసిస్టు శక్తులకు నడుమ బంధం బలంగా ఏర్పడుతుంది. ఆ సంక్షోభం ముదురుతున్నకొద్దీ ఈ బంధం కూడా మరింత బలపడుతుంది. ఏవో కొన్ని మైనారిటీ సెక్షన్ల ప్రజలను శత్రువులుగా చిత్రించి సమాజ జీవిత వాస్తవాల నుండి ప్రజల దృష్టిని పక్కకు మరల్చే ప్రచారం ఉధృతమౌతుంది.

పెట్టుబడిదారీ విధానం ముందుకు సాగుతున్నకొద్దీ ప్రజలు సోషలిజం, లేదా ఆటవిక వ్యవస్థ-ఈ రెండింటిలో ఏదో ఒకదానిని ఎంచుకోక తప్పని అనివార్య పరిస్థితి ఏర్పడుతుందని రోజా లగ్సెంబర్గ్ చెప్పినది నేడు వాస్తవ రూపం ధరిస్తోంది. పెట్టుబడిదారీ విధానపు తాజా దశ అయిన నయా ఉదారవాద వ్యవస్థ ముందు ఇప్పుడున్న దారులన్నీ మూసుకుపోయాయి. అది ప్రపంచవ్యాప్తంగా మానవ సమాజాన్ని ఆటవిక స్వభావం కల నయా ఫాసిజం వైపు నెడుతోంది. ఈ పరిస్థితి నుండి బైట పడడానికి సోషలిజం కోసం పోరాడడం ఒక్కటే మార్గం.

(స్వేచ్ఛానుసరణ)

కదిలే కాల చక్రం

నేనే కదిలే కాలచక్రాన్ని
ప్రపంచాన్ని నడిపించే ఒకే ఒక ఆధారాన్ని!
డబ్బు పెట్టి కొనలేని ఖరీదైనా బంగారాన్ని!
వెల కట్టి పొందలేని మెరిసే వజ్రాన్ని!
ఎవరి కంట పడకుండా గాలిలో
నిండిపోయిన పరిమళాన్ని!
పట్టుకుందామని చూస్తే
జారిపోయే పాదరసాన్ని!
అప్పుడప్పుడు గులకరాళ్ళ మీద
నదిలా నడిచే నీటి ప్రవాహాన్ని!
మదిలో కదిలే భావాలకు ప్రతిరూపమై
నిలిచే చిత్రాన్ని!
అంచనాలకు అందని ప్రతిబంధకాన్ని!



ఆచరణకు సాధ్యం కానీ అడ్డంకులను
తొలగించే ఏకైక మార్గాన్ని!
అనుకున్న లక్ష్యం వైపు నడిపించే
ఒకే ఒక సాధనాన్ని!
ఋతువుల ఆగమనాన్ని నిర్దేశించే కాలాన్ని!
అతీతమైన శక్తులకు
అడ్డుగా నిలబడి ఆపే బలాన్ని!
ప్రకృతి నియమాలను శాసిస్తూ నడిపించే
పంచ భూతలాకు అధిపతిని!
కాలచక్రమై తిరిగే రంగుల రాట్నాన్ని!
మానవ మనుగడకు మార్గం చూపే
సమయ సూచికని!
కళ్ళ ముందు కనిపిస్తూ పలకరించే
మూడు ముళ్ళ గడియారాన్ని!
తలరాతలను మార్చే కాగితం మీదున్న
తేదీల రూపంలోని క్యాలెండర్‌ని!
నిరంతరం కాళ్ళు లేకున్నా
కొనసాగే కాలాన్ని!
దారి తప్పి నడిచే ఈ లోకానికి మార్గ
నిర్దేశం చేసి నడిపించే సమయాన్ని!!

- ఎస్.జవేరియా
9849931255

ఆర్ఎస్ఎస్ అధినేత రెండు నాలుకలు

చర్చిలు మసీదుల కింద ఆలయాలున్నా యంటూ సరికొత్త వివాదాలు లేవనెత్తడంపై ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ చేసిన ప్రసంగాన్ని ఎవరైనా ఎలా అర్థం చేసుకోగలుగుతారు? చర్చిలు మసీదుల కింద ఆలయాలున్నాయంటూ కొత్త వివాదాలు లేవనెత్తడం సరికాదంటూ ఆయన డిసెంబర్ 19న పూనేలో మాట్లాడారు. రామమందిరం అనేది హిందువుల విశ్వాసానికి సంబంధించిన అంశమని ఆయన అన్నారు. అయోధ్యలో హిందువుల విశ్వాసానికి సంబంధించిన అంశమైన రామమందిర నిర్మాణం మరిన్ని వివాదాలకు దారితీయరాదని చెప్పారు. "ప్రతిరోజూ ఒక కొత్త విషయం (వివాదం) రగిలించబడుతున్నది. దీన్ని ఎలా అనుమతించగలం? ఇది కొనసాగకూడదు" అని ఆయన ముగింపులో అన్నారు.

ఈ వ్యాఖ్యలపై పరిపరివిధాల వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఆలయాలను ధ్వంసం చేసి ఆ స్థానంలో మసీదులు నిర్మించడం ద్వారా చరిత్రలో జరిగిన తప్పుల పట్ల ఆరెస్సెస్ వైఖరిలో ముఖ్యమైన మార్పు వచ్చినట్టుగా కొందరు భావించారు. అలాటి వివాదాల విషయంలో ఆరెస్సెస్ అసలైన వైఖరిని కప్పిపుచ్చేందుకు మార్పు వచ్చినట్లుగా చేస్తున్న ప్రయత్నంగా మరికొందరు భావించారు.

ఆ వైఖరి నిజంగా మారిందా?

మోహన్ భగవత్ ప్రసంగాన్ని బట్టి ఆరెస్సెస్ ప్రకటిత వైఖరిలో నిజంగా తలకిందులుగా మార్పు వచ్చినట్టుగా అనుకుంటే అది అమాయకత్వమే. భగవత్ నిజంగా ఏం చెప్పారంటే అర్థం చేసుకోవడానికి ఏవైనా ఆధారాలు కావాలంటే మనం 2020లో ఆయన చేసిన ప్రసంగాన్ని గుర్తు చేసుకోవాలి. నాగపూర్‌లో సంఘ్ కార్యకర్తల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతూ ప్రతి మసీదు కిందా ఒక శివలింగాన్ని కనుగొని కొత్త వివాదం లేవనెత్తే ధోరణిని ఆయన విమర్శించారు. ఒక నిర్దిష్ట పరిస్థితుల్లో కొన్ని చారిత్రిక అవశ్యకతల వల్ల ఆరెస్సెస్ రామజన్మభూమి ఆందోళనలో చేరిందని ఆయన వివరించారు. మనం ఆ పని పూర్తి చేశాం. ఇక మరిన్ని ఆందోళనలు చేపట్టాలని మనం కోరుకోవడం లేదు' అన్నారు. అనంతరం ఆయన గ్యానవాపి మసీదు- కాశీ విశ్వనాథ ఆలయం వివాదం గురించి వివరించారు. ఇందుకు సంబంధించి అన్ని వైపుల వారూ ఒక చోట కూర్చుని పరిష్కారం వెతకాలనీ లేదంటే న్యాయవ్యవస్థ అత్యున్నతమైనది గనక కోర్టు నిర్ణయాన్ని ఆమోదించాలనీ పేర్కొన్నారు. ఇస్లాం ఆక్రమణదారులతో భారత్‌కు వచ్చి ఆలయాలను ధ్వంసం చేసిన చారిత్రక నేపథ్యంలో గ్యానవాపి మసీదు వివాదాన్ని ఆయన ముందుకు తీసుకొచ్చారు.

అయోధ్య, కాశీ, మధుర మందిరం/మసీదు వివాదాలు హిందువులకు అనుకూలంగా పరిష్కరించబడాలనేది బీజేపీ, ఆరెస్సెస్ వైఖరి. ఇదే జరిగితే మిగిలిన వివాదాలను చేపట్టనవసరం వుండదు. మోహన్ భగవత్ ప్రసంగం అంతర్యం ఏమంటే బాబరీమసీదు విధ్వంసానికి దారితీసిన ఆందోళనలో ఆరెస్సెస్ పాల్గొన్నది గనక అది విలక్షణమైనది. గ్యానవాపి మసీదు వివాదం కూడా ప్రాధాన్యత కలిగిందే గానీ దానికోసం ఆందోళన అవసరం లేదు. దాన్ని హిందువులు ముస్లిముల మధ్య పరస్పర ఆమోదంతో లేదంటే ఒక కోర్టు నిర్ణయంతో పరిష్కరించాలి. మధురలో ఈద్గా మైదాన్ కృష్ణమందిరం తగాదాకూ ఇదే వర్తిస్తుంది.



నిజంగా జరుగుతున్నదేమిటి?

మోహన్ భగవత్ ప్రస్తుత ప్రసంగం ఆనాటి ప్రసంగం పరిధిలోనే వుంది. రామమందిర ఉద్యమం దానికదే విభిన్నమైందని ఆయన చెబుతున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిపోయింది గనక మరిన్ని ఆందోళనలు వుండకూడదు. వారణాసి మధుర వివాదాలకు సంబంధించి కోర్టుల్లో వాజ్యాలు నడుస్తున్నాయి. అవి కాకుండా ఇతర చోట్ల మసీదు/మందిరం వివాదాలు వద్దని ఆరెస్సెస్ అధినేత అంటున్నారు. అయితే భగవత్ బోధిస్తున్న దానికి వాస్తవంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్నదానికి మధ్య లోతైన గండి వుంది.

> భగవత్ మౌలిక హిందూత్వ ఎజెండా దెబ్బతినకుండా కార్యాచరణ పథకం రూపొందిస్తున్నారు. ప్రస్తుతానికి మొదట అనుకున్న మూడింటికే కట్టుబడి వుండింది. హిందూత్వ రాజ్యం కుదుటపడిన తర్వాత మిగిలిన 'చారిత్రక తప్పులు' సరిదిద్దవచ్చు. 'నాగరిక న్యాయం కోసం సమరం' వదలిపెట్టడం లేదని ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' తాజా సంచిక చూస్తే అర్థమవుతుంది. సంబాల్ గుడిని పునఃస్వాధీనం చేసుకోవడమే ముఖచిత్రంగా ప్రచురించింది. పచ్చి రెండునాల్కల ధోరణి/ద్వంద్వనీతి ఇదే.

ప్రతి మసీదులోనూ శివలింగాన్ని వెతకాల్సిన పనిలేదని 2020లో ఆయన ప్రసంగం చేసిన తర్వాత వివిధ రాష్ట్రాలలో వివిధ మసీదుల మత స్వభావాన్ని గురించి అనేక లీగల్ వివాదాలు లేవనెత్తబడ్డాయి. దాదాపు 17 వాజ్యాలు నడుస్తున్నాయి. సంబాల్ షాహిఇమామ్ జామా మసీదు గురించీ, అజ్మీర్‌లో షరీఫ్ దర్గా గురించిన వాజ్యాలు... వాటిలో తాజాగా వేసినవే.

భగవత్ అంతర్యం ఆర్గనైజర్ సంకేతం

మతపరమైన విభజన రగిలించడం ద్వారా ఎవరూ 'హిందువుల నాయకుడు' కాలేరని మోహన్ భగవత్ అన్నారు. ఈ విధంగా చెప్పడం ద్వారా ఆయన రెచ్చగొట్టే కార్యక్రమాలకు పాల్పడవద్దని ఆరెస్సెస్ వెలుపల వున్న చెదురుమదురు వర్గాలను హెచ్చరిస్తున్నారన్నమాట. న్యాయవ్యవస్థలో కొన్ని వర్గాలు మత ప్రదేశాల వివాదాలపై వాజ్యాలను అనుమతిస్తున్నారని భగవత్‌కు తెలుసు. ఇందుకు సంబంధించిన 1991 ప్రార్థనా స్థలాల చట్టం నిబంధనలను విరుద్ధంగా వారు ఉల్లంఘిస్తున్నారు. ఈ న్యాయప్రక్రియ ద్వారా కాశీ మధుర వివాదాలు హిందువులకు అనుకూలంగా పరిష్కారమవుతాయని ఆయన ఆశిస్తున్నారు. న్యాయప్రక్రియపై ఆయన నమ్మకం నిరాధారమేమీ కాదు. ఎందుకంటే అప్పటి ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ గ్యానవాపి మసీదు సర్వేను కొనసాగించడానికి అనుమతినిచ్చారని భగవత్‌కు తెలుసు.

ఒక పథకం లేకుండా దేశమంతా మందిరం మసీదు వివాదాలు రగిలించే చిత్తానుసార చర్యలు మోహన్ భగవత్ కోరుకోవడం లేదు. అవి సంబాల్‌లో జరిగినట్టుగా హింసాకాండకు అల్లర్లకు దారితీస్తాయి. చాపకిందనీరులా పాలిస్తూ హిందూత్వ ఎజెండాను ఒక వ్యూహాత్మక రీతిలో ముందుకు తీసుకుపోయేపని ఆర్ఎస్ఎస్ మోడీ ప్రభుత్వానికి అప్పగించింది. ప్రభుత్వ వ్యవస్థల్లో అనేకం అంతకంతకూ ఎక్కువగా ఆర్ఎస్ఎస్ పట్టులోకి వస్తుండడంతో వారణాసి మధుర స్థలాలు శాంతియుతంగా చట్టబద్ధమైన పద్ధతిలో స్వాధీనం చేసుకోవడం సాధ్యమయ్యేట్టు కనిపిస్తుంది. సరైన పథకం లేని అరాచక చర్యలు ప్రతికూలంగా పరిణమిస్తాయి. ఇక్కడ భగవత్ మౌలిక హిందూత్వ ఎజెండా దెబ్బతినకుండా కార్యాచరణ పథకం రూపొందిస్తున్నారు. ప్రస్తుతానికి మొదట అనుకున్న మూడింటికే కట్టుబడి వుండింది. హిందూత్వ రాజ్యం కుదుటపడిన తర్వాత మిగిలిన 'చారిత్రక తప్పులు' సరిదిద్దవచ్చు. 'నాగరిక న్యాయం కోసం సమరం' వదలిపెట్టడం లేదని ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' తాజా సంచిక చూస్తే అర్థమవుతుంది. సంబాల్ గుడిని పునఃస్వాధీనం చేసుకోవడమే ముఖచిత్రంగా ప్రచురించింది. పచ్చి రెండునాల్కల ధోరణి/ద్వంద్వనీతి ఇదే.

సుప్రీం కోర్టుకే సాధ్యం

ఈ కారణంగానే 1991 ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ సుప్రీం కోర్టుముందున్న కేసు కీలకంగా మారుతుంది. అలాటి వివాదాలపై అన్ని దిగువ కోర్టుల ముందున్న చట్టపరమైన తగాదాలపై కోర్టు స్టే విధించింది. ఈ రిట్ పిటిషన్లపై నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇప్పటి వరకూ ప్రభుత్వం ఆ పని చేయకుండా దాటవేస్తున్నది. దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనే దాన్నిబట్టి ఈ విషయంలో బిజెపి -ఆర్ఎస్ఎస్ వ్యూహం అర్థం చేసుకునే ఆధారం దొరుకుతుంది. ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటును సమర్థించడమే గాక గట్టిగా అమలులో పెట్టడం ద్వారా సుప్రీం కోర్టు మాత్రమే దీన్ని మొగ్గలోనే తుంచి వేయగలుగుతుంది.

(డిసెంబర్ 25వ తేదీ సంపాదకీయం)

ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో చేనేత గర్జన

కార్మికుల ఉద్యమానికి సీపీఐ(ఎం) పూర్తి మద్దతు : పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు,

సమస్యలపై జనవరి 20న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా : తెలంగాణ చేనేత కార్మిక సంఘం రౌండ్‌టేబుల్ నిర్ణయం

- హాజరైన పలు పార్టీలు, వివిధ చేనేత కార్మిక సంఘాల నేతలు
- చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దు
- చనిపోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకుంటాం: ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



నవతెలంగాణ - ముషీరాబాద్

చేనేత కార్మికుల సమస్యలపై వచ్చే ఏడాది జనవరి 20న జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నా, ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో చేనేత గర్జన నిర్వహించాలని తెలంగాణ చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్‌లో నిర్ణయించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ చేనేతకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్‌కు పలు రాజకీయ పార్టీలు, వివిధ చేనేత కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభ పెద్ద ఎత్తున జరగాలని, ఆ సభలో, ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలు ఈ ప్రభుత్వంలోనూ కొన సాగించే విధంగా కార్మికసంఘాలు పోరాటం చేస్తే తాను ముందుంటానని అన్నారు. చేనేత కార్మికులు ఎలాంటి ఆత్మహత్యలూ చేసుకోవద్దని, ప్రభుత్వం మెడలు వంచైనా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. చనిపోయిన కుటుంబాలకు తమవంతు ఆర్థికసాయం చేస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హామీ ఇచ్చారు. సమస్యలపై ఉద్యమించిన వారికి మద్దతు పూర్తిగా ఉంటుందని అన్నారు. చేనేత పథకాలు అమలయ్యే వరకు, ప్రభుత్వం మెడలు వంచే దాకా పోరాడాలని పిలుపునిచ్చారు.

చేనేత కార్మికులకు సీపీఐ(ఎం) మద్దతు : చెరుపల్లి

చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, చేనేత కార్మికుల ఉద్యమానికి సీపీఐ(ఎం) పూర్తి మద్దతు ఉంటుందని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తెలిపారు. కార్మికుల డిమాండ్లపై చేనేత కార్మిక సంఘం అనేక విధాలుగా పోరాటం చేస్తున్నద న్నారు. కార్మికులకు 50 సంవత్సరాలకే పింఛన్ వచ్చే విధంగా పోరాడారని తెలిపారు. ఏ ప్రభుత్వం వచ్చినా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించక తప్పదన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను యధావిధిగా ఈ ప్రభుత్వం కూడా అమలు చేసే విధంగా పోరాడాలని పిలుపు నిచ్చారు.

చేనేత కార్మికుల సమస్యలపై మీరు ఏ ఉద్యమం చేసినా సీపీఐ(ఎం) తరవున పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ముందుండి కార్మికుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు ఆత్మహత్యలకు పూనుకోవద్దని ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తూ పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్య సలహాదారు కూరపాటి రమేష్ మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చేనేత సమస్యలు పరిష్కారం కాలేదని, కావున పోరాటం చేయాలన్నారు. జనవరి చివరి వారంలో శాసనసభ, శాసనమండలి సభ్యులకు, వినతి పత్రాలు అందించాలని, బడ్జెట్ సమావేశాల సంద ర్భంగా ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో వేలాది మందితో చేనేత గర్జన నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ నరసింహారెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళీధర్, సహాయ కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ , ఆప్కో మాజీ డైరెక్టర్ వీరన్న, చిక్క దేవదాస్, జమ్మికుంట సంఘం అధ్యక్షులు పెండెం సర్వేషం,నల్గొండ జిల్లా చేనేత అధ్యక్షులు కందగట్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం

- నల్లగొండలో సీపీఐ 100 వసంతాల బహిరంగ సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా



నవతెలంగాణ -నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు మతతత్వ ఫాసిస్టు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇందుకు ప్రజాస్వామ్య లౌకిక, వామపక్ష శక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. సీపీఐ 100 వసంతాల ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు పాల్గొన్నారు. ఆరోగ్యం సహకరించకున్నా.. ఆక్సిజన్ పైపులతో వీల్‌చైర్‌లోనే సుధాకర్‌రెడ్డి సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీతోపాటు కమ్యూనిస్టు పార్టీ కూడా పోరాటం చేసిందన్నారు. అదే స్ఫూర్తితో మరోసారి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. వందేండ్ల కింద స్థాపించబడిన భారత కమ్యూనిస్టు పార్టీ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన మొట్టమొదటి పార్టీ అని, వలసవాదులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసిందని అన్నారు. బీజేపీ గురువు ఆర్‌ఎస్‌ఎస్ అని, దాని రాజకీయ విభాగమే బీజేపీ అని చెప్పారు. భారతదేశం మతపరమైన దేశం కావొద్దని, లౌకిక గణతంత్ర, ప్రజాతంత్ర దేశంగా పరిఢవిల్లాలని కమ్యూనిస్టులు ఆనాడు కోరుకున్నారన్నారు. రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సైతం భారతదేశాన్ని మతతత్వ దేశంగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని, హిందూదేశంగా మారితే పెను విపత్తుగా పరిణమిస్తుందని హెచ్చరించారని అన్నారు. అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పి, మంత్రి పదవికి రాజీనామా చేయాలని, ఆయన చేయకపోతే ప్రధాని మోడీ తొలగించాలని డిమాండ్ చేశారు. 75 సంవత్సరాల రాజ్యాంగ వార్షికోత్సవాలు జరుపుకుంటున్నప్పటికీ పేదలకు, సామాన్యులకు సమానత్వం, సౌభ్రాతృత్వం ఎక్కడ ఉందని, ఎక్కడ న్యాయం అందుతుందని ప్రశ్నించారు. ఇప్పటికీ క్రిస్టియన్లు, ముస్లింపై దాడులు, దళితులు, ఆదివాసీలపై లైంగికదాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దళిత, గిరిజన మహిళలకు, పిల్లలకు భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ, అంబానీలను మోడీ రక్షిస్తున్నారని విమర్శించారు. పేదలు, కార్మిక, రైతులకు మోడీ, బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకమని, అదానీ, అంబానీ లాంటి ఆశ్రిత పెట్టుబడిదారులకు అనుకూలమని, అందుకే దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని వివరించారు. ప్రధాని మోడీ ఒక వైపు వికసిత్ భారత్ అని చెబుతున్నారని, కానీ పెరిగిన ధరలతో ప్రజలు బాధపడుతున్నారని, వికసిత్ భారత్ ఎక్కడ ఉన్నదని ప్రశ్నించారు.

ప్రతి పల్లె, పట్టణాల్లో ఎర్రజెండా ఎగరాలే..

అంటరానితనానికి వ్యతిరేకంగా కుల, వర్గ రహిత నూతన సమాజం, సోషలిస్టు భారతదేశం కోసం పోరాటం చేయాలని, అదే కమ్యూనిస్టుల ముందు ఉన్న లక్ష్యం అని రాజా అన్నారు. రాష్ట్రంలో ఎర్రజెండా లేని పల్లెలు, పట్టణాలు ఉండరాదన్నారు. భారతదేశాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి విముక్తి చేసేందుకు ఎర్రజెండా ముందుండి పోరాడాలన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్, ఎం.బాలనరసింహా, ఇ.టి.నరసింహా, వి.ఎస్.బోస్ హాజరయ్యారు. వంద వసంతాల ప్రారంభ సభకు నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం స్వాగతం పలకగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, పల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్, మల్లేపల్లి ఆదిరెడ్డి, మాజీ ఎంఎల్ ఉజ్జిని యాదగిరి రావు, సీపీఐ యాద్రాది భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ నిజమైన దేశభక్తుడు

- మచ్చలేని నాయకుడు
- వ్యక్తిగత అంశాలను రాజకీయ అంశాలతో ముడిపెట్టడం సరికాదు : సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ - హైదరాబాద్ బ్యూరో

దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన నిజమైన దేశభక్తుడు మన్మోహన్ సింగ్ అని సీపీఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు కొనియాడారు. సోమవారం శాసన సభలో మన్మోహన్ సింగ్‌కు సంతాప తీర్మానంపై ఆయన మాట్లాడారు. వ్యక్తిగత అంశాలను రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డికి సూచించారు. మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపే కార్యక్రమాన్ని రాజకీయ వేదిక చేయడం సరికాదన్నారు. మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో మన్మోహన్ సింగ్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. ఆయన నీతి నిజాయితీలకు నిలువుటద్దమన్నారు. యూపీఏ-1 ప్రభుత్వ హయాంలో కమ్యూనిస్టుల ఒత్తిడితో ప్రజలకు ఉపయోగపడే పలు కీలకమైన చట్టాలను తీసుకురావడంలో మన్మోహన్ సింగ్ పాత్ర చాలా కీలకమని చెప్పారు. భారతదేశ గమనాన్ని మార్చేందుకు కమ్యూనిస్టులు ఇచ్చిన సలహాలను స్వీకరించారన్నారు. ఒక మేధావి మాత్రమే మరొక మేధావిని అర్థం చేసుకుంటారని దానికి పీవీ నరసింహారావు మన్మోహన్‌సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించడమే నిదర్శనమన్నారు. ఆయన విశ్వసనీయతకు మారుపేరనీ, గొప్ప మానవతావదని చెప్పొచ్చన్నారు. స్థిత ప్రజ్ఞత ఉన్న నాయకుడని కొనియాడారు. ఆయన బతికి ఉన్నప్పుడు మౌనముని అని చాలామంది అపహాస్యం చేయటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. కొందరు అతిగా మాట్లాడుతారు గాని చేతల్లో ఏమి చేయరనీ, కొందరు తక్కువగా మాట్లాడినా చేయాల్సిన పనిని నిక్కచ్చిగా చేస్తారనే కోవకు చెందిన వారే మన్మోహన్ సింగ్ అని అన్నారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క స్టైల్ ఉంటుందనీ, ఎదుటివారి స్టైల్‌ని అపహాస్యం చేయడం సరిగాదని సూచించారు. పీవీకి మన్మోహన్ సింగ్‌కి చాలా విషయాల్లో సారూప్యత ఉంటుందన్నారు.

డీసెట్‌లో మిగిలిన సీట్లకు జనవరి 2 నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదు

- 9న సీట్ల కేటాయింపు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం నిర్వహించిన మొదటి విడత, రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందని వారికి మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం వచ్చేనెల రెండో తేదీ నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల నాలుగో తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. అదేనెల తొమ్మిదిన సీట్లు కేటాయిస్తామని వివరించారు. వచ్చేనెల తొమ్మిది నుంచి 13 వరకు కేటాయించిన కాలేజీల్లో ఫీజు చెల్లించాలని సూచించారు. ఈనెల 16 నాటికి ఆయా కాలేజీల్లో చేరాలని కోరారు. ఇతర వివరాలకు https://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఊరట

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటుకు 2019లో జరిగిన ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా నిరాహారదీక్ష చేశారనే కేసు నుంచి వికారాబాద్ ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఊరట లభించింది. ఎం రాంబాబు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో చార్జిషీటు వేశారు. దీన్ని కోర్టు విచారణకు అనుమతించింది. ఆ కేసును కొట్టేయాలని కోరుతూ ప్రసాద్ కుమార్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ కె లక్ష్మణ్ సోమవారం విచారించారు. ఎన్నికల నియమావళికి సంబంధించిన కేసులో గతంలో వెలువడిన ఉత్తర్వుల మేరకు పిటిషనర్‌పై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతులు పొందకుండా పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిపి నిరాహార దీక్ష చేశారనే ఫిర్యాదుపై పోలీసులు సాంకేతికంగా కేసు నమోదు చేశారనీ, వాస్తవానికి నిరాహార దీక్షలో తాను పాల్గొనలేదని ప్రసాద్ కుమార్ పిటిషన్‌లో పేర్కొన్నారు. పోలీసుల చార్జిషీట్‌లో నిశ్చితమైన ఆరోపణలు లేవన్నారు. లాయర్ వాదనల తర్వాత న్యాయమూర్తి, పిటిషనర్‌పై ఉన్న కేసును కొట్టేశారు.

హరీశ్‌రావుకు ఊరట : 9 వరకు అరెస్టు వద్దు : హైకోర్టు

తన ఫోన్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు ట్యాపింగ్ చేయించారని ఆరోపిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ హైదరాబాద్, పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో పెట్టిన కేసులో హరీశ్‌రావును వచ్చేనెల తొమ్మిదో తేదీ వరకు అరెస్టు చేయొద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గతంలోని ఆ ఉత్తర్వులను సోమవారం పొడిగించింది. ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని హరీశ్‌రావు వేసిన పిటిషన్‌లో కౌంటర్ వేసేందుకు సమయం కావాలని ప్రతివాదులు కోరడంతో విచారణ వచ్చేనెల తొమ్మిదికి వాయిదా పడింది. అప్పటి వరకు అరెస్టు చేయరాదన్న గత ఉత్తర్వులను కొనసాగిస్తున్నట్టు ప్రకటించింది.

పర్వతరావుకు నివాళులు

ఉమ్మడి ఏపీ హైకోర్టులో న్యాయమూర్తిగా చేసిన జస్టిస్ పర్వతరావుకు హైకోర్టు సోమవారం నివాళులు అర్పించింది. ఇటీవల ఆయన వద్ధాప్యంతో హైదరాబాద్‌లో కన్నుమూశారు. దీంతో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే అధ్యక్షతన హైకోర్టు జడ్జీలు సమావేశమై సంతాపం చెప్పారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. పర్వతరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అల్లుడు కోదండరాం హైకోర్టు న్యాయమూర్తిగా రిటైర్ అయ్యారు.

సమ సమాజ స్థాపనకు పోరాడాలి

- సీపీఐ(ఎం) హైదరాబాద్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి
- హైదరాబాద్‌లో రక్తదాన శిబిరం



రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ - ముషీరాబాద్

సమ సమాజ స్థాపన కోసం పోరాడాలని సీపీఐ (ఎం) హైదరాబాద్ నగర కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి అన్నారు. ఎస్ఎఫ్ఐ 55 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను ఆర్ఎల్.మూర్తి ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థి అమరవీరులను స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేయాలని కోరారు. లేదంటే ప్రభుత్వాలను రానున్న ఎన్నికలలో విద్యార్థులే గద్దె దింపుతారని హెచ్చరించారు. విద్యార్థి అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకుపోతామన్నారు.

ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. 1970లో డిసెంబర్ నెలలో కేరళలోని త్రివేండ్రంలో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందని గుర్తు చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు చేస్తూ.. విజయాలు సాధిస్తూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని దెబ్బతీసే కుట్ర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎండీ జావేద్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, శ్రీమన్, నాగేందర్, ప్రశాంత్ చరణ్‌శ్రీ, నాయకులు విగ్నేష్, రాజేష్, రజినీకాంత్, సహనా తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం నాయకులు జెండాలు ఆవిష్కరించారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షులు అక్బర్ జెండా ఆవిష్కరించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో సంఘం జిల్లా కేవై ప్రణయ్ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, వేములపల్లి, దేవరకొండలో ఎస్ఎఫ్ఐ జెండాలను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల పట్టణ కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆవిష్కరించారు.

ఆశాలకు రూ.18వేల వేతనం ఇచ్చే వరకు పోరాటం

- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చేరుకున్న ఆశాల బస్సు జాతా



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతో అహర్నిశలూ కృషి చేస్తున్న ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు నిర్ణయించి అమలు చేసే దాకా పోరాటం ఆగదని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి అన్నారు. ఆశా వర్కర్ల రాష్ట్ర బస్సు జాతా సోమవారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడకు వచ్చింది. అదే విధంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కేంద్రానికి చేరుకున్నది. బృందం సభ్యులకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.అశోక్, చంద్రశేఖర్, ఆశావర్కర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమలానగర్ సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. టార్గెట్లు పెట్టి పని చేయించడం, పనికి తగ్గ పారితోషికం అంటూ ఆశా కార్యకర్తలను వేధించడం, శ్రమదోపిడీకి గురిచేయడం మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ ఆరోగ్యంపై పెట్టే బడ్జెట్‌ను తగ్గిస్తూ పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యాన్ని కార్పొరేట్‌మయం చేస్తూ బడా పారిశ్రామికవేత్తల సేవలో ప్రధాని మునిగి తేలుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, గతంలో ఆశాల సమ్మె, చలో హైదరాబాద్ కార్యక్రమాల సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం, పండుగలకు సెలవులను తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతరం జె.చంద్రశేఖర్, ఎ.అశోక్ మాట్లాడారు. ఈ సభలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు ఎ.హేమలత, కార్యదర్శి ఎం.రేవతికల్యాణి, జిల్లా ఆఫీస్ బేరర్స్ కోమలత, రాధ, జయప్రద, వాసంతి, బస్సు జాతా బృంద సభ్యులు ఆర్.సాధన, ఎస్.పద్మ, బాలమణి, సీఐటీయూ నాయకులు ఎస్.శ్రీనివాస్, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ అన్యాయం

రుణమాఫీలో మోసం

- రైతు భరోసా పేరిట దగా
- నిజామాబాద్‌కు మంత్రి లేదు.. ఎంపీ ఉన్నా లేనట్టే :

కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్సీ కవిత మండిపాటు



నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలూ అన్యాయానికి గురవుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం ఆమె బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దుష్టపరిపాలనకు తెరతీసిందని విమర్శించారు. రైతు రుణమాఫీ పూర్తిగా చేయకుండా రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతు భరోసాకు అనేక షరతులతో దగా చేస్తున్నారని అన్నారు. మహిళలకు భద్రత లేదన్న విషయాన్ని డీజీపీ వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. మహిళా భద్రత కోసం కేసీఆర్ షీటీమ్స్ ఏర్పాటు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం గాలికొదిలేశారని విమర్శించారు. పదేండ్లపాటు ప్రజలను కేసీఆర్ కన్నబిడ్డల్లా చూసుకున్నారని, కానీ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఈ ప్రభుత్వానికి రైతుబంధు ఇవ్వాలన్న సోయి లేదని, రైతు కూలీలకూ సాయం చేస్తామని ఇప్పటికీ ఏం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగమంటూ తిరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఎప్పుడూ లేనిది కాంగ్రెస్ హయాంలో రెండు పెద్ద ఎన్‌కౌంటర్లు జరిగాయని చెప్పారు. శాంతి భద్రతలను భగ్నం చేసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం విడుదల చేసిందని, పనులు చేయని కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు చెల్లించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను నరకయాతన పెట్టడానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. రీసర్వే చేసే ముందు భూముల వివరాలు తెలియజేస్తూ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పై ప్రజలు నమ్మకం కోల్పోయారని, బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పాలనలో నిజామాబాద్ జిల్లా అనాథగా మారిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నుంచి కనీసం ఒక మంత్రి కూడా లేరని, ఎంపీ ఉన్నా లేనట్లే.. ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు పవర్ లేదు.. ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులే అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారని వ్యాఖ్యానించారు. ఆరు నెలల నుంచి నిజామాబాద్‌కు పోలీసు కమిషనర్ లేకపోవడం దారుణమన్నారు. పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, జాతీయ నాయకుడని చెప్పుకునే షబ్బీర్ అలీ ఇక్కడి నుంచే ఉన్నా కనీసం కమిషనర్‌ను నియమించకపోవడాన్ని ప్రజలు గమనించాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేష, జెడ్పీ చైర్మెన్ విఠల్‌రావు, మేయర్ నీతు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పులు చిమ్ముతూ..నింగిలోకి..



శ్రీహరికోట: రెండు ఉపగ్రహాలు, 24 పేలోడ్లతో పీఎస్ఎల్వీ సీ-60' విజయవంతంగా నింగికెగిసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి బహుళ ప్రయోజనాల రాకెట్ సోమవారం రాత్రి 10 గంటల 15 సెకండ్లకు నింగిలోకి దూసుకెళ్లింది. ఒక్కొక్కటి 220 కిలోల బరువున్న స్పేడేక్స్ ఉపగ్రహాలను భూమికి 476 కిలోమీటర్ల అంతరిక్ష కక్ష్యలోకి శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. మొదట స్పేడెక్స్-బి ఉపగ్రహం, అనంతరం మరో మూడు సెకండ్ల వ్యవధిలో స్పేడెక్స్-ఎ ఉపగ్రహం రాకెట్ నుంచి విడిపోయాయి. రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలు విడిపోయిన తర్వాత 15 నిమిషాల 13 సెంకడ్లకు కక్ష్యను మార్చుకున్నాయి. సుదీర్ఘ సమయం అనంతరం రెండుసార్లు ఆర్బిట్ మార్పులో నాలుగో దశ అంటుకోవడం, మళ్లీ కట్ ఆఫ్, మళ్లీ స్టార్ట్, మళ్లీ కట్ ఆఫ్‌లతో నాలుగో దశలో భూమికి దగ్గరగా ప్రవేశించాయి ఈ తరుణంలో రాకెట్ శీర్ష భాగంలో అమర్చిన 24 పేలోడ్లు అక్కడక్కడా విసిరివేయబడ్డాయి. ఈ పేలోడ్లు భూమికి దగ్గర కక్ష్యలోకి చేరి రాకెట్ ప్రయోగం పూర్తి కావడానికి 95 నిమిషాలు సమయం పట్టింది. ఈ ప్రయోగంలో అత్యంత ముఖ్యమైన స్పేడెక్స్ ఉపగ్రహాలు కక్ష్యలో చేరిన వెంటనే ఈ ప్రయోగం విజయవంతమైనట్టు శాస్త్రవేత్తలు ప్రకటించారు.

స్ట్రాపాన్ బూస్టర్లు లేని ప్రయోగం...

ఉపగ్రహాల బరువు తక్కువగా ఉన్న కారణంగా పీఎస్ఎల్వీ సీ-60 స్ట్రాపాన్ బూస్టర్లు లేకుండా రూపొందించారు. ప్రయోగ సమయంలో 44.5 మీటర్ల ఎత్తు, 229 టన్నుల బరువు కలిగిన నాలుగు దశల పీఎస్ఎల్వీ రాకెట్... రెండు, నాలుగవ దశలు ద్రవ ఇంధనంతోనూ, ఒకటి, మూడవ దశల్లో ఘన ఇంధనంతో నడిచాయి. పీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 62వ రాకెట్.

ఈ సిరీస్‌లో ఇప్పటికే ఎన్నో ప్రయోగాలు జరిగినప్పటికీ ఏదో ఒక కొత్తదనాన్ని ప్రతిసారీ శాస్త్రవేత్తలు ఆవిష్కరిస్తూనే ఉన్నారు. ఈసారి స్పేడేక్స్ ఉపగ్రహాలతో అంతరిక్షంలో సరికొత్త విన్యాసాలకు నాంది పలికారు. రెండు ఆర్బిట్లలో ప్రవేశించే ఉపగ్రహాలు క్రమేణ దగ్గరై ఒకేచోట అనుసంధానమయ్యే ప్రక్రియ ఇస్రోకు కొత్త. ఈ విధంగా అంతరిక్షంలోకి చేరిన ఉపగ్రహాలు ఒక్కచోట చేరితే భవిష్యత్తులో స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. అంతరిక్షంలో ఇస్రో స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేసుకున్న తర్వాత మన ప్రయోజనాల కోసం ఉపయోగించే ఉపగ్రహాలన్నీ ఒక సమూహంగా చేరి విలువైన సమాచారం సేకరించి భూమికి అందిస్తాయి. ఈ స్పేడేక్స్ ఉపగ్రహాల తయారీలో ఇస్రో శాస్త్రవేత్తలు అత్యంత శక్తివంతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అమర్చారు. బెంగళూరు యుఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈ రెండు ఉపగ్రహాలను రూపొందించారు.



ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- అయ్యప్ప మాల ముసుగులో మతకలహాలు : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్
- బాధితుడికి ప్రజాసంఘాల నేతల పరామర్శ

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయ్యప్ప స్వాముల ముసుగులో కాషాయ మూకలు మతకలహాలకు పాల్పడుతున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో అయ్యప్ప మాలలో ఉన్న విద్యార్థికి ప్రధానోపాధ్యాయుడు రాములు కాలు తగిలిందనే కారణంతో అతనిపై అయ్యప్ప స్వాములు దాడి చేయడాన్ని సీఐటీయూ, ప్రజాసంఘాలు ఖండించాయి. సోమవారం ప్రధానోపాధ్యాయుడు రాములును తుక్కుగూడలోని ఆయన నివాసంలో సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడిపై లేనిపోని నిందలు వేసి, అయ్యప్ప స్వాముల ముసుగులో బీజేపీ నాయకులు దాడి చేశారన్నారు. అతని బట్టలు చించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాత విద్యార్థి కాళ్లు మొక్కించారని తెలిపారు. ఈ దుర్మార్గమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ కవిత, సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాంచందర్ తదితరులు ఉన్నారు.

అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ 3కు వాయిదా

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

సంధ్యా థియేటర్ ఘటన కేసుకు సంబంధించి నటుడు అల్లు అర్జున్ బెయిల్ కోరుతూ పెట్టుకున్న పిటిషన్‌పై విచారణను నాంపల్లి కోర్టు సోమవారం జనవరి 3కు వాయిదా వేసింది. అర్జున్‌కు బెయిల్ మంజూరు చేయాలనీ, డిసెంబర్ 4న పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటకు, అర్జున్‌కు ఎలాంటి సంబంధమూ లేదనీ, ఆయనపై అన్యాయంగా కేసులు నమోదు చేశారని న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టులో వాదించారు. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను వాయిదా వేశారు. ఇప్పటికే ఈ కేసులో అల్లు అర్జున్‌ను నాలుగువారాల పాటు అరెస్ట్ చేయరాదంటూ హైకోర్టు ఆదేశించిన విషయం విదితమే. మరోవైపు, ఇటీవలనే అర్జున్‌ను స్టేషన్‌కు పిలిచి చిక్కడపల్లి పోలీసులు విచారణ జరిపి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

కేటీఆర్‌కు మతి భ్రమించింది

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ మంత్రి కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విమర్శించారు. కొత్త సంవత్సరంలోనైనా ఆయనకు మంచి బుద్ధి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కనీసం ప్రతిపక్ష హోదాను కూడా నిలబెట్టుకోలేపోతుందని విమర్శించారు. అసెంబ్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానంపై మాట్లాడేందుకు ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తారని ఆశించామని తెలిపారు. మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేసిన కేసీఆర్ కూడా అసెంబ్లీకి రాకపోవడం దౌర్భాగ్యకరమన్నారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడంలో మన్మోహన్ సింగ్ పాత్ర ఎంతో ఉందన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డుపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- బీఆర్ఎస్ హయాంలోని పనులను తమ ఖాతాలో వేసుకుంటున్నారు : మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రీజినల్ రింగ్ రోడ్డుపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తర రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి కేసీఆర్ హయాంలో చేసిన పనులను తాము చేసినట్టు సీఎం రేవంత్ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. గత సర్కార్ పలు మార్లు చేసిన విజ్ఞప్తి మేరకు 2021 డిసెంబర్ 6న కేంద్రం అలైన్ మెంట్ అప్రూవల్ ఇచ్చిందని గుర్తు చేశారు. భూసేకరణకు కేంద్రం వద్ద డిపాజిట్ చేసిన రూ.100 కోట్లలో ఇప్పటి వరకు కాంగ్రెస్ సర్కార్ నయాపైసా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. అలాగే దక్షిణ భాగం రీజినల్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్‌ను తమ భూముల చుట్టూ మార్పులు చేయడం ద్వారా కాంగ్రెస్ నేతలు లబ్ది పొందేందుకు చూస్తున్నారని ఆరోపించారు. అలైన్ మెంట్ మార్చడం ద్వారా రూ.12 వేల కోట్లు సర్కార్‌పై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే అలైన్ మార్చకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

రైల్వే విద్యుత్ లైన్ల వద్ద గాలిపటాలు ఎగరేయొద్దు

- తీగల నుంచి వేలాడుతున్న గాలిపటం దారాలను తాకడాన్ని నివారించాలి : ప్రజలకు దక్షిణ మధ్య రైల్వే సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైల్వే విద్యుత్తు లైన్ల దగ్గర గాలిపటాలను ఎగరేయొద్దని సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు దక్షిణ మధ్య రైల్వే సూచించింది. విద్యుత్తు తీగల నుంచి వేలాడుతున్న గాలిపటం దారాలను తాకడాన్ని నివారించాలని కోరింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రైల్వే ప్రాంగణంలో యార్డులు, ట్రాక్‌ల సమీపంలోని జనావాసాల ప్రాంతాలతో సహా విద్యుత్తు తీగల దగ్గర ఆడుకుంటుండగా పలువురు గాలిపటాలు ఎగరేసేవారు విద్యుద్ఘాతానికి గురై మరణించినట్టు గమనించబడిందని తెలిపింది. ఇలాంటి సంఘటనలు భారతీయ రైల్వేలోని అనేక జోన్‌లలో మునుపటి సంక్రాంతి పండుగ సీజన్‌లో కొన్ని కేసులు నమోదయ్యాయని పేర్కొంది. ఇందులో వ్యక్తులు 25 కెవి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ కండక్టర్లలో చిక్కుకున్న గాలిపటం దారాలను తాకడంతో విద్యుత్ షాక్‌లు లేదా విద్యుద్ఘాతానికి గురయ్యారని వివరించింది. సాధారణంగా ప్రజలచే ఉపయోగించబడే చైనా నుంచి దిగుమతి చేయబడిన గాలిపటాల దారాలు, విద్యుత్ వాహకం అవడం వల్ల అవి మానవ జీవితానికి, క్లిష్టమైన రైల్వే ఎలక్ట్రికల్ మౌలిక సదుపాయాలకు కూడా గణనీయమైన నష్టాలను కలిగిస్తాయని తెలిపింది. ఈ విషయంలో ప్రజల నుంచి సంపూర్ణ సహకారాన్ని కోరుతున్నట్టు పేర్కొంది. రైల్వే ట్రాక్‌ల దగ్గర గాలిపటాలు ఎగరేయడాన్ని నివారించాలనీ, ఓవర్‌హెడ్ లైన్‌లు అధిక ఓల్టేజ్ విద్యుత్‌తో ఛార్జ్ చేయబడినందువల్ల వాటిని తాకినప్పుడు మానవ జీవితానికి పెను ప్రమాదం కలిగిస్తాయని తెలిపింది. ఓవర్‌హెడ్ కండక్టర్ల నుంచి గాలిపటం దారాలను వేలాడుతున్న సమయంలో రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించింది. తద్వారా శిక్షణ పొందిన సిబ్బంది సురక్షితంగా గాలిపటాల దారాలను తీసివేయగలరని సలహానిచ్చింది.

గర్జించిన రైతన్న



కేంద్రం వైఖరికి నిరసనగా **పంజాబ్ బంద్**

- స్తంభించిన జనజీవనం
- 163 రైళ్లు రద్దు... నిలిచిన రాకపోకలు
- ప్రజల నుంచి విశేష స్పందన
- వాణిజ్య సంస్థల మద్దతు, మూసివేత

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రైతులు గర్జించారు. తాము పండించే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు చట్ట హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలంటూ పంజాబ్ వ్యాప్తంగా కిసాన్ మజ్దూర్ మోర్చా, సంయుక్త కిసాన్ మోర్చా బంద్ చేపట్టాయి. దీంతో రాష్ట్రం మొత్తం స్తంభించింది. పెద్ద ఎత్తున రైతులు రోడ్లపైకి వచ్చి ఈ బంద్‌లో పాల్గొన్నారు. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు మూతపడ్డాయి. అమృత్‌సర్‌లోని గోల్డెన్ గేట్, బటిండాలోని రాంపురా ఫుల్, మొహాలీలోని ఐఐఎస్ఈఆర్ చౌక్ వద్ద ఎయిర్‌పోర్ట్ రోడ్డు, కురాలి రోడ్ టోల్ ప్లాజా, లాల్రూ సమీపంలోని అంబాలా - ఢిల్లీ హైవే, ఖరార్-మొరిండా హైవే సహా కీలక మార్గాలను రైతులు దిగ్బంధించారు. ధరేరి జట్టన్ టోల్ ప్లాజా వద్ద బైటాయించారు. దీంతో పాటియాలా-చండీగఢ్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి.

ప్రజల నుంచి విశేష స్పందన

బంద్ పట్ల ముందు నుంచి విస్తృతంగా ప్రచారం చేయడంతో ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభించింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. రాష్ట్రంలోని ప్రజలకు నిత్యావసర వస్తువుల సరఫరా ఉండబోదని ముందుగానే చెప్పడంతో ప్రజలు కూడా అందుకు సిద్ధపడ్డారు. అలాగే వాహనాలు, రైళ్లను సైతం తిరగనివ్వబోమని ప్రకటించడంతో ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. అత్యావసరాలకు మాత్రమే బంద్ నుంచి మినహాయించారు. దీంతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగలేదు. ప్రజలకు కూడా బంద్‌కు సహకరించారు. ఈ బంద్‌కు వ్యాపారులు, ఉద్యోగ సంఘాలు, కార్మికులు, మాజీ సైనికులు, సర్పంచ్‌లతోపాటు వివిధ వర్గాల వారు మద్దతు ప్రకటించారు. బంద్‌కు సహకరించిన ప్రజలకు రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ ధన్యవాదాలు తెలిపారు. జనవరి 4న ఖనౌరీ నిరసన ప్రదేశంలో కిసాన్ మహాపంచాయత్ నిర్వహించనున్నట్టు ఆందోళన కారులు ప్రకటించారు.

కొనసాగిన జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరాహార దీక్ష

70 ఏండ్ల రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం నాటికి 35వ రోజుకు చేరుకుంది. రైతుల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకు నిరాహార దీక్ష విరమించేదే లేదని దల్లేవాల్ ప్రకటించారు. అయితే దల్లేవాల్ ఇప్పటివరకు వైద్య చికిత్సను నిరాకరించారు. ఆయనను ఆస్పత్రికి తరలించడానికి ఒప్పించేందుకు సుప్రీంకోర్టు పంజాబ్ ప్రభుత్వానికి డిసెంబర్ 31 వరకు సమయం ఇచ్చింది. అవసరమైతే కేంద్రం నుంచి లాజిస్టికల్ మద్దతును కోరే స్వేచ్ఛను రాష్ట్రానికి ఇచ్చింది. ఈ నేపథ్యంలో జనవరి 3న రైతులతో చర్చించనున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది.

వాణిజ్యసంస్థల మద్దతు

రైతులు చేపట్టిన ఈ బంద్‌కు వాణిజ్య సంస్థలు సైతం మద్దతిచ్చాయి. ప్రభుత్వ ప్రయివేట్ సంస్థలు బంద్‌కు మద్దతునిస్తూ మూసివేశాయి. ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు మూతబడ్డాయి. పంజాబ్ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200కిపైగా రోడ్లను రైతులు బ్లాక్ చేశారు. దీంతో రవాణా సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు రైతుల బంద్‌తో రైళ్ల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీ-పంజాబ్ మధ్య రాకపోకలు సాగించే దాదాపు 163 రైల్వే సర్వీసులు రద్దయ్యాయి. విమానాలు, వైద్య, అంబులెన్స్‌లు, పెండ్లిండ్లు, ఉద్యోగ ఇంటర్వ్యూలు సహా అత్యవసర సేవలకు బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. రైతుల బంద్ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. మొహాలి జిల్లా వ్యాప్తంగా దాదాపు 600 మంది పోలీసు సిబ్బంది మోహరించారు. సీనియర్ పోలీస్ అధికారులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ బంద్ కొనసాగింది.

నోటికాడి కూడు లాక్కుంటే కొట్లాడాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎర్రజెండా తరఫున పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మా కంపెనీని రద్దు చేయడంతో పాటు రైతులకు భూములు ఇస్తామని హామీనిచ్చింద న్నారు. లగచర్లలో 1300 ఎకరాలకు తోడు మరో 15వేల ఎకరాలు తీసుకుని విదేశీ కంపెనీని తీసుకొచ్చి ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని చెప్తున్నారన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ హైదరాబాద్, జహీరాబాద్‌లో పెట్టాలని చూస్తే అక్కడ ఎర్రజెండాలే పోరాటం చేసి అడ్డుకున్నాయని, ఇక్కడ కూడా ఎర్రజెండాలు పోరాటం చేసి అడ్డుకుంటాయని హెచ్చరించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తమ్మినేని ఖండించారు. అమిత్ షాను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఫ్రీ బస్సు తప్ప అమలు చేసిందేమీ లేదన్నారు. పైగా హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్‌ను సమర్థించిన ఎర్రజెండాలే పేదల పక్షాన నిలదీసి అడుగుతున్నాయని స్పష్టం చేశారు. భూమిని పంచిన, సాధించిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని, ఆ అనుభవంతోనే లగచర్ల భూములను రక్షించేందుకు అండగా ఉంటుందని అన్నారు. 1156 ఎకరాల భూమి కొడంగల్‌లో దొరల దగ్గర ఉందని, ఆ భూముల్లో ప్రభుత్వం అనుకున్న వాటిని నెలకొల్పాలని సూచించారు. 'దొరల భూముల దగ్గరకు పోతే కోర్టు అడ్డం వస్తుంది. పేదల భూముల దగ్గరికి పోతే కోర్టు అడ్డం రాదా..' అని ప్రశ్నించారు. కానీ, పేదల భూముల దగ్గరికి పోతే కోర్టు అడ్డం రాకపోయినా ఎర్రజెండా అడ్డం వస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యామ్నాయ భూములను చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, డి.జి.నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్‌రాములు, శ్రీరామ్‌నాయక్, వికారాబాద్ జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటయ్య, బుస చంద్రయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, సతీష్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ.. నూతన సంవత్సర శుభాకాంక్షలు

నిజాలు నిర్భయంగా చెబుతూ ప్రభుత్వానికి, ప్రజలకు పత్రికలు వారధిగా ఉండాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నవతెలంగాణ 2025 నూతన క్యాలెండర్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింహారావు, జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రారాములు, శ్రీరామ్‌నాయక్, జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య, నవతెలంగాణ రిపోర్టర్ వెంకట్‌రామ్‌రెడ్డితో కలిసి తమ్మినేని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను పత్రిక చెప్పాలన్నారు. వాస్తవాలను, ప్రజాసమస్యలను వెలికితీయడంలో నవతెలంగాణ కృషి గొప్పదన్నారు. ప్రతి ఏడాదీ నవతెలంగాణ యాజమాన్యం నాణ్యమైన రంగులతో, కొత్త హంగులతో ప్రజలకు నూతన క్యాలెండర్ అందించడం సంతోషం అన్నారు. అనుదినం జనస్వరం ట్యాగ్ లైన్ కలిగిన నవతెలంగాణ అనునిత్యం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అలాగే నాయకులకు, అధికారులకు, ప్రజలకు, పత్రిక యాజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

శాస్త్రీయ విద్య కోసం పోరాడదాం

- నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిద్దాం : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి
- హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో శాస్త్రీయ విద్యారంగం కోసం పోరాడదామని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020)ని వ్యతిరేకిద్దామని చెప్పారు. అమరుల త్యాగాలతో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని అన్నారు. ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆర్ఎల్ మూర్తి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై రాజీ లేకుండా పోరాటం చేసే ఏకైక సంఘం దేశంలో ఎస్ఎఫ్ఐ మాత్రమే అని అన్నారు. ఈ 55 ఏండ్ల ప్రస్థానంలో ఎందరో ఎస్ఎఫ్ఐ నాయకులు అమరులయ్యారనీ, వారి త్యాగాలతో మరింత ముందుకు వెళ్తామని చెప్పారు. విద్యా ప్రయివేటీకరణ, విద్యాకాషాయకరణ, విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా అనునిత్యం ఉద్యమిస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదన్నారు. రాజ్యాంగంలోని హక్కులను హరిస్తున్నదని చెప్పారు. జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం ముసుగులో ఈ దేశంలో విద్యా విధానాన్ని సామ్రాజ్యవాద దేశాలకు వ్యాపారం చేసుకునేలా రెడ్ కార్పెట్ పలుకుతున్నదని అన్నారు. విద్యలో శాస్త్రీయ దృక్పథం లేకుండా మూఢవిశ్వాసాలను పాఠ్యాంశాల్లో చేరుస్తున్నదని చెప్పారు. మోడీ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న కారణంగానే దేశంలో ఎస్ఎఫ్ఐ నాయకుల మీద భౌతిక దాడులు జరుగుతున్నాయని అన్నారు. దేశద్రోహ చట్టాలను ప్రయోగిస్తున్నారని చెప్పారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడంలో ఎస్ఎఫ్ఐ ముందంజలో ఉందన్నారు. మోడీ ప్రభుత్వం మనువాద ఎజెండాను అమలు చేస్తూ వెనకబడిన వర్గాలను విద్యకు దూరం చేస్తున్నదని విమర్శించారు. విద్యారంగంలో వస్తున్న సమస్యలపై సామాజిక అసమానతలపై కలిసి ఉద్యమం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్, సహాయ కార్యదర్శి కిరణ్, అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, స్టాలిన్, ప్రశాంత్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఉపాధ్యక్షులు ఎండీ జావేద్ పాల్గొన్నారు.

పది మంది యువ ఐపీఎస్‌లు బదిలీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

గ్రేహౌండ్స్‌లో ఉన్న ఏఎస్పీ స్థాయి ఐపీఎస్ అధికారులను బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాజల్‌ను ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏఎస్పీగా మార్చారు. కంకనాల రాహుల్ రెడ్డిని భువనగిరి ఏఎస్పీగా బదిలీ చేశారు. చిత్తరంజన్‌ను ఆసిఫాబాద్ ఏఎస్పీగా, బొక్క చైతన్యరెడ్డిని కామారెడ్డి ఏఎస్పీగా, పందెరె చేతన్ నితిన్ జనగామ ఏఎస్పీగా నియమించారు. నగ్రాలే శుభమ్ ప్రకాశ్‌ను కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా, రాజేశ్ మీనాను నిర్మల్ ఏఎస్పీగా, పి. మౌనికను దేవరకొండ ఏఎస్పీగా బదిలీ చేశారు. అలాగే, విక్రాంత్ కుమార్ సింగ్‌ను భద్రాచలం ఏఎస్పీగా నియమించి, ఇక్కడున్న ఏఎస్పీ అంకిత్ కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

దళిత ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య

- తుక్కుగూడ ఘటనపై సీఐటీయూ నిరసన
- సంగారెడ్డిలో మతోన్మాదుల దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మతోన్మాదం ముదిరిపాకాన పడిందని, రాష్ట్రంలో మూక దాడులు పెరిగాయని, దళిత ఉపాధ్యాయుడిపై అకారణంగా దాడి చేసి కాళ్లు మొక్కించడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాములపై మతోన్మాద మూకలు భక్తి ముసుగులో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో సుందరయ్య భవన్ నుంచి ర్యాలీ నిర్వహించి న్యూ బస్టాండ్ సెంటర్‌లో మతోన్మాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. మతం, కులం పేరిట, భక్తి ముసుగులో మతోన్మాద శక్తులు మూక దాడులకు పాల్పడుతున్నాయన్నారు. ఇలాంటి దాడుల్ని ఉద్యోగ, కార్మికులు, ప్రజాతంత్రవాదులు, లౌకిక శక్తులు ఖండదించడమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరముందని చెప్పారు. దళిత ఉపాధ్యాయుడిపై దాడి చేసి అవమానపర్చిన వారందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గురువుల్ని గౌరవించాల్సింది పోయి వారిపై దాడులు చేసి కాళ్లు మొక్కించుకుని అవమాన పర్చడం దుర్మార్గమైన చర్య అన్నారు.

ఉపాధ్యాయుడు రాములు క్షమాపణ చెప్పినప్పటి కీ అయ్యప్ప మాల వేసిన విద్యార్థితో పాటు ఇతర స్వాముల కాళ్లు మొక్కించడం హేయమైన చర్య అన్నారు. గతంలో నిజామాబాద్ జిల్లా వర్నిలో కూడా ఒక పాఠశాలలో విద్యార్థులకు టీచర్ శాస్త్రీయ బావాలను, సైన్స్ దృక్పథాన్ని బోధించడాన్ని సాకుగా తీసుకుని మతోన్మాదులు అతనిపై దాడి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్‌షానే అంబేద్కర్‌ను అవమానపరుస్తూ మాట్లాడిన తీరు మతోన్మాదులకు మరింత ఆజ్యం పోస్తోంద న్నారు. దాడుల్ని అరికటేటందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.మాణిక్యం, జిల్లా కార్యదర్శి అశోక్, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, మహేష్‌రాజు, వేణు, లక్ష్మీనారాయణ, దుర్గయ్య, మల్లేశం, మైపాల్, గోపాల్‌బాబాయ్ పాల్గొన్నారు.



తూపాకీ విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

- పిస్తల్,2 తూటాలు, కారు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం : ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ వెల్లడి

నవతెలంగాణ-మహబూబాబాద్

తుపాకీ విక్రయించడం కోసం కారులో పెట్టుకుని తిరుగుతున్న ముఠాలోని ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి తూపాకీ, రెండు తూటాలు, కారు, 5 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఒకరు పరారీలో ఉన్నట్టు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తెలిపారు. సోమవారం మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఎస్పీ ఆ కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. కేసముద్రం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న కారును ఆపి.. అందులో ఉన్నవారిని విచారించారు. అందం గోపి, గోస్వామి ప్రవీణ్ భారతి, మాధవ పెద్ది శ్రీకాంత్ రెడ్డి, దొంతగాని సందీప్, మెరుగు సిద్ధార్థ గుజరాత్‌లో తుపాకీ కొనుగోలు చేశారు. దాన్ని మహబూబాబాద్ జిల్లాలో అమ్మకానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. దీంతో వారిని అరెస్టు చేశారు. వీరారెడ్డిపల్లిలో ఒక కిరాణం షాపులో దొంగతనం చేశారని, నెక్కొండ మండలంలోని రెడ్లవాడ దగ్గరలోని తండాలో మేకలు దొంగతనం చేసినట్టు నిందితులు ఒప్పుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు ఇమ్రాన్ ఖాన్ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి సొత్తు స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించినట్టు ఎస్పీ తెలిపారు. వారిని పట్టుకున్న సీఐ సర్వయ్య ఎస్ఐలు మురళీధర్ రాజు, తహేర్ బాబాను ఎస్పీ అభినందించారు.

ఉపాధ్యాయునితో విద్యార్థి కాళ్లు మొక్కించిన పెత్తందారులపై అట్రాసిటీ కేసు పెట్టాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయునితో అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థి కాళ్లు మొక్కించిన పెత్తందారులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మతం రంగు ముసుగులో పేట్రేగిపోతున్న పెత్తందార్ల వివక్షను అరికట్టడం కోసం చర్యలు చేపట్టాలని కోరారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్ఎం) కంబలపల్లి రాములు విధుల్లో ఉన్నప్పుడు తొమ్మిదో తరగతి చదువుతున్న అయ్యప్ప మాలలో ఉన్న అబ్బాయికి ఆయన కాలు తగిలిందనే కారణంతో గ్రామంలో అయ్యప్ప మాల స్వాములందరూ కలిసి హెడ్మాస్టర్‌తోటి ఆ విద్యార్థి కాళ్లు మొక్కించిన చర్య సభ్య సమాజం తలదించుకునేటట్టుగా ఉందని తెలిపారు. ఆ విద్యార్థికి హెడ్మాస్టర్ చెయ్యి తగిలితే కాలు తగిలిందని ప్రచారాన్ని ముందుకు తెస్తున్నారనే వాదన కూడా ఉందని పేర్కొన్నారు. ఆ ఉపాధ్యాయుడు దళితుడు కాబట్టే గ్రామంలో ఉన్న పెత్తందారులు ఈ చర్యకు ఒడికట్టారని ప్రచారం నడుస్తున్నదని తెలిపారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. బాధ్యులందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని కోరారు.

ఇక ఇందిరా మహిళా శక్తి ఫిష్ ట్రక్స్

- గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ



నవతెలంగాణ బ్యూరో-హైరదాబాద్

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారి చేత పలు వ్యాపారాలను ప్రారంభింపజేసిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా సంచార చేపల విక్రయ వాహనాలను మహిళా సంఘాల కోసం సమకూర్చుతోంది. మంత్రి సీతక్క ఆదేశాలతో సంచార చేపల విక్రయ వాహనాలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సిద్ధం చేస్తోంది. జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 32 వాహనాలను మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. రూ. 10 లక్షల విలువ గల ఈ వాహనాలను కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి మత్స్య యోజన పథకంతో అనుసంధానం చేసి.. 60 శాతం సబ్సిడీతో రూ. నాలుగు లక్షలకు మహిళా సంఘాలకు కేటాయించనున్నారు. ఈ మొత్తాన్ని సైతం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలను ఇప్పించనుంది. సంచార చేపల విక్రయం కోసం మహిళలకు అవసరమైన శిక్షణను గచ్చిబౌలిలోని నిథం ఇనిస్టిట్యూట్‌లో సెర్ప్ ద్వారా ఉచితంగా శిక్షణ ఇప్పించారు. చేపల విక్రయాలతో పాటు, చేపల వంటకాలు తయారీకి అవసరమైన శిక్షణను పలు మహిళా సంఘాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సంచార చేపల విక్రయ వాహనంలో ఉదయం పచ్చి చేపలను విక్రయించవచ్చు. సాయంత్రం చేప వంటకాలను తయారుచేసి విక్రయించుకునే విధంగా వాహనాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. జనవరి 3న 32 వాహనాలను మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రారంభిస్తారు.

రేషన్ బియ్యం అమ్మే వ్యక్తులు అరెస్ట్..



నవతెలంగాణ-హాయత్‌నగర్

ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, మిల్లర్లకు విక్రయిస్తున్న వారిని హాయత్ నగర్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హయత్‌నగర్‌లోని సూర్యానగర్ కాలనీ కమాన్ ముందు ఎన్‌హెచ్-65 రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉదయం సుర్యానగర్ కాలనీ వైపు నుండి వస్తున్న టీఎస్ 08-యుఏ-6212 ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో సుమా రు (11) బస్తాలలో మూటలు కట్టిన రేషన్ బియ్యం కలిగి మొత్తం సుమారు (5) క్వింటాళ్ళు ఉండగా వినాయక నగర్ కాలనీ హాయత్ నగర్‌కు చెందిన డ్రైవర్ జట్రోతు కుమార్ ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే పీడీఎస్‌బియ్యాన్ని చుట్టు ప్రక్కల గ్రామాలలో పేదల వద్ద కిలో రూ.15ల చొప్పున కొనుగోలు చేసి, వాటిని వనస్థలిపురంలో ఉండే నెహ్రూకు ఎక్కువ ధరకు అనగా కిలో రూ.19ల చొప్పున అక్రమంగా అమ్మి లాభం పొందు తున్నాడని నెహ్రూ పై కూడా కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



నవతెలంగాణ,బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న కే.రాములుపై అయ్యప్ప స్వాములు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ సీఐటీయు, రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారు మాట్లాడుతూ సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాంచందర్ సీఐటీయు జిల్లా ప్రధానకార్యదర్శిచంద్రమోహన్, శ్రామిక మహిళ నాయకురాలు జిల్లా కార్యదర్శి కవిత, మధ్యాహ్న భోజనపు కార్మికురాలు జిల్లా కార్యదర్శి స్వప్న, జిల్లా మండల నాయకులు బుట్టి బాలరాజ్, పెంటయ్య, బాలాపూర్ మండల కన్వీనర్ వి. శేఖర్ యాదవ్, కృష్ణ, శేఖర్, ఉపా ధ్యాయులు రాములును పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే దాడి చేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో సీఐటీయు, సీపీఐ(ఎం) నాయకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను జాగ్రత్తలు పాటిస్తూ జరుపుకోవాలి

- వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవు
- నాగోల్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ.సూర్య నాయక్



నవతెలంగాణ-నాగోల్

పోలీసు వారి సూచనలను, జాగ్రత్తలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని నాగోల్ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ.సూర్య నాయక్ సూచించారు. ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు, పెద్దలు అందరూ వారి ఇండ్లలోనే ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండ పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. పోలీసుటు పటిష్టమైన బందోబస్తు, నిత్యం పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో వేడుకలను నిర్వహిస్తే వారి పై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేడుకలు రాత్రి 12:30 గంటల వరకు పూర్తి కావాలని తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలని, మైనర్స్‌కు వాహనాలు ఇవ్వవద్దని, టపాసులు, డీజే లు నిషేధిస్తున్నట్టు సీఐ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరమని, వాహనాలు వేగంగా నడపవద్దని సూచించారు. రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు జరప వద్దని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించవద్దని, ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని చెప్పారు. వేడుకలలో నిషేధిత డ్రగ్స్, గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించిన కఠిన చర్యలు ఉంటాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతామన్నారు. వేడుకుల ఏర్పాటు చేసే నిర్వహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఇక న్యూ ఇయర్ ఆఫర్‌ల పేరిట సైబర్ నేరగాళ్ల ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నదని, కావున ఆన్‌లైన్ నందు, అపరిచితులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నెంబర్స్ ఇవ్వవద్దని సూచించారు. ఆంక్షలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు.

నేటి రాత్రి ఫ్లైఓవర్లు బంద్

- వనస్థలిపురం ఏసీపీ కాశీ రెడ్డి



నవతెలంగాణ-హాయత్‌నగర్

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో నగరంలోని అన్ని ఫ్లై ఓవర్లను పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బంద్ చేయాలని నిర్ణయించినట్టు వనస్థలిపురం ఏసీపీ కాశీ రెడ్డి వెల్లడించారు. డిసెంబర్ 31న రాత్రి 10 గంటల తర్వాత బైకులు, వాణిజ్య వాహనాలకు ఫ్లై ఓవర్లపై అనుమతి ఉండదని పోలీసులు తెలిపారు. గత ఏడాది అనుభవాల దష్ట్యా అతివేగంతో దూసుకెళ్తే ప్రమాదం పొంచి ఉందని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

రాచకొండ పోలీసుల ప్రత్యేక దృష్టి

న్యూ ఇయర్ వేడుకలపై రాచకొండ పోలీసులు ప్రత్యేకంగా నిఘా వేస్తోంది. ముఖ్యమంత్రి ఆదేశాలతో డ్రగ్స్ రహిత తెలంగాణ, డ్రగ్స్ రహిత హైదరాబాద్ లక్ష్యాలను నిర్దేశించిన నేపథ్యంలో పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు న్యూ ఇయర్ వేడుకలపై ఫోకస్ చేశాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు నగర శివారుల్లో జరిగే పార్టీలపై ప్రత్యేకంగా నిఘా పెట్టనున్నట్టు పేర్కొన్నారు. అలాగే పలు ప్రాంతాల్లో ఉన్న ఫామ్ హౌస్‌లు, బార్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, హోటళ్లపై పోలీస్ శాఖ ఓ కన్నేసి ఉంచింది. న్యూ ఇయర్ వేడుకలపై సివిల్ పోలీస్‌తో పాటు నార్కోటిక్, ఎక్సైజ్, ఎస్‌ఓటి పోలీస్ విభాగాలు కూడా అలర్ట్ అయ్యాయని వేడుకల్లో భాగంగా ఆకస్మిక తనిఖీలకు ప్లాన్ చేసుకున్నట్టు హెచ్చరించారు.

మైనర్లను అనుమతిస్తే కేసులే

కొత్త ఏడాది వేడుకల్లో మైనర్లను బార్లు, పబ్‌లోపలికి అనుమతిస్తే కేసులు నమోదు చేస్తామని, అదేవిధంగా మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులు బాధ్యులు అవుతారని హెచ్చరికలు జారీ చేశారు. డీజేలతో హంగామా చేయవద్దని, నిషేధానికి సహకరించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా సౌండ్ పొల్యుషన్‌కు కారణంగా కాకుండా చూసుకోవాలని పబ్ యజమానులకు ఆదేశాలిచ్చారు. అనుమానం వస్తే నార్కోటిక్ టెస్ట్ సైతం చేస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు వెళ్తారని హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

న్యూ ఇయర్ వేడుకల్లో ప్రతి వాహనం తనిఖీ చేస్తాం

- ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్



నవతెలంగాణ-హాయత్‌నగర్

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తామని ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ వెల్లడించారు. వేడుకలు జరుపుకునే ప్రతి ఒక్కరూ పోలీ సుల ఆదేశాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. వేడుకల పేరుతో ప్రజా జీవనా నికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్ట పోలీస్ బందోబస్త్‌తో పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తామని తెలిపారు. వేడుకలురాత్రి 12:30 గంటల వరకు పూర్తి కావాలని, తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసు కుంటామన్నారు. ఆంక్షలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ ఏడాదిలో 1500 మందిని ట్రామా నుంచి కాపాడాం

కామినేని హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ నిపుణుడు, ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ కె.వెంకటరమణ



నవతెలంగాణ-హాయత్‌నగర్

కామినేని హాస్పిటల్స్‌లో ఈ ఏడాదిలో 1500 మంది బాధితులకు అత్యవసర చికిత్సనందించి కాపాడినట్టు క్రిటికల్ కేర్ నిపుణుడు, ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కామినేని ఆస్పత్రికి 2024లో భారీగా రోడ్డు ప్రమాద కేసులు వచ్చాయని, సగటున నెలకు 120-150 కేసులు వచ్చాయని చెప్పారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందంతో చికిత్స అందించామని చెప్పారు. సోమవారం ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరం మొత్తంమీద సుమారు 1500 నుంచి 1600 మందికి పైగా ప్రాణాలను ట్రామా కేసుల నుంచి కాపాడినట్టు తెలిపారు. వీటిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు ఉంటున్నాయని, ఆ తర్వాతి స్థానంలో ఫ్యాక్టరీల్లో జరిగే ప్రమాదాలు, నిర్మాణ ప్రదేశాల వద్ద జరిగేవి, తాడిచెట్ల మీద నుంచి పడిపోయేవి, పొలాల్లో క్రషర్ల కారణంగా జరిగే ప్రమాదాలు ఉంటున్నాయన్నారు. వీటిలో అత్యంత ఎక్కువ వాటా మాత్రం రోడ్డు ప్రమాదాలదేనన్నారు. గడిచిన సంవత్సరంలో జరిగిన ప్రమాదాలు, ఇతర దుర్ఘటనలు, వాటికి చికిత్స అందిస్తున్న తీరు, తక్షణ స్పందన అవసరమన్నారు.

అవగాహన కల్పించడం ప్రధానం

"ఔట్‌రీచ్ కార్యక్రమాల్లో భాగంగా కామినేని ఆస్పత్రి వైద్యులమంతా కూడా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ప్రమాదాలను నివారించాలంటే ఏం చేయాలో చెబుతున్నాం. రోడ్డు ప్రమాదాలు, పని ప్రదేశాల్లో ప్రమాదాల గురించి వివరిస్తున్నాం. నిర్మాణ సంస్థల్లో కూడా స్వయంగా మేము వెళ్లి వారికి అవగాహనా కల్పిస్తున్నాం. జరగకుండా ఎలా నివారించాలి, జరిగితే వెంటనే ఎలా ఆస్పత్రికి తీసుకురావాలో చెప్పాం. రవాణా శాఖ అధికారులతో కలిసి బ్యారికేడ్లు పెడుతూ, వాటిమీద కూడా హెల్మెట్లు వాడాలని, సీట్ బెల్టులు కట్టుకోవాలని ప్రచారం చేస్తున్నాం" అని అన్నారు. ఆయన వెంట వైద్యులు నవీన్ రెడ్డి, శంగాల దేవిజన్ లు ఉన్నారు.

చిలుక భాస్కర్ రచనలు పాఠ్యాంశాలుగా రావడం అభినందనీయం



- ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరాం
- 'తీరం చేరని కెరటాలు' కవితా సంపుటి ఆవిష్కరణ

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రభుత్వ ఉపాధ్యాయులు, రచయిత డాక్టర్ చిలుక భాస్కర్ రచించిన రచనలు డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశాలుగా రావడం అభినందనీయమని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరాం ఆయనను కొనియాడారు. చిలుక బ్రదర్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు డా.చిలుక భాస్కర్ ఉద్యోగ పదవీ విరమణ మహోత్సవం సందర్భంగా ఆయన రచించిన 'భాగ్యనగరంలో భాస్కరుడు' అభినందన సంచిక, 'తీరం చేరని కెరటాలు' కవితా సంపుటి గ్రంథాలను ఎమ్మెల్సీ ఎం.కోదండరాం, హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.కోదండరాం మాట్లాడుతూ మానవ జీవిత సారాంశాన్ని రచనల ద్వారా సమాజానికి చిలుక భాస్కర్ చాటి చెప్పారన్నారు. చదివి అందరు మెచ్చిన కవిగా రాణించాడని, తెలుగు భాషపై మంచి పట్టు సాధించారన్నారు. సాధారణ పదాలను అల్లుకుంటూ అద్భుతమైన కవిత్వాన్ని అందించారని, కరోనా సమయంలో ఆయన రాసిన కవిత అందరినీ ఆకర్షించిందన్నారు. కరోనా సమయంలో ప్రజలు ఏ విధంగా ఇబ్బందులు పడ్డారో తన కవిత ద్వారా సమాజానికి తెలియజేశారని గుర్తు చేశారు. నిజ జీవిత సత్యాలను లోతుగా అధ్యయనం చేసి కవిత్వాలుగా అందించారన్నారు. నేటి తరానికి చిలుక భాస్కర్ రచనలు చాలా అవసరమన్నారు. అనంతరం హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణి మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిలుక భాస్కర్ రచనలు నేటి తరానికి మార్గదర్శకమన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత విద్యార్థులకు బోధన చేసి వారి జీవితాలలో వెలుగులు నింపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గుండెడప్పు కనకయ్య, అంబేద్కర్ యువజన సమాఖ్య చైర్మెన్ రాపోలు రాములు, కవి దాస్యం సేనాధిపతి, ఎన్.గుండప్ప, డాక్టర్ మంతని శంకర్, డాక్టర్ పసునూరి రవీందర్, డాక్టర్ ఎస్.విజయభాస్కర్, చిలుక సంజీవరావు, చిలుక మల్లేశం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించండి

- అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి ఆదేశం
- తాగునీటి సరఫరాపై జూమ్ మీటింగ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వేసవి కార్యాచరణ కోసం సూక్ష్మ స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారుల్ని ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశించారు. జలమండలి ఉన్నతాధికారులు, సీజీఎం, జీఎంలతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ వేసవిలో సమర్థంగా తాగునీరు సరఫరా చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలన్నారు. గత వేసవిలో డిమాండ్‌ను దష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. వేసవిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఫిబ్రవరి 15 నుంచి జూన్ 15 వరకు 120 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపడతామని వెల్లడించారు. ఈ సమయంలో తాగునీటి సరఫరా, సమయాల్లో సూక్ష్మ పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తాగునీటి సరఫరా చేయవచ్చన్నారు. తాగునీటి సరఫరా, పైపులైన్లకు సంబంధించి ఏవైనా పనులు ఉంటే ఇప్పుడే పూర్తి చేసుకోవాలని సూచించారు. నూతన పైపులైన్ల నిర్మాణం, ఇతర సామగ్రి అవసరాలుంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఒక సంవత్సరంలో ప్రధానంగా 6 డివిజన్లలోని 20 సెక్షన్ల నుంచి అధికంగా ట్యాంకర్లు బుక్ అయ్యాయని తెలిపారు. గత వేసవిలో వంద కుటుంబాలు 31 వేల ట్రిప్పులను బుక్ చేశారన్న ఆయన.. వారికి ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందో కారణాలు తెలుసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. మరోవైపు 40 వేల కుటుంబాలు 70శాతం ట్యాంకర్ బుక్ చేశారన్నారు. వీరి ప్రాంగణాల్లో సర్వే చేస్తే 18 వేల కుటుంబాలు మాత్రమే ఇంకుడు గుంతల నిర్మాణాలు కలిగి ఉన్నాయన్నారు. మిగిలిన వారికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోకుంటే వచ్చే ఏడాది నుంచి ట్యాంకర్ రేట్లు రెట్టింపు చేస్తామని పేర్కొన్నారు. గత 15 రోజులుగా ట్యాంకర్ల బుకింగ్ పెరిగిందని, అయితే క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి గడువు దాటకుండా ఎప్పటి ట్యాంకర్ అప్పుడే డెలివరీ చేసినట్లు ఎండీ తెలిపారు. దీంతో పెండెన్సీ లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ట్యాంకర్లు అధికంగా బుక్ చేసుకునే ప్రాంతాల్లో స్పెషల్ ఆఫీసర్ లను నియమిస్తామని ఎండీ తెలిపారు. వీరు పరిస్థితుల్ని పర్యవేక్షిస్తారన్నారు. డీజీఎం స్థాయిలో డివిజన్ కు ఒక నోడల్ ఆఫీసర్లను సైతం నియమిస్తామన్నారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ ట్రాన్స్ మిషన్ లైన్ల మీద ఎమర్జెన్సీ, జంక్షన్ పనులు, వాల్వ్, లీకేజీ పనులు పూర్తి చేసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంచేసి సమర్పించాలని పేర్కొన్నారు. ఈ మీటింగ్ లో ఈఎన్సీ రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్లు స్వామి, అమరేందర్ రెడ్డి, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి

- ఉప్పల శ్రీనివాస గుప్తా



నవతెలంగాణ-నాగోల్

వివిధ అనారోగ్యాలకు గురై, ప్రమాదాల బారిన పడి మెరుగైన వైద్యం కోసం ఆర్థిక పరిస్థితులు అనుకూలించని అభాగ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. నాగోల్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో నల్గొండ జిల్లా తిపర్తి మండలం దుప్పల పల్లి గ్రామానికి చెందిన జీ. మధు కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును వారి కుమారునికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తుందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ ను అర్హులైన అందరూ వినియోగించుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సుప్రజ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా హెల్త్ క్యాంప్



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్లాస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఆధ్వర్యంలో నాచారంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు సుప్రజ హాస్పిటల్ ఎండీ డాక్టర్ సిగా విజయకుమార్ గౌడ్ తెలిపారు శిబిరం సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత క్యాంపును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ రోజుల్లో వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్నదని, దాంతో పేదవారు సరైన వైద్య సదుపాయం పొందలేరని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు తమ వంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించినట్టు తెలిపారు ఉచిత వైద్య శిబిరంలో సుమారు 200 మంది పాల్గొని వారికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐలా సెక్రటేరియట్ వైస్ చైర్మెన్ బాలరాజు, క్లాసిక్ గ్రూప్ ఆఫ్ కంపెనీ సీఎండీ వెంకన్న, హాస్పిటల్ కార్పొరేట్ జీఎం అజయ్ కుమార్ గౌడ్, ఏజీఎం మహమూద్, రాజేందర్, మనోజ్ శివ నేత, డాక్టర్ నిఖిల్, క్యాంప్ కోఆర్డినేటర్లు దుర్గాప్రసాద్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త



నవతెలంగాణ-నాగోల్

అన్ని దానాలలో కన్నా అన్నదానం మహా దానమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడ రేషన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసగుప్త అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ మహిళ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని ఓమిని హాస్పిటల్ ఎదురుగా భవాని టెంపుల్ వద్ద నిర్వహించిన అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్న ప్రసాద వితరణ ద్వారా కొంత మంది కడుపు నింపిన వాళ్లమవుతామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గరపు దయానంద్, చకిలం రమణయ్య, పబ్బ శేఖర్, కటకం శ్రీనివాస్ గుప్త, వీఎఫ్ సీనియర్ ప్రెసిడెంట్ కాచం కష్ణమూర్తి, గౌరిశెట్టి ప్రభాకర్, చిన్నం, వేణు ఐవిఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, ఐవీఎఫ్ మహిళా విభాగ్ ప్రెసిడెంట్ చందా భాగ్య లక్ష్మి ప్రధాన కార్యదర్శి మంజుల, కోశాధికారి అనిత, మనిమాల,సరిత , ఐవీఎఫ్ మహిళా విభాగ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పగడాల యాదయ్యకు శుభాకాంక్షలు



నవతెలంగాణ-హస్తినాపురం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) జిల్లా 10 వ మహాసభలు జరిగిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) నూ తన కార్యదర్శిగా ఎన్నికైన పగడాల యాదయ్యకు, ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులకు, జిల్లా కమిటీకి ఎన్నికైన సభ్యులకు, ఆయా ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు హస్తినాపురం డివిజన్ నందన వనం సీపీఐ(ఎం)శాఖ కమిటీ తరుపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని శాఖ కార్యదర్శి మంథని యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఆశా వర్కర్లకు గౌరవ వేతనం రూ.18వేలు ఇవ్వాలి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల గౌరవ వేతనం ఇవ్వాలని సీఐటీయూ బాలాపూర్ మండలకన్వీనర్ శేఖర్ యాదవ్ అన్నారు. సీఐటీయూ ఆశ వర్కర్ బస్ జాత జయప్రదం చేయాలని బాలాపూర్ మండలం నుంచి ఆశా వర్కర్లు సోమవారం తుక్కుగూడ ప్రాంతానికి బయలుదేరి వెళ్లారని తెలిపారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ మండల ప్రధాన కార్యదర్శి భాగ్యతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్ ఉద్యోగ భద్రత ఇన్సూరెన్స్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్టు తెలిపారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఆశా వర్కర్లు, రాష్ట్ర బస్సు జాతకు తమ మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులున్నారు.

2025 క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-చంపాపేట్

సీజీహెచ్‌ఎస్-8 వెల్నెస్ సెంటర్‌లో తాప్రా కంచన్‌బాగ్ కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2025 డైరీ, క్యాలెండర్, ప్యాకెట్ డైరీని ప్రారంభోత్సవం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఏ.వి.కె. దేవరాయలు, తాప్రా స్టేట్ డిప్యూటీ సెక్రటరీ ఎస్. సోమయ్య, తాప్రా స్టేట్ జాయింట్ సెక్రటరీ ఎం. కష్టారావు, సీజీహెచ్‌ఎస్ కమిటీ అధ్యక్షులు పి. సురేష్ బాబు జర్నల్ సెక్రెటరీ పి. శివలింగం సిజిహెచ్ ఎస్ ఎయిట్ వెల్నెస్ సెంటర్‌లో తాప్రా కంచన్‌బాగ్ కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2025 డైరీ క్యాలెండర్ ప్యాకెట్ డైరీని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఏవీకే దేవరాయలు, పాప్రా స్టేట్ డిప్యూటీ సెక్రటరీ ఎస్ సోమయ్య, తాప్రా స్టేట్ జాయింట్ సెక్రెటరీ ఎం కష్టారావు సీజీహెచ్ ఎస్ కమిటీ అధ్యక్షులు పి.సురేష్ బాబు జర్నల్ సెక్రెటరీ పి. శివలింగం గార్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అడ్వైజర్ కే ఓబుల్ రెడ్డి, ఎస్ సంతోషిన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జే పేత్రు వైస్ ఎన్‌వీకే మత్ వైస్ ప్రెసిడెంట్, సి. వినాయకరావు వైస్ ప్రెసిడెంట్ ఎం.దశరథ, జాయింట్ సెక్రెటరీ కె.రాజేంద్రనాథ్, జాయింట్ సెక్రెటరీ అబ్దుల్ గాని, జాయింట్ సెక్రెటరీ, కమిటీ మెంబర్స్‌సుమారు 70 మంది వరకు హాజరైనారు. జే పేతురు వందన సమర్పణ చేశారు.

ప్రజావాణి ఫిర్యాదులకు అవసరమైన చర్యలు



- జోనల్ కమిషనర్ టీ.వెంకన్న

నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజావాణిలో తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న తెలిపారు. ఆయన పర్యవేక్షణలో సోమవారం చాంద్రాయణగుట్ట నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ పరిధిలోని సైదాబాద్ స్మశానవాటి, చాంద్రాయణ గుట్ట సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణం, వీధి దీపాలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియో గించుకోవాలన్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సంబంధిత విభాగాలచే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజా, ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, యుబిడి డిప్యూటీ డైరెక్టర్ అమీనా బి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, సీనియర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా

నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి

- ఇన్‌స్పెక్టర్ కిసర నాగరాజు



నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలు నూతన సం వత్సరాల వేడుకలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా జరుపుకోవాలని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కీసర నాగరాజు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలందరికీ ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపు తూ ప్రజలందరూ వేడుకలు శాంతి యుతంగా జరుపుకోవాలని సూచించారు. పై అధికారుల ఉత్తర్వుల మేరకు మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని కాలనీలలో తగిన బందోబస్తు ఏర్పాటు చేయటం జరుగుతుందని ప్రజలందరూ పోలీస్ వారికి సహకరించగలరని కోరారు. నూతన సంవత్సర వేడుకలకు కొన్ని సూచనలు తెలియజేశారు.

- మద్యం సేవించి రోడ్లపైన వాహనాలను నడుపరాదు.
- పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నాము, పట్టుబడితే చట్టరీత్య చర్యలు ఉంటాయి
- మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు దుకాణాలకు/రెస్టారెంట్లకు తెరుచుకోవడానికి అనుమతి ఉంది. తరువాత నిర్వాహకులు దుకాణాలు, రెస్టారెంట్లు, పన్ షాప్ లను మూసి వేయాల్సి ఉంటుంది.
- నూతన సంవత్సరం వేళ రోడ్లపై వాహనాలను నిలిపి శుభాకాంక్షలు తెలుపుకోవడం, కేక్ కట్టింగ్స్ చేస్తుంటారు. అలా చేయడం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

తోటి పౌరులకు అసౌకర్యం కలిగించవద్దు. ప్రజల భద్రతే మా లక్ష్యం.

తిరుమలనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్‌లోని పలు సమస్యలపై సోమవారం కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ జలమండలి జీఎం సునీల్ కుమార్, డీజీఎం అక్షిత, మేనేజర్ నవీన్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తిరుమలనగర్, జవహర్‌నగర్ ఏరియాలలో మంజీరా వాటర్ ప్రెషర్ తక్కువగా రావడంతో కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన అధికారులను పిలిపించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, కిషోర్, నారాయణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి

- కౌన్సిలర్ మారేపల్లి రాజకుమారి సుధాకర్



నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ఏడోవ వార్డు బాసురేగడి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్టుగా కౌన్సిలర్ మారేపల్లి రాజకుమారి సుధాకర్ తెలిపారు. సోమవారం వార్డు పరిధిలోని వైకుంఠధామంలో విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం సహకారం అందించాలని మెడినోవా ఆస్పత్రి చైర్మెన్ సింగిరెడ్డి వెంకటరెడ్డిని కోరగా ఆయన రూ.1లక్ష 50వేలతో విద్యుత్ దీపాలకు ఏర్పాటుకు కేబుల్ వైర్లను కొనుగోలు చేసి అందజేసినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు మున్సిపల్ నిధులతో విద్యుత్ దీపాల ఏర్పాటు చేసినట్టు కౌన్సిలర్ రాజకుమారి సుధాకర్ తెలిపారు. ఆర్థిక సహకారం అందించిన సింగిరెడ్డి వెంకటరెడ్డికి కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపారు.

అమిత్‌షాతో రాజీనామా చేయించి, మోడీ క్షమాపణ చెప్పాలి

- సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి
- అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు తెలిపిన సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

గత పార్లమెంటు సమావేశాల సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రతిపక్షాలు డా॥ బీఆర్ అంబేద్కర్‌ను అదేపనిగా తలవడం కంటే, భగవంతుణ్ణి తలచుకుంటే పుణ్యం, స్వర్గం దొరుకుతుందని, వ్యాఖ్యానం చేశారు. అలా అంబేద్కర్‌ని అవమానించిన అమిత్‌షాతో వెంటనే రాజీనామా చేయించి, మోడీ క్షమాపణలు చెప్పాలని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోంమంత్రి అవమాన పరిచి యావత్ భారత పౌరుల మనో భావాలను కించపరిచినాడన్నారు. దేశ వ్యాపితంగా నిరసన కార్యక్రమాలలో భాగంగా సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండలకమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికిసీపీఐ(ఎం)తో పాటు సీపీఐ నాయకులు కూడా తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు గుంటి లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాలను తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన కేంద్ర మంత్రి అమిత్ షా దేవుళ్ళు, దెయ్యాలని ప్రసంగించడం సిగ్గుచేటుని దుయ్యబట్టారు. ఇది సెక్యులర్ భావాలకు, లౌకికవాదానికి పూర్తి విరుద్ధమని విమర్శించారు. అనంతరం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమిత్ షాను సస్పెండ్ చేయాల్సింది పోయి, సమర్థించడం సిగ్గుచేటని, ఒక వైపు మణిపూర్‌లో మంటలు రగులుతున్నాయి. ప్రధాని మోడీ అక్కడికి వెళ్లే ప్రయత్నం చేయడు, వాళ్ళ సమస్య పరిష్కారం చేయడు, పాలించే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఉన్నదా.. అని ప్రశ్నించారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కృపా సాగర్ మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే ఎన్నిక చట్టం తేవడానికి పార్లమెంట్‌లో చర్చ జరిగితే, ప్రతి పక్షాలు, ఇండియా కూటమి తీవ్రంగా వ్యతికించింది. ఈ చర్చను పక్కదారి పట్టించేందుకు అమిత్ షా అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేక భారత పౌరులను పచ్చి మోసం చేసిందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. అమిత్ షా రాజీనామా చేయాలని, నిండు సభలో అంబేద్కర్‌ను అవమనించడాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో ఈ విధంగా ఏ ప్రభుత్వం విమర్శించలేదన్నారు. దేశ సమైక్యతను, సమగ్రతను పాతరేస్తున్నారన్నారని వాపోయారు. సీపీఐ నాయకులు నాగరాజు, కమలాకర్‌లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే వామపక్ష పార్టీలు చూస్తూ ఊరుకోవు ఉద్యమిస్తాయాని, ఓటు ద్వారా ఎన్నికయిన అమిత్ షా పదవులు అనుభవిస్తూ సిగ్గు, ఎగ్గు లేకుండా మాట్లాడటం అందరూ వ్యతిరేకించాలని కోరారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేని మోడీకి పాలించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదాని, అంబానీలకోసమే పనిచేస్తున్నారని, ప్రభుత్వ సంస్థలన్నీ అమ్మేస్తున్నాడని దేశానికి ఆర్థిక నష్టం కలిగిస్తున్నడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల నాయకురాలు మంగ, విజయ్ కుమార్, డీవైఎఫ్ఐ నాయకులు నాగమణి, అన్నపూర్ణమ్మ, రాజ్యలక్ష్మి, రాజు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

నవతెలంగాణ-కాప్రా

పార్లమెంట్‌లో డా॥ బీఆర్ అంబేద్కర్ పట్ల అవమానకరంగా, హేళనగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెంటనే పార్టీ నుంచి తొలగించాలని సీపీఐ(ఎం) కాప్రాసర్కిల్ కమిటీ డిమాండ్ చేసింది. సీపీఐ(ఎం) సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, జి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. భారతరత్న రాజ్యాంగ సృష్టికర్త డా॥ బీఆర్ అంబేద్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి పార్లమెంటులో అవమానకరంగా అసభ్యకరంగా మాట్లాడిన తీరుని క్షమించరానిదని అన్నారు. వెంటనే అమిత్ షా పార్లమెంటు సాక్షిగా భారతదేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంఘ పరివార శక్తులు తమ మనువాద ఏజెండాను అమలు చేయటానికి మెల్ల మెల్లగా ప్రజల మనసులో చొప్పించే దానికి ప్రయత్నం చేస్తున్నదని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఒక ప్లానుగా అమిత్ షా పార్లమెంటులో అంబేద్కర్ అంబేద్కర్ అని పదేపదే ఎందుకు మాట్లాడతారు. అతను ఏమైనా దేవుడా పదేపదే ఎక్కడ చూసినా అంబేద్కర్ అంటా ఉంటారు. అదే దేవుని స్మరిస్తే పుణ్యం ఉంటది అనే పద్ధతుల్లో అవమాన పరుస్తూ మాట్లాడినటువంటి దాన్ని ఖండించారు. మోడీ తన ఆప్తమిత్రుడు అయిన అదానికి దేశ సంపదను దోశ పెడుతున్న సందర్భంలో కాంట్రాక్ట్ పొందే సందర్భంలో లంచం ఇవ్వ చూపిన అంశము ప్రపంచవ్యాప్తంగా దుమారం లేచిన సందర్భములో ఈ విషయాన్ని పక్కదారి పట్టించే దానికి అమిత్ షా ఒక ప్లాన్ ప్రకారంగా ఈ విధమైన తప్పుడు వ్యాఖ్యలు చేశారన్నారు. రాజ్యాంగ వ్యవస్థను ఫెడరల్ వ్యవస్థను తూట్లు పొడిచే పద్ధతుల్లో వ్యవహరిస్తున్న బీజేపీ విధానాలను వ్యతిరేకించాలని అన్నారు. ఈ విధమైన అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి పట్ల ప్రధానమంత్రి మౌనంగా ఉండడం అదేవిధంగా బీజేపీ సంఘ పరివార్ శక్తులు కూడా ఖండించకపోవడం దుర్మార్గమని వాపోయారు. వెంటనే అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎన్.శ్రీనివాస్, సర్కిల్ కమిటీ సభ్యులు కె.వెంకటాచారి, డీకే.దుర్గయ్య, శివ నారాయణ, పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ దేవి రెడ్డి, శ్రీమన్నారాయణ, సోమయాచారి, జీవి రావు, వెంకటాద్రి, బి.ఆదామ్, గోవింద్, పి.కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, సురేష్, మన్మధరావు పాల్గొన్నారు.

సమస్యలపై కార్పొరేటర్ పాదయాత్ర





- సమస్యలను డీసీకి వినతి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని మారుతినగర్‌లో సోమవారం పలు సమస్యలపై మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో కమర్షియల్ ప్రదేశాలలో పార్కింగ్ సమస్య ఉందని, చరవాణి ద్వారా ట్రాఫిక్ సీఐకి తెలిపి ప్రత్యేకంగా ఒక కానిస్టేబుల్‌ను పెట్టాలని కోరారు. కరెంటు డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫోన్ ద్వారా పాడై పోయిన ఐరన్ పోల్స్‌ను సిమెంట్ పోల్స్‌తో రీప్లేస్ చెయ్యాలని కోరారు. స్వచ్ఛ ఆటో వారిని చెత్త రోడ్డు పైన పెర్చొద్దని, మున్సిపల్ సిబ్బంది రోడ్ల పైన పేరుకు పోయిన చెత్తను ప్రత్యేక దృష్టి పెట్టి ఎత్తించాలని సూచించారు. కాలనీలో వీధి దీపాల సమస్య ఉందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన కార్పొరేటర్ వారం లోపల స్పెషల్ డ్రైవ్ పెట్టి అన్ని వీధి దీపాలను బాగు చెయ్యాలని ఏ.ఈ వెంకటేష్‌తో మాట్లాడారు. మంచి నీటి సరఫరా గురించి ఆరా తీయగా కొద్ది మందికి మినహాయిస్తే కాలనీలో నీటి సరఫరాలో బానే ఉందని స్థానికులు తెలిపినట్టు తెలిపారు. అనంతరం పాదయాత్ర తరువాత మున్సిపల్ కార్యాలయంలోని ప్రజావాణిలో పాల్గొని పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీసీ రాజుకు వినతిపత్రంను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శంకు, మూర్తి, జయ కృష్ణ, సుబ్రహ్మణ్యం, గణేష్, మహేందర్, రమేష్, మోహన్ రావు, ఎస్ఎఫ్ఏ గిరి తదితరులు పాల్గొన్నారు.

గౌడ ఐక్య సాధన సమితి 'మల్కాజిగిరి' అధ్యక్షులుగా వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

గౌడ ఐక్య సాధన సమితి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులుగా మల్కాజిగిరి వినాయక్ నగర్‌కు చెందిన పల్లె వెంకటేశం గౌడ్ నియమితులయ్యారు. గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ అబిడ్స్‌లోని గౌడ సంఘం కార్యాలయంలో సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. వెంకటేష్ గౌడ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బత్తిని మురహరి గౌడ్, ప్రచార కమిటీ చైర్మెన్ జివాజి అంజయ్య గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధులు బూడిద నర్సయ్య గౌడ్, బబ్బురి రాజేష్ గౌడ్, బండి బుచ్చయ్య, బూడిద కాళం గౌడ్ పాల్గొన్నారు.

మన్నే సుబ్రమణ్యంకు జర్నలిస్టులు నివాళి



నవతెలంగాణ-కాప్రా

ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ సీనియర్ నాయకులు, సంఘ సేవకులు మన్నే సుబ్రమణ్యం ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు మన్నే సుబ్రహ్మణ్యం స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మన్నే సుబ్రహ్మణ్యం చేసిన సహాయ సహకారాలను గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు, వారి కుమారుడు మన్నె ఫణీంద్రకు తమ సానుభూతి తెలియజేస్తూ, మనో ధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులు గుమ్మడి హరిప్రసాద్, దొమ్మాటి కిరణకుమార్‌రావు, డి శ్రీనివాసరావు, రామచంద్ర మూర్తి, బిఎస్ బాబు, దాసారం శ్రీనివాస్, సురేష్ సాగర్, ఎం కనక బాబు, పటేల్ నరసింహ, టీడీపీ తెలంగాణ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు టీజీకే మూర్తి, టీడీపీ ఉప్పల్ అడహక్ కమిటీ సభ్యులు నీరుకొండ సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ కాలేజీ తరలింపు.. విద్యార్థుల ఆందోళన

- స్థల సమస్యలు, అసౌకర్యాల మధ్య విద్యార్థుల గోడు..
- ఆర్మీ కాలేజీ విద్యార్థుల ఆందోళన



నవతెలంగాణ-ఘట్కేసర్

యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్‌లో ఉన్న ఆర్మీ కాలేజీని గత 15 రోజుల కిందట ఘట్కేసర్ మండలం అంకుషాపూర్‌లోని మహేంద్ర హిల్స్ డిగ్రీ కాలేజీకి గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. దీంతో గత 15 రోజులుగా విద్యార్థినిలకు బాత్రూములు సరిపోక, నీళ్ల రాక, ఇరుకు గదులలో బిక్కుబిక్కుమంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తినడానికి స్థలం సరిపోక బయటకు వచ్చి భోజనం చేస్తున్నట్టు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం జాయింట్ సెక్రెటరీ శారద కాలేజీని సందర్శించి ఆయా గదులను పరిశీలించారు. ఇబ్రహీంపట్నం కాలేజీని ఇక్కడికి తరలించి ఆర్మీ కాలేజీని ఇబ్రహీంపట్నం కాలేజీలో ఉంచుతామని చెప్పడంతో విద్యార్థులు గేటు ముందు బైఠాయించి కాసేపు ధర్నా చేశారు. విద్యార్థులను బయటికి వెళ్లకుండా తాళం వేసి సమస్య సద్దుమణిగే వరకు ఉంచి లోపలికి పంపించినట్టు తెలిసింది. దీనిపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఆర్మీ కళాశాలకు కావలసినంత స్థలం లేకపోవడం, ఆర్మీకి సంబంధించిన ఎక్విప్మెంట్స్ మొత్తం నెలమట్టమై శిథిలావస్థకు చేరిందని తమ పరిస్థితి అయోమయంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్నంపట్లలో ఉన్న కళాశాలకు తరలించాలని బాలికలు కోరుతున్నారు.

ప్రిన్సిపాల్‌కు అనుకూలంగా నిర్ణయాలు.. విద్యార్థుల ఆరోపణలు...

విద్యార్థులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆర్మీ కాలేజీ ప్రిన్సిపాల్ అంకుషాపూర్ ప్రాంతానికి బదిలీ చేయడంపై ముందే ప్రణాళిక చేసుకున్నట్టు తెలుస్తోంది. అంకుషాపూర్‌లోని గురుకుల కళాశాలలో గతంలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ప్రస్తుత ప్రిన్సిపాల్, హైదరాబాద్‌కు దగ్గరగా ఉండే ఈ ప్రాంతం తనకు అనుకూలంగా ఉంటుందని భావించి, ఆర్మీ కళాశాలను తరలించారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

అన్నంపట్ల అగ్రికల్చర్ భవనంపై వివాదం..

ఆర్మీ కాలేజీని అన్నంపట్ల గ్రామ శివారులో ఉన్న మూసిపడిన అగ్రికల్చర్ కాలేజీ భవనంలోకి తరలించేందుకు అద్దె ఒప్పందం జరిగినప్పటికీ, ఆ భవనం సౌకర్యవంతంగా లేదని సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. పైగా అవుశాపూర్‌లోని స్థలం తమకు సౌకర్యంగా ఉంటుందని కొందరు కళాశాల సిబ్బంది భావించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్మశానవాటిక ఏర్పాటుకు కృషి



- కార్పొరేటర్ బన్నాల

నవతెలంగాణ-ఉప్పల్

మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు సకినాల ప్రసాద్, బెజగం శ్రీనివాస్ సోమవారం చిల్కనగర్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌కు డివిజన్‌లోనీ పద్మశాలి సంఘనికి స్మశానవాటిక కొరకు స్థల సేకరణ విషయంలో పూర్తి సహకారం ఉండాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. డివిజన్‌లో కార్పొరేటర్ ఆధ్వర్యంలో అన్ని కులాల స్మశానవాటికకు నిధులు కేటాయిస్తూ, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తూ, అభివృద్ధిలో తనదైన మార్కు వేసుకున్నారని ప్రశంసించారు. పద్మశాలి సంఘానికి సంబంధించిన 674 కుటుంబాలకి వైకుంఠధామం లేదని స్మశానవాటిక కొరకు స్థల సేకరణ విషయంలో వారి పూర్తి మద్దతు పద్మశాలి సంఘానికి ఉండాలని కోరారు. కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్ ప్రజల ఆశీస్సులతో డివిజన్ కార్పొరేటర్‌గా అవకాశం కల్పించిన ప్రతి ఒక్క కుల సంఘం వారికి స్మశానవాటిక కొరకు ఎన్నికలలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ.. నిధులు కేటాయించి అభివృద్ధి చేసుకుంటూ.. ముందుకు సాగుతున్నామని తెలుపుతూ.. డివిజనన్‌లోని భక్త మార్కండేయ పద్మశాలి సంఘం కొరకు స్మశానవాటిక స్థల సేకరణ విషయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి వీలైనంత త్వరలో స్మశానవాటికకి ప్రభుత్వ స్థల కేటాయింపు విషయంలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోకుండా జగన్, బింగి శ్రీనివాస్, చిల్కానగర్ డివిజన్ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు నాగార్జున, దాసరి శ్రీనివాస్, దేవసాని బాలచందర్, సామల నాగరాజు, నర్సింగ్ రావు, అంజయ్య, రమేష్, పాముల ఆంజనేయులు, చందు, కృష్ణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, పాముల బాలకృష్ణ, చంద్రశేఖర్ మొదలగువారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

- గాంధీ మెడికల్ కాలేజ్ గైనకాలజీ డిపార్ట్మెంటల్ హెడ్ డాక్టర్ రమాదేవి
- జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలికల, మహిళల ఆరోగ్య సమస్యలపై సెమినార్





నవతెలంగాణ-చర్లపల్లి

నేటి యువతులు, మహిళలు వారి ఆరోగ్య సమస్యలపై సంపూర్ణ అవగాహన లేక అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వారి ఆరోగ్య సమస్యలపై పూర్తి అవగాహన పెంచుకొని వాటి నివారణకు సరైన మార్గం ఎంచుకోవడం ద్వారానే వారు త్వరగా ఈ ఆరోగ్య సమస్య నుంచి బయటపడతారని గాంధీ మెడికల్ కాలేజ్ గైనకాలజీ డిపార్ట్‌మెంటల్ హెడ్ డాక్టర్ రమాదేవి అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో కుషాయిగూడలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో బాలికల, మహిళల ఆరోగ్య సమస్యలపై సెమినార్ నిర్వహించారు. వక్తగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాంధీ మెడికల్ కాలేజ్ గైనకాలజీ డిపార్ట్మెంటల్ హెడ్ డాక్టర్ రమాదేవి హాజరై ప్రసంగించారు. ఆడపిల్లల్లో చిన్నతనం నుండే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి, యవ్వన దశలో అధికంగా ఉంటాయి. వాటిపై పూర్తి అవగాహన ప్రతి ఒక్కరికి అవసరమని, ఈ అవగాహన సెమినార్లను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అమె అన్నారు. ఈరోజు అనేక ప్రయివేట్ హాస్పిటల్లలో ఆరోగ్య సమస్యలపై అనేక రకాల టెస్టులు చేయించి, అందరి నుంచి డబ్బులు దండుకుంటున్నారని, ఆరోగ్య చిట్కాలతో అనేక సమస్యలను తగ్గించుకోవచ్చని, వీటిని విస్తృతంగా ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ సునీత రాణి, జేవీవీ రాష్ట్ర నాయకులు పిట్టల నాగరాజు, ముప్ప శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తోట శ్రీనివాస్, కోశాధికారి జెన్నీ, ఉపాధ్యక్షులు శివప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకోసం పోరాడేది సీపీఐ



- సీపీఐ మేడ్చల్ సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

పేద, మధ్య తరగతి వర్గ ప్రజల కోసం పోరాడేది సీపీఐ అని మేడ్చల్ జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా నాగార్జున కాలేజీ మైదానంలో జరుగుతున్న సీపీఐ శతాబ్ది వ్యవస్థాపక బహిరంగ సభకు సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ నేతలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు జీ.లక్ష్మీ నారాయణ, నారా నర్సింహ, ఉషశ్రీ, మల్లేష్, జాన్, గిరిబాబు, శేఖర్, జహంగీర్, సాయి, ప్రసాద్, మురళి, కీర్తన్, సీపీఐ ఘట్కేసర్ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, యోబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవీఎస్ హోమియో మెడికల్ కాలేజీ వార్షికోత్సవం



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్‌రావునగర్ డీఈవీఎస్ హోమియో మెడికల్ కాలేజీ వార్షికోత్సవం, స్నాతకోత్సవ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ప్రపంచంలో మంచి డాక్టర్లు, ఐటి రంగ నిపుణులు, మేధావులు భారతదేశం వారే ఎక్కువ మంది ఉన్నారన్నారు. అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాల్లో నవంబర్ వన్ స్థానంలో ఉన్నారు. లండన్, ఇరాన్ ప్రధాన మంత్రులు కరోనా సమయంలో కన్నీళ్లు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు సైతం దేవుడే కాపాడాలి అన్నారు. భారతదేశం కరోనాని సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా ప్రపంచానికి వాక్సిన్ అందించిన దేశం మనదని గర్వంగా పేర్కొన్నారు. సాధారణంగా అమెరికాలాంటి దేశాలు పేదదేశాలను ఆదుకుంటాయి. కరోనా ప్రివెంటివ్ మెడిసిన్‌ను అమెరికాకు అందించిన దేశం భారతదేశం అన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, మేదోసంపత్తిలో, మిలిటరీలో అమెరికా, చైనా తర్వాత భారతదేశం మూడవ స్థానాన్ని సంతరించుకుంది. మూడవ పవర్‌ఫుల్ దేశంగా ఖ్యాతికి ఎక్కింది. ప్రపంచంలో అతి ఎక్కువ మేధాశక్తితో కూడిన యువశక్తిగల దేశం భారతదేశం అని వెల్లడించారు. డాక్టర్స్‌గా చదవడం ఎంత ముఖ్యమో ప్రాక్టికల్ నాలెడ్జ్ అంత ముఖ్యమన్నారు. మనిషి ఉన్నంత వరకు వైద్యం అవసరం. వైద్యో నారాయణో హరి: అంటారని తెలిపారు. వైద్యున్ని దేవుడితో పోలుస్తారు. డబ్బుల కోసం కాకుండా సేవ దృక్పథంతో పని చేయాలని డాక్టర్స్‌కు ఈటల రాజేందర్ సూచించారు.

కమిటీ సభ్యులకు సహకారం ఉంటుంది



- కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-చర్లపల్లి

అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ సభ్యులకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, బీజేపీ కిసాన్ మోర్చా అర్బన్ డిస్ట్రిక్ట్ వైస్ ప్రెసిడెంట్ రాగిరి మోహన్ రెడ్డి అన్నారు. మల్లాపూర్ అంబేద్కర్ సంఘం నూతన అద్యక్షునిగా ఎన్నికైన కర్రె శంకర్ కమిటీ సభ్యులను ఆయన నాచారంలో ఘనంగా శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే రెండేండ్లలో సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ, విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా నా వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అమరేందర్ రావు, కృష్ణారెడ్డి, విష్ణు, నరేందర్, గణేష్, లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

భవనం పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.... ప్రకాశం జిల్లా నుంచి వలస వచ్చి జీడిమెట్ల ఎస్ ఆర్ నాయక్ నగర్‌లో చెంచు రామయ్య (42) నివాసముంటున్నాడు. భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి భార్య కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియవలసి ఉందన్నారు.

ప్రజావాణిలో భూ ఆక్రమణలపై ఫిర్యాదు



నవతెలంగాణ-దుండిగల్

భూ అక్రమణాలపై ఫిర్యాదులు చేసిన తహసిల్దార్లు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు. దుండిగల్ మండలం డిపోచంపల్లి నందు బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రభుత్వ భూమి 20 గుంటల ఆక్రమణపై ఫిర్యాదు చేసిన ఎమ్మార్వో చర్యలు తీసుకోకపోవడంతో... బాచుపల్లి మండల పరిధిలోని విఎన్ఆర్ విద్యా సంస్థల నందు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై ఇరువురు తహసిల్దార్ల పై సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం జరిగింది.

అత్యాధునిక హంగులతో మోడ్రన్ దోబిఘాట్‌గా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

దోబిఘాట్‌ను అత్యాధునిక హంగులతో మోడ్రన్ దోబిఘాట్‌గా తీర్చిదిద్దుతానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్ వన్‌లో ఉన్న దోబిఘాట్‌ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోడ్రన్ దోబిఘాట్‌గా తీర్చిదిద్దేందుకు తలపెట్టిన పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. నాయి బ్రాహ్మణ సంఘ భవనం అభివృద్ధి నిర్మాణ పనులను, నాల (రిటైనింగ్ వాల్) ప్రహరీ గోడ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిఈ శంకర్, ఏఈ శ్రీనివాస్, రజక సంఘం సభ్యులు, నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరిచిపోయిన బ్యాగ్‌ను ప్రయాణికురాలికి అందజేసిన మేనేజర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగ్‌ను బస్సులో మరిచిపోయిన ప్రయాణికురాలికి డిపో మేనేజర్ అందజేశారు. కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డ్రైవర్, కండక్టర్‌ల నీతి నిజాయితీకి ఇందుకు నిదర్శనం. టీమ్ డ్రైవర్ మధుబాబు, రాములు డ్రైవర్, బస్సులో ఓ మహిళా ప్రయాణికురాలు, బస్సులో ప్రయాణం చేసి, తమ బంగారు ఆభరణాలు బస్సులోనే మర్చిపోయారు. ప్రయాణికురాలు బస్సు టికెట్ పైన నంబర్‌కి ఫోన్ చేసి, కూకట్‌పల్లి డిపో అధికారులను సంప్రదించారు. అధికారులు, డ్యూటీ డ్రైవర్, కండక్టర్లకి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా.. ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.6700 లు నగదు ఉన్నాయి. డిపో మేనేజర్ డి.హరి ఆధ్వర్యంలో.. సంబంధిత ప్రయాణికురాలికి బంగారు ఆభరణాలు, రూ. 6700 నగదును గల మేనేజర్, శ్రీలత, టిఐ సావిత్రి మేడం, సి ఐ జనరల్ ఏడిసి.చెన్నప్ప సెక్యూరిటీ ఎస్ఐ అన్వర్ ఖాన్, వెల్ఫేర్ మెంబర్ శ్రీనివాస్, లక్ష్మీల సమక్షంలో వారికి అందజేశారు. అనంతరం డ్రైవర్, కండక్టర్‌ల నిజాయితీని అభినందిస్తూ.. వారికి నగదు పురస్కారం డిపో మేనేజర్ హరి అందజేశారు.

జేఎన్‌టీయూహెచ్‌లో క్లీన్ క్యాంపస్ డ్రైవ్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యార్థుల్లో పరిశుభ్రత, పచ్చదనం గురించి అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన క్లీన్ క్యాంపస్ డ్రైవ్" కార్యక్రమాన్ని వైస్ ఛాన్సలర్‌తో పాటు యూనివర్సిటీ రెక్టర్ డా. కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె.వెంకటేశ్వర రావు, చీఫ్ ఇంజనీర్ డా.వెంకటేశ్వర రెడ్డి, కాలేజ్ ప్రిన్సిపాల్ డా.జి.వి. నరసింహ రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపస్ పరిశుభ్రంగా ఉంచడం, పర్యావరణాన్ని అనుకూలంగా రూపొందించడం, అలాగే విద్యార్థులు, సిబ్బందికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలన్నారు. ప్రతి నెల రెండు సార్లు, రెండు గంటల పాటు క్యాంపస్ పరిశుభ్రతను నిర్వహించాలని ఆయన సూచించారు. క్లీన్ క్యాంపస్ డ్రైవ్ విద్యార్థులలో పరిశుభ్రతపట్ల శ్రద్ధను పెంపొందిస్తుందని, పచ్చదనాన్ని చాటించడంలో ఒక ఉదాహరణగా నిలుస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎస్. శోభా రాణి, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా.ఎం.పద్మావతిల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.

పేదలకు నిత్యం సేవలందిస్తాం



- శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజలకు శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిత్యం సేవలందిస్తామని,అన్నదానం ఎంతోమంది పేదల కడుపు నింపుతుందని అధ్యక్షులు మోతే రాజేశ్వర్, రవితేజ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కమిటీ కార్యనిర్వాహకులు జింకల వెంకటేష్ ముదిరాజ్‌లు అన్నారు. ఈ మేరకు సోమవారం అమావాస్య పురస్కరించుకుని శ్రీ సాయిగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్, పంచశీలకాలనీలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అత్యధికంగా పేద ప్రజలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు అత్యధికంగా ఉంటారని కమిటీ ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానాలు గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో కూడా కమిటీ సభ్యులతో కలిసి పలు సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీలక్ష్మి రోడ్ వేస్ అధినేత కార్యనిర్వాహకులు బివి.సూర్యనారాయణ గురుస్వామి, బాషయ్య, దాత అంబాదాస్, సభ్యులు శంకర్ నాయక్, సంజీవ్, రాంబాబు, జామకాయల ప్రకాష్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కెమెరా ఉంది... జాగ్రత్త

- విధి నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం మెరుగు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులు జాగ్రత్త. వాహనాలను అడ్డదిడ్డంగా నడిపించినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించుకున్నా ఇట్టే దొరికిపోతారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా దూసుకెళ్లేవారితోపాటు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన సమయంలో పోలీసులతో వాహనదారులు వాగ్వాదాలకు దిగితే ఈ కెమరాలు రికార్డు చేస్తాయి. సోమవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శరీరానికి ధరించే 50 కెమెరాలను రాచకొండ సీపీ జీ.సుధీర్‌బాబు ట్రాఫిక్ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. శరీరానికి ధరించే కెమెరాలు విధి నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతన్నాని పెంచుతాయన్నారు. పోలీసులు, వాహనదారుల ప్రవర్తన, పరస్పర చర్యలు రికార్డ్ అవుతాయన్నారు. దాంతో ప్రజలు, ట్రాఫిక్ సిబ్బందికి మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. ట్రాఫిక్ విభాగ పనితీరు ఆధునీకరించడానికి మరియు పోలీసులకు మరియు ప్రజలకు మధ్య విశ్వాసాన్ని పెంపొందించడానికి చేస్తున్న విశేష



ప్రయత్నాలలో భాగంగా శరీరానికి ధరించే కెమెరాల పరిచయం ఒక మైలురాయి వంటిదని పేర్కొన్నారు. రహదారి భద్రతను మరింతగా పెంచడమే కాక ప్రజలు ,పోలీసుల మధ్య పారదర్శక వ్యవస్థను మరింతగా పెంపొందించడానికి వీలైనంత ఎక్కువగా సాంకేతికతను ఉపయోగిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. శరీరానికి ధరించే కెమెరాల వాడకం అధికారుల వత్తి నైపుణ్యాన్నిపెంపొందించడమే కాకుండా పోలీసు డిపార్ట్‌మెంట్‌పై ప్రజలకు నమ్మకం విశ్వాసాన్ని పెంపొందిస్తుందని సిపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు శ్రీనివాసులు, ఎస్. మల్లా రెడ్డి, ఏ. రమణా రెడ్డి, మురళీధర్, ప్రదీప్ బాబు, ఇన్‌స్పెక్టర్లు రామ లక్ష్మణ రాజు, నరసింహతోపాటు మల్కాజిగిరి ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లు ఇతర ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెమెరాల ఏర్పాటు లక్ష్యం:

పారదర్శకత, జవాబుదారీతనం: శరీరానికి ధరించే కెమెరాల ద్వారా ట్రాఫిక్ అధికారులు మరియు ప్రజల మధ్య జరిగే పరస్పర చర్యలు రికార్డ్ చేయబడి వివాదాలు మరియు ఫిర్యాదుల అవకాశం తగ్గుతుంది.

- అధికారుల ప్రవర్తన మెరుగుపడుతుంది: వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా, విధుల్లో ఉన్నప్పుడు అత్యున్నత ప్రమాణాల ప్రవర్తనకు కట్టుబడి ఉండేలా అధికారులను ఈ కెమెరాలు ప్రేరేపిస్తాయి.
- మెరుగైన ప్రజా విశ్వాసం: అధికారులు, సిబ్బంది ప్రవర్తనా చర్యలు ఎప్పటికప్పుడు రికార్డు అవడం ద్వారా ప్రజలకు నమ్మకం పెరగడంతో పాటు అధికారులతో ప్రజలు సంయమనంతో, సవ్యంగా వ్యవహరించేందుకు అవకాశం ఉంటుంది.
- ఖచ్చితమైన సాక్ష్యాధారాల సేకరణ: ట్రాఫిక్ ఉల్లంఘనలు, వివాదాలు లేదా పరిశోధనల విషయంలో రికార్డ్ చేయబడిన ఫుటేజ్ నమ్మదగిన సాక్ష్యంగా ఉపయోగపడుతుంది.

ఎంటెక్ సెమిస్టర్ ఎగ్జామ్‌లను వాయిదా వేయాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జనవరి 7, 9వ తేదీల్లో యూజీసీ నెట్ ఎగ్జామ్స్ ఉన్నందున ఆయా తేదీల్లో ఉన్న ఎంటెక్ సెమిస్టర్ ఎగ్జామ్‌లను పోస్ట్ ఫోన్ చేయాలని సోమవారం జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ స్పోర్ట్స్, స్టూడెంట్ ప్రొడక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో.. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ జీవి నరసింహారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రావుల నాయక్ మాట్లాడుతూ విద్యార్థులంతా సంవత్సరం అంతా కష్టపడి సెమిస్టర్ ఎగ్జామ్‌లకు సిద్ధమయ్యారన్నారు. అదే విధంగా అనేక మంది విద్యార్థులు తమ ఉన్నత చదువుల కోసం పీజీ తదనంతరం పిహెచ్‌డి, యూజీసీ జెఆర్ఎఫ్‌ల కొరకు సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్నారన్నారు. సెమిస్టర్ పరీక్షలు, యూజీసీ నెట్ ఎగ్జామ్స్ ఒకటే తేదీల్లో ఉన్న కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. దానికి కారణంగా రెండు పరీక్షలను సరిగా ప్రిపేర్ కాలేరని ఆవేదన వ్యక్తం చేశారు. యూజీసీ నెట్ ఎగ్జామ్స్ ఉన్న తేదీల్లో జనవరి 7, 9 తేదీల్లో ఉన్న పరీక్షలను ఉన్న సెమిస్టర్ పరీక్షలను యూజీసీ ఎగ్జామ్స్ అనంతరం నిర్వహించాలని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకవచ్చారు. ఇట్టి విషయమై ప్రిన్సిపాల్ జీవి నరసింహారెడ్డి సానుకూలంగా స్పందించి.. పోస్ట్ ఫోన్ చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగ్గ తేదీలను విశ్వవిద్యాలయ వెబ్ సైట్ ద్వారా విద్యార్థులకు చేరవేస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చంద్రశేఖర్, అర్జున్ గౌడ్, సాయికుమార్, జవాజి, దిలీప్, రోహిత్ కుమార్ తదితరులున్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు సబ్‌స్టేషన్ వార్షిక నిర్వహణ పనుల కారణంగా రాజీవ్ గృహకల్ప,సూరారం విలేజ్, క్రుషి కాలనీ, ఆర్‌జికె 1,2 విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు మరాఠీ బస్తీ, రాజీవ్ గృహకల్ప, టిటి నగర్, మైత్రి నగర్,60 గజాలు, సూరారం గ్రామంలలో అలాగే సంతోష్ నగర్, దయానంద్ నగర్, సూరారం మార్కెట్, సుందర్ నగర్, సూరారం కాలనీ, లలో అలాగే ఆర్‌జికె బ్లాక్స్, తులసాయి కన్‌స్ట్రక్షన్స్, గ్రీన్ హిల్స్ కాలనీలలో అలాగే 60 గజాలు, రాజీవ్ గృహకల్ప బ్లాక్సులలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డిపి పల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

ప్రభుత్వభూమి కబ్జాను అరికట్టకపోవడం దారుణం

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రభుత్వ భూములని తెలిసిన కూడా కబ్జాను అరికట్టకపోవడం, అధికారులకు చీమకుట్టినట్లైనా లేకపోవడం దారుణమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్ వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జగద్గిరిగుట్ట సీపీఐ కార్యాలయంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కుత్బుల్లాపూర్ మండల రెవిన్యూ పరిధి గాజులరామారం సర్కిల్, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి రాజీవ్ గృహకల్ప షాపింగ్ కాంప్లెక్స్ కోసం ప్రస్తుతం రేషన్ షాప్ వద్ద స్థలం కేటాయిస్తే... అది నేడు అధికారులకు తెలిసి కూడా కబ్జా చేస్తుంటే కబ్జాను అరికట్టకుండా పైకి కబ్జాదారులకు పట్టా ఉంది కాబట్టి.. కట్టుకుంటున్నారని సమాధానం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు అది వాస్తవంగా ప్రభుత్వస్థలమే కాని సదరు కబ్జాదారులు జిఓ.58 ప్రకారం వారికి 348/1 సర్వే నంబర్లో వారికి పట్టా ఉందని కాబట్టి వాళ్లు కట్టుకుంటున్నారని అనడం కబ్జాలను నివారించకుండా కబ్జాదారులకు పరోక్షంగా మద్దతు ఇవ్వడమేనన్నారు. అలా అంటే పట్టాలు ఉండి స్థలం లేని ప్రజలు చాలామంది ఉన్నారని తెలిపారు. వాళ్ళు కూడా అలాగే కబ్జాచేసుకుంటే ఊరుకుంటారా అని సవాల్ విసిరారు. అసలు ముందుగా అక్కడ ఒక రూమ్ మాత్రమే ఉందని నేడు మొత్తం స్థలం మాదే అంటూ కబ్జాకు పాల్పడుతున్నారని.. ఇదే స్థలం పై గత నెలలో మండల ఆర్ఐ (రెవిన్యూ ఇన్‌స్పెక్టర్) ఆ స్థలంలో నిర్మాణాలను అడ్డుకొని, మళ్ళీ నేడు అడ్డుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తుందని ఆరోపించారు. కనీసం ఆ పట్టా నిజమైనదా కాదా అనేది కూడా తెలుసుకోకుండా కబ్జాదారులకు సహకరిస్తున్నారని పై పెచ్చు మునిసిపల్ జీహెచ్ఎంసీ అధికారులు పర్మిషన్ ఇచ్చారని అనడం అందరు అధికారులు కబ్జాలకు ప్రోత్సాహిస్తుందనే అభిప్రాయం ప్రజలో వ్యక్తమవుతుందన్నారు. ఆ అభిప్రాయం పోవాలంటే ముందుగా ఆ పట్టా అసలుదా కాదా! అనేది తేల్చేంతవరకు కట్టడాన్ని ఆపి వెయ్యాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే ప్రజావాణిలో కలెక్టరకు, హైడ్రా కమిషనర్‌కు పిర్యాదు చేస్తామని అక్కడ ప్రజలకు ఉపయోగపడేవిదంగా ఉండేలా ఏర్పాటు కావడానికి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- దేశ ప్రజలకు అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలి
- మతోన్మాదుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి.సత్యం, సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్, కీలుకానీ లక్ష్మణ్ డిమాండ్
- సీపీఐ, సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై తక్షణమే ఆయనను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ, సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అమిత్ షా ఖబడ్దార్ భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, మతోన్మాదం నశించాలి అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అధ్యక్షత వహించగా.. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి.సత్యం, సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఉమా మహేష్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై అమిత్ షా అహంకారపూరితమైన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ.. రాజీనామా చేసి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు కేవలం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పైన చేసినవి మాత్రమే కాదని, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్న లక్షలాది మంది అణగారిన వ్యక్తులకు జరిగిన అవమాన మన్నారు. తక్షణమే అతన్ని మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా భారత ప్రజల నుంచి పెరుగుతున్న ప్రతిఘటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హిందుత్వ శక్తులచే నిరంతరం దాడికి గురవుతున్న భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవలసిన బాధ్యత ఈ దేశ పౌరులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు రావుల స్వాతి, ఈ.దేవదానం, డి.కరుణాకర్, కే.శీను, తిమ్మప్ప, భాష సీపీఐ మండల నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

బాలానగర్ : పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ను కేంద్ర మంత్రి పదవి నుంచి భర్తఫ్ చేయాలని సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల పరిధిలోని శ్రీశ్రీ నగర్ మెయిన్ రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్, సీపీఐ కూకట్ పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ, సీపీఐ(ఎం) కూకట్‌పల్లి కార్యదర్శి ఎం. శంకర్ లు పూలా మాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీడిత వర్గాల ప్రజలకోసం తన జీవితాన్ని త్యాగం చేసిన అంబేద్కర్‌ను తను రాసిన రాజ్యాంగ విలువలతో కేంద్ర మంత్రి పదవి అనుభవిస్తూనే అదే పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను హేళన చేయడమంటే రాజ్యాంగ విలువలను పాటించకుండా అవహేళన చేయడం దారుణమని తెలిపారు. సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్న లక్షలాది మంది అణగారిన వ్యక్తులకు జరిగిన అవమానమన్నారు. అమిత్ షా, బీజేపీ పార్టీ వారి ఆలోచనలు మతతత్వంతో ఉన్నాయని, రాజ్యాంగం పట్ల నిజమైన గౌరవం లేదని ఇది మరోసారి రుజువయిందన్నారు. మంత్రి బ్రాహ్మణ ఆధిపత్య భావజాల అవశేషాలను సతీ సహగమనం లాంటి భావజాలాన్ని బలపర్చడమే బీజేపీ విధానమా? అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని తీసేసి ఆ స్థానంలో బ్రాహ్మణ ఆధిపత్య బావజాలమైన మను వాదాన్ని తీసుకురావాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు చూస్తున్నాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు మనోచారి, పి.శంకర్, నర్సింహా, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



దుండిగల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ(ఎం) బాచుపల్లి మండల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ బాచుపల్లి మండలం, మెయిన్ రోడ్ ప్రగతి నగర్ కమాన్ వద్ద సోమవారం సీపీఐ(ఎం) పార్టీ బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బి.వెంకటరామయ్య, మండల నాయకులు ఎం చంద్రశేఖర్, బాలవెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అమిత్ షా అహంకారపూరిత, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 75 ఏండ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దేశానికి మనువాద మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో దళిత, గిరిజన, మహిళలపై దుర్మార్గమైన దాడులు, అవమానాలు జరుగుతున్నా ఏమాత్రం మాట్లాడని ప్రధాని మోడీ అమిత్ షాను వెనుకేసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ తరహా ధోరణులు పెత్తం దారీ పోకడలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాజ్యాంగ బద్ధంగా లభించిన కేంద్ర హోంశాఖ మంత్రి పదవి నుంచి అమిత్ షా తప్పుకోవాలని దేశంలోని వామపక్ష పార్టీలు ,ప్రజాస్వామ్య వాదులు, మేధావులు, దళిత, గిరిజన, ప్రజా సంఘాలు యావత్ భారత ప్రజానీకం డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యకర్తలు జామీల్ సుధాకర్, మహేశ్వర్, అఫ్రోజ్, చారి, సల్వార్ బాబా,పద్మ, అఖ్లక్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

ప్రత్యేక ఆకర్షణగా సైన్స్ ఎగ్జిబిషన్



నవతెలంగాణ-ముషీరాబాద్

అడిక్ మెట్ డివిజన్ లోని దీక్ష గ్లోబల్ స్కూల్‌లో జ్ఞాన ప్రయోగం జరిగింది. ఈ సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఎగ్జిబిషన్‌ను పాఠశాల డైరెక్టర్ బండారు గోవిందరావు, ప్రిన్సిపాల్ కవిత తదితరులు ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల సృజనాత్మకమైనటువంటి ప్రతిభ ప్రదర్శించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు నమూనా ఆవిష్కరణలు కొత్త ఆలోచనలకు ప్రేరణ ఇచ్చే విధంగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని డాక్టర్ రూబిక ప్రియదర్శిని అన్నారు. సోమవారం అబిడ్స్‌లోని హైవాన్ మినిస్ట్రీ బ్రదర్ బెనర్ జాన్సన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్ ఏ వినోద్ కుమార్, రీచ్ ల సుభాషిని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సివిల్ సర్వీసెస్ సాధించటం ఎలా' అనే అంశంపై సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

'మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్ సాధించటం ఎలా-యూపీఎస్సీ మాస్టర్ క్లాస్' అనే అంశంపై మెహిదీపట్నంలోని జి. పుల్ల రెడ్డి డిగ్రీ కళాశాలలో వింగ్స్ మీడియా అండ్ జీ5 మీడియా గ్రూప్ ద్వారా హైదరాబాద్‌లోని 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో సెమినార్‌ను నిర్వహించారు. 21వ సెంచరీ అకాడమీ చీఫ్ మెంటర్ డాక్టర్ భవానీ శంకర్ విద్యార్థులకు సివిల్ సర్వీస్ పరీక్ష విధానాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సివిల్ సర్వీసులో విజయం సాధించడం ద్వారా సమాజంలో గౌరవనీయమైన జీవితాన్ని గడపొచ్చునన్నారు. యూపీఎస్సీ పరీక్షలో తరచుగా అడిగే ప్రశ్నలను విశ్లేషించారు. ఈ పరీక్షకు భయపడాల్సిన అవసరం లేదని, ఎక్కువ ప్రశ్నలు ప్రాథమిక విద్యా స్థాయిలో నేర్పిన కాన్సెప్ట్‌లపై ఆధారపడివుంటాయని స్పష్టం చేశారు. పరీక్ష కఠినత గురించి ఉన్న అపోహలను తొలగించి, కనీసం 35 శాతం మార్కులతో ఏదైనా స్ట్రీమ్‌లో గ్రాడ్యుయేట్ అయినవారు అర్హులని వివరించారు. జి.పుల్లారెడ్డి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మురళి కృష్ణ, పాల్గొన్నవారిని స్వాగతించి సివిల్ సర్వీసుల ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వెంకయ్య, ఇతర అధ్యాపకులు, వింగ్స్ మీడియా అండ్ జీ 5 మీడియా గ్రూప్ డైరెక్టర్లు గిరి ప్రకాశ్, శ్రీ గణేశ్ హాజరయ్యారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- ఈ పోకడలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం..
- మతం పేరుతో దేశ నిర్మాతలను అవమానించడం సిగ్గుచేటు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్
- శాలిబండ చౌరస్తా నుంచి చార్మినార్ వరకు నిరసన ప్రదర్శన





నవతెలంగాణ-ధూల్‌పేట్ చంపాపేట

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపరచిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్ డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ వామపక్ష పార్టీల దేశవ్యాప్త నిరసనలో భాగంగా సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలిబండ చౌరస్తా నుంచి చార్మినార్ వరకు నిరసన ప్రదర్శన, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా అహంకారంతో అంబేద్కర్‌ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి కేంద్ర మంత్రి పదవి అనుభవిస్తున్న విషయాన్ని మర్చిపోయి దుర్మార్గమైన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. 75 ఏండ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దేశానికి మనువాద, మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందన్నారు. రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. భారతదేశంలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, పేదవారిపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. అంబేద్కర్‌ను అవమానిస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. పార్లమెంట్ సాక్షిగా మాట్లాడిన, దేశం మొత్తం వ్యతిరేకిస్తున్న కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి మోడీ నేటికీ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని వాఖ్యాలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే కేంద్ర హెూంశాఖ మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు విట్టల్, కోటయ్య, మీనా, శ్రావణ్, జిల్లా నాయకులు సత్తార్, కిషన్, శశికళ, కృష్ణ, లతీఫ్, బాబర్ ఖాన్, జంగయ్య, రామ్ కుమార్, యాకూబ్, గులాం నసీర్, అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- సీపీఐ(ఎం) పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్



నవతెలంగాణ-అంబర్‌పేట

పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను భర్తను చేయాలని సీపీఐ(ఎం) అంబర్‌పేట నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో శ్రీరమణ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం దగ్గర ఫ్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మహేందర్ మాట్లాడుతూ దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న కేంద్ర హెూంమంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని అవహేళన చేస్తూ చులకన భావంతో పార్లమెంట్ సాక్షిగా అవమాన పరచడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తుందని వెంటనే భారతదేశ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. హెూం మంత్రి అమిత్ షా ను బర్తరఫ్ చేసి పార్టీ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో అట్టడుగు ప్రజానీకానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు రోల్డ్ మోడల్‌గా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారి హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసి వెనుకబడిన కులాల నిమ్నజాతి వారికి రాజ్యాంగంలో హక్కులు కల్పించి రిజర్వేషన్లు కల్పించిన వ్యక్తి.. అదే రిజర్వేషన్‌తో ప్రధానమంత్రి పదవిలో కూర్చున్న బీసీ అని చెప్పుకునే మోడీ మౌనంగా ఉండటానికి తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు. ఇప్పటికైనా మోడీ, అమిత్ షా పై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు జి.రాములు, బి.సుబ్బారావు, షబానా, వరలక్ష్మి, సోమయ్య, నాయకులు శ్రీనివాస్, సతీష్, జగన్ తదితరులున్నారు.

ఆర్పీలను మెప్మా ఉద్యోగులుగా గుర్తించాలి

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎల్.రూప్ సింగ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆర్పీలను మెప్మా ఉద్యోగులుగా గుర్తించాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎల్ రూప్ సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (ఆర్పీ) రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)ల మహాధర్నా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మానుకోట సునీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ ధర్నాలో ముఖ్య అతిథిగా హాజరైన కార్మికనేత యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎల్. రూప్ సింగ్ మాట్లాడుతూ మహిళ సంఘాలను నిర్మించి, వారిలో పొదుపు అలవాటును నేర్పించి, స్త్రీనిధి, బ్యాంకు రుణాలను ఇప్పిస్తూ, తిరిగి వాటిని సక్రమంగా 100 శాతం రికవరీ చేయిస్తూ, వారి అభివృద్ధికి పాటు పడటంతోపాటు ప్రభుత్వ పథకాలను నిజమైన లబ్దిదారులకు చేరవేయడంలోను వాటికి తగిన ప్రచారం చేయడంలోనూ ఆర్పీలు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వాలు నిర్వహించే ప్రతి కార్యక్రమాలను మహిళ సంఘ సభ్యులందరిని పెద్ద ఎత్తున సమీకరించడములో ఆర్పీలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి అవసరమైన అన్ని రకాల సర్వేలను నిర్వహించి సమగ్రమైన వాస్తవ సమాచారాన్ని అందించడములో నిబద్ధతతో ఆర్పీలు స్వంత ఖర్చులతో పనిచేస్తున్నారని తెలిపారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని స్తంబింపచేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో బీఆర్‌యు రాష్ట్ర అధ్యక్షులు జి. రాంబాబు యాదవ్, ప్రధానకార్యదర్శి వేముల మారయ్య, కనీస వేతనాల మండలి మాజీ చైర్మెన్ పి.నారాయణ, వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారిపెల్లి మాధవి, ఆర్పీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.స్వర్ణలత, ప్రధాన కార్యదర్శి కె. శ్రీమతి, యాదలక్ష్మి, ఎస్కే. జహెూరా, ఎ.అనురాధ, పి. మంగాదేవి, బి.హనమ్మ డి.సునిత, వి.జ్యోతి, డి.ఉష, యస్. అరుణ, ఎల్. ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు'



- ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సి.హెచ్.రంగయ్య

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు సమాజంలో పెద్ద ఎత్తున వస్తూ వ్యవస్థను తీవ్రమైన ఇబ్బందులకు, నష్టానికి గురి చేస్తున్నాయని వాటిని నియంత్రించే చర్యలు వెంటనే చేపట్టాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సి.హెచ్.రంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్య కార్యదర్శి గుగులోతు రవికి సమస్యను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిల్ ప్రచురితం చేస్తున్న 'ఎన్విరాన్మెంట్ యాక్టివిస్ట్' మాసపత్రిక సంచికను అందజేశారు. అనంతరం రంగయ్య మాట్లాడుతూ ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో స్థానికంగా నిర్వహించే వారాంతపు సంతల్లో ఈ ప్లాస్టిక్ వినియోగం భయపెడుతోందని, అంతేగాక అనేక మంది చిరు వ్యాపారులు పెద్ద స్థాయిలో వీటి వాడకాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. సరైన నిర్వహణ లేక గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కొండల్లా పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని, పలు చోట్ల దహనం జరుగుతున్న వైనం తమ సంస్థ గుర్తించిందన్నారు. వెంటనే ప్లాస్టిక్ పై చర్యలు చేపట్టకపోతే అనేక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉందని హెచ్చరించారు. సమస్యను వివరించడంతో సానుకూలంగా స్పందించిన పొల్యూషన్ బోర్డు కార్యదర్శి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై త్వరలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

బలహీన వర్గాలకు మేలు చేసే విషయంలో రాజీ పడేది లేదు

- బీసీ సహకార ఆర్థిక సంస్థ చైర్మెన్ శ్రీకాంత్ గౌడ్



నవతెలంగాణ-మెహిదీపట్నం

బలహీన వర్గాలకు మేలు చేసే విషయంలో రాజీ పడకుండా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తానని తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్ స్పష్టం చేశారు. మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో జరిగిన తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ బోర్డ్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీల సంక్షేమం నిమిత్తం ఏర్పాటు చేసిన బడ్జెట్ చేపట్టబోయే పథకాలపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చించి వాటి వివరాలను బోర్డుకు సమర్పించడం జరిగిందన్నారు. బీసీ కార్పోరేషన్ ద్వారా యువతకు, నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించే విధంగా పథకాలు తయారు చేయాలని, అందుకు సభ్యులు తగిన సలహాలు ఇవ్వాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశలో వెనుకబడిన తరగతుల కమిషనర్ శ్రీమతి బాల మాయాదేవి ఐఏఎస్, బోర్డు సభ్యులు, డా.మల్లయ్య బట్టు, తెలంగాణ బీసీ సహకార ఆర్థిక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.చంద్రకళ ఇతర అధికారులు పాల్గొన్నారు.

'నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశికి టీటీడీ విస్తృత ఏర్పాట్లు'

- టీటీడీ ఏఈఓ రమేష్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

హిమాయత్ నగర్‌లోని బాలాజీ భవన్, తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ) శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఏఈఓ రమేష్ తెలిపారు. సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ డీఈఓ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసప్రభులతో కలిసి ఏఈఓ రమేష్ మాట్లాడుతూ నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి రోజున ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు దేవాలయంకు రావడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది కూడా వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున విస్తృతమైన ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేస్తున్నామని చెప్పారు. నూతన సంవత్సరం 2025 జనవరి 1వ తేదీ తెల్లవారు ఝామున 4 గంటలకు దేవాలయంలో శ్రీవారికి తిరుప్పలిడ్చి, తిరుప్పావై సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు భక్తులు శ్రీవారి దర్శనం, 7 గంటల నుంచి 8 వరకు ఉత్తరాషాడ అభిషేకం (ఏకాంత సేవ), మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గం. వరకు సర్వదర్శనం, రాత్రికి శుద్ధి, ఏకాంత సేవ కొనసాగుతాయని వివరించారు. 10న వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారం ద్వారా శ్రీవారి దర్శనం, 11న అలాగే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని 10వ తేదీ తెల్లవారు ఝామున 12.05 నుంచి స్వామివారికి తిరుప్పవైలిడ్చి (ఏకాంతం), అనంతరం తిరుప్పవై సేవ, అభిషేకం, శుద్ధి, అలంకారం, తోమాల సేవలు జరుగుతాయని, శ్రీవారి సర్వదర్శనం ఉత్తర ద్వారం దర్శనం, రాత్రికి శుద్ధి, ఏకాంత సేవ జరుగుతాయని వారు తెలిపారు. భక్తుల కోసం దాతల నుంచి బాదం పాలు, మంచి నీరు, అన్నప్రసాద వితరణ జరుగుతుందని, పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని, తమ వాలంటీర్లు, శ్రీవారి సేవకులు, ఉద్యోగులు సేవలు అందిస్తారని, భక్తులు పూర్తిగా సహకరించి శ్రీవారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఉద్యోగులు హరికృష్ణ, మణికంఠ, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

డాటా సైన్స్ శిక్షణతో ఉత్తమ అవకాశాలు..



- వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా

నవతెలంగాణ-ధూల్‌పేట్

విద్యార్థులకు డాటా సైన్స్ శిక్షణతో భవిష్యత్తులో ఉత్తమ అవకాశాలు పొందవచ్చని, అలాంటి శిక్షణకు తమ కాలేజీ విద్యార్థులు ఎంపిక కావటం సంతోషంగా ఉందని సిటీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన ధృవ పత్రాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ అనే ఎన్‌జీవో సంస్థ, టెక్స్ అకాడెమీ సహకారంతో సిటీ కాలేజీ విద్యార్థులకు డాటా సైన్స్ ఉచిత శిక్షణ అందించటానికి ముందుకు రావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రెండు వడపోతల తరువాత శిక్షణకు ఎంపికైన 28 మంది విద్యార్థులకు కాలేజీలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ధృవపత్రాలను అందించారు. తమ విద్యార్థులు మూడు నెలల శిక్షణ అనంతరం వివిధ ఐటి సంస్థలలో డాటా సైన్స్ సంబంధిత ఉద్యోగాలకు అర్హులవుతారన్నారు. రాబోయే రోజులలో మరికొంతమంది విద్యార్థులను ఈ తరహా శిక్షణకు ఎంపికయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కంప్యూటర్ సైన్స్ విభాగాధ్యక్షులు డాక్టర్. నాగేశ్వర్ తెలిపారు. సిటీ కాలేజీ విద్యార్థుల కోసం గత ఏడాది కాలంగా తాము నిర్వహిస్తున్న కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తున్నదన్నారు ఎన్‌జీవో ప్రతినిధులు సుమని, భరత్ మేరుగు. గతంలో తమ సంస్థ తరపున కాలేజీ విద్యార్థులకు నగదు, పుస్తకాల రూపంలో స్కాలర్ షిప్పులు అందించామన్నారు. ఈ ఏడాది టెక్స్ అకాడెమీ తో కలసి ఐటి సంబంధిత సాంకేతిక శిక్షణ ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రవణ్, అవంతి, బబిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

శబరిమల నీలకల్ మార్గమధ్యంలో జనవరి 7 నుంచి 14 వరకు అన్నదానం

- అన్నదాత బ్రోచర్ ఆవిష్కరణ ..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో జనవరి 7 నుంచి 14వ తేదీ వరకు శబరిమలలోని నీలకల్ మార్గమధ్యంలో శబరికి వెళ్లే భక్తులు మాలాదారణ ధరించిన అయ్యప్ప స్వాములకు, ప్రతిరోజు వేలాది మందికి అల్పాహారం, అన్నదానం మంచినీరు, పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రాకేష్, కోశాధికారి సిపి అనిల్ నాయర్‌లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉస్మాన్ గంజ్‌లోని బాస్ ప్రధాన కార్యాలయంలో శబరిమలలో నిర్వహించే అన్నదాన, అల్పాహార కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరణను అయ్యప్ప భక్తులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాతం రాధాకృష్ణ మాట్లాడుతూ. గత 16 సంవత్సరాలుగా నిరంతరం శబరిలోని నీలకల్లో ప్రతిరోజు వేలాది మంది అయ్యప్ప భక్తులకు, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విజయవంతంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ బృహత్తర అన్నదాన కార్యక్రమానికి, ఎవరైనా దాతలు సహాయ సహకారాలు అందించేవారు www.helpaneedy. in వెబ్‌సైట్‌లో తాము అందించే సహకారాన్ని అందించాలని రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాస్ ప్రతినిధులు విజయ భాస్కర్, కాటేపల్లి రాజేశ్వరావు, విజయేందర్ రెడ్డి, రోహిత్, జగదీష్, కళ్యాణ్, శ్రీహరి, కృష్ణ, అశోక్, ఎం.శ్రీనివాస్, వేణు, అయ్యప్ప భక్తులు, స్వాములు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి శిక్షణలో రాణించాలి



- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళలు స్వయం ఉపాధి శిక్షణలో రాణించాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. గాంధీనగర్ డివిజన్‌లోని మహిళల స్వయం ఉపాధి సహాయక చర్యల్లో భాగంగా లిలయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ తమ 'నీవి చారిటబుల్ ట్రస్టు' సంయుక్తంగా ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణా శిబిరాన్ని సోమవారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి శిక్షణలో రాణించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. పేద మహిళల కొరకు వారి స్వయం ఉపాధి, ఆర్థిక బలోపేతానికి సహకరిస్తూ డివిజన్‌లోని వివిగిరి నగర్, చిక్కడ పల్లి మహిళా భవన్‌లలో పలు శిక్షణ తరగతులను ఏర్పాటు చేశామని, అందులో భాగంగా మహిళలకు ప్రాధాన్యత ఇచ్చే కుట్టు, మగ్గం వర్క్‌లపై కొనసాగుతున్న శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, వారికి కల్పిస్తున్న వసతులు, శిక్షణ తరగతులపై వివరాలను టీచర్ లతతో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ఈఎన్‌టీ ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలి

ఓపి, ఫార్మసీ కౌంటర్లు పెంచాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ధర్నా..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రభుత్వ ఈఎన్‌టీ (చెవి, గొంతు, ముక్కు) ఆస్పత్రిలో సమస్యల పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో సోమవారం కోఠిలోని ప్రభుత్వ ఈ ఎన్‌టీ ఆస్పత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్.ప్రదీప్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు డి. స్వరూపలు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రతిష్టాత్మకమైన ఆస్పత్రి ఈఎన్‌టీ అన్నారు. వైద్యం అద్భుతంగా అందుతుందని ప్రజలు వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి వస్తారని తెలిపారు. కానీ ఇక్కడ రోగుల సంఖ్య కనుగుణంగా ఓపి కౌంటర్లు లేకపోవడంతో భారీ క్యూ లైన్లతో ఉంటున్నాయన్నారు. ఓపి, డాక్టర్, మందుల కోసం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 8.30 నుండి 11.30 వరకే ఓపి ఉండడంతో తెల్లవారుజామునే పేషెంట్లు ఆస్పత్రికి వచ్చి, ఆరు బయట చలిలో పడుకుంటున్నారని మందులు కూడా పూర్తిస్థాయిలో లేవన్నారు. ఖరీదైన మందులన్నీ బయట కొనుగోలు చేసుకోవాల్సిస్తుందన్నారు. రోజు సుమారు 15-18 వందల మంది రోగులు రావడంతో పరిసరాల పరిశుభ్రత, మంచినీటి సౌకర్యం కూడా సరిగా లేదని అన్నారు. పేషంట్ల సంఖ్య కనుగుణంగా డాక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని, ఫార్మసీలో నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని కూడా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ పని చేసే 60 మంది సిబ్బందికి కనీస వేతనం రూ. 11 వేలు మాత్రమే చెల్లించడం బాధాకరమన్నారు. వారి జీతాలు పెంచాలన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఆస్పత్రిలో ఉన్న సమస్యలన్నిటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని సూపరిండెంట్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీబాయి, వరలక్ష్మి, పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి బిఎస్ కృష్ణ, నాయకులు కిరణ్, భీమేష్, బంగారి శ్రీనివాస్, రాజు, వంకాయల సురేష్, సాయి, జాని, విశాలి తదితరులు పాల్గొన్నారు.

'లోపాయికారి ఒప్పందాలతో ప్రజాధనం లూటీ'

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

లోపాయికారి ఒప్పందాలతో ప్రజాధనం లూటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ ఈడీని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లోని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు టోల్ లీజును ఐఆర్బీ సంస్థకు ఇవ్వడం, వరంగల్, రంగారెడ్డి కైటెక్స్ యూనిట్ల స్థాపనలో అక్రమాలు జరిగాయన్నారు. క్విడ్ ప్రోకో పద్ధతిలో ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీలు టెండర్ లేదా లీజు అగ్రిమెంట్ అయిన వెంటనే బీఆర్‌ఎస్ పార్టీకి ఇచ్చాయని, ఆ వెంటనే బీఆర్‌ఎస్ ఆ బాండ్లను ఎన్ క్యాష్మెంటు చేసుకుందని ఆరోపించారు. అప్పటి పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు ఈ క్విడ్ ప్రోకో తతంగంతో నేరుగా ఒప్పందం ఉందన్నారు. క్విడ్ ప్రోకో చేయడం వల్లనే జాతీయ పార్టీ బీజేపీ తర్వాత అత్యధికంగా ఎలక్టోరల్ బాండ్లు బీఆర్‌ఎస్ పార్టీకే వచ్చాయన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలను గోల్ మాల్ చేసిన కేసీఆర్, కేటీఆర్ లను అరెస్ట్ చేసి విచారిస్తే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అధ్యక్షులు గాలిగల్ల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

జోనల్ కమిషనర్‌తో కార్పొరేటర్ సమావేశం



నవతెలంగాణ-ఓయూ

సీతాఫల్ మండి కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ సోమవారం జోనల్ కమిషనర్ రవి కిరణ్‌తో సమావేశమయ్యారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని, నూతన పనులను త్వరగా మంజూరయ్యేలా చూడాలని జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్టు ఆమె తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరగా వాటికి ఆయన సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



నవతెలంగాణ-బంజారా హిల్స్

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసీ అధికారులను కోరుతూ జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో చర్చలు జరిపారు. అదేవిధంగా గ్యాస్ జైల్ సింగ్ లో రూ. 18 లక్షలతో కూడిన నూతన సీసీ రోడ్లు త్వరగా వెయ్యాలని వినతి పత్రాలను అందజేశారు. అంతేకాకుండా ప్రారంభ దశలో ఆగిన ఇతర రోడ్లను సైతం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమీషనర్ త్వరలోనే పనులను ప్రారంభి స్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు

- మద్యం సేవించి రోడ్లపై తిరిగితే కేసులు
- పబ్బులు, బార్లలో ముమ్మర తనిఖీలు
- 3 కమిషనరేట్ల పరిధిలో కఠిన నిబంధనలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. మద్యం సేవించి రోడ్లపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్లపైకి వచ్చి న్యూసెన్స్ చేయొద్దంటూ మందుబాబులకు వార్నింగ్ ఇచ్చారు పోలీసులు. హైదరాబాద్ లోని మూడు కమిషనరేట్ల పరిధిలో పోలీసులు ఆం క్షలు విధించారు. మరోవైపు డ్రగ్స్ వినియోగించకుండా ఫోకస్ పెట్టారు పోలీసులు.. పలు పబ్బులలో బార్లలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్, ఎక్సైజ్, మాదాపూర్ పోలీసులు పలు బార్లలో తనిఖీలు నిర్వహించారు. మూడు కమిషనరేట్ల పరిధిలో కఠినమైన నిబంధనలు ఉంటాయని తెలిపారు... పబ్బులు , బార్లలో ఈవెంట్లకు సంబంధించి అనుమతి ఉన్న వారితో మాత్రమే న్యూఇయర్ వేడుకలు నిర్వహించాలని పోలీసులు తేల్చి చెప్పారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారుగా 34 పబ్ లు ఉన్నాయి. అందులో 4పబ్ లకు ఈసారి నూ తన సంవ త్సర వేడుకల నిర్వహణకు అనుమతి నిరాకరించారు పోలీసులు.

ప్రజావాణికి 1630 దరఖాస్తులు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 1630 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. సదరు అర్జీలను సత్వరమే పరిష్కారం



చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1630 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 1571, పెన్షన్ 27, ఇతర శాఖలకు సంబంధించినవి 32 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పి. ముకుంద రెడ్డి, ఆర్డీవోలు రామకృష్ణ, జిల్లా అధికారులు జి ఆశన్న, ఆర్ రోహిణి, పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్ , శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక 'హాలిడే మార్ట్'ను ప్రారంభించిన సదరన్ ట్రావెల్స్

- 55 ఏండ్లుగా పర్యాటక పరిశ్రమలో అగ్రగామి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సదరన్ ట్రావెల్స్ వార్షిక 'హాలిడే మార్ట్'ను ప్రకటించింది. జనవరి 31, 2025 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. పర్యాటక పరిశ్రమలో గత 55 సంవత్సరాలుగా అగ్రగామిగా నిలిచిన సదరన్ ట్రావెల్స్‌కు 45లక్షల మందికిపైగా కస్టమర్లున్నారు. భారతదేశంతో పాటు అంతర్జాతీయ హాలిడే ప్యాకేజీపై భారీ డిస్కౌంట్స్, ఉచిత హాలిడేస్ ప్యాక్‌లతోపాటు ఆకర్షణీయమైన బహుమతులు, మహా ధమాకా లక్కీడ్రా నిర్వహించి రూ.25లక్షల విలువైన బహుమతులను గెలుచుకునే అవకాశాన్ని కస్టమర్లకు కల్పిస్తున్నారు. ఈ ఆఫర్‌లు డిసెంబర్ 31, 2024 నుంచి 31 జనవరి 2025వరకు ఉండనుంది. హాలిడే ప్యాకేజీలపై భారీ నగదు తగ్గింపులతోపాటు ప్రత్యేక ఆఫర్లను అందిస్తోంది. 2000ల ప్లస్ అంతర్జాతీయ, దేశీయ టూర్ ప్యాకేజీలపై భారీ నగదు తగ్గింపులు అందిస్తోందన్నారు. రూ.60వేల వరకు నగదు తగ్గింపు , గ్రూప్ ఇంటర్నేషనల్ హాలిడే బుకింగ్స్‌పై ఉచిత డొమెస్టిక్ హాలిడేలు అందిస్తోంది.

తీర్థయాత్రలకు పొటెత్తుత్తున్న భక్తులు

తీర్థయాత్రలకు భక్తులు పొటెత్తుతున్నారు. 2025లో భారతదేశంలో అత్యధికంగా మహా కుంభ్ పవిత్ర స్నానం కోసం 40కోట్ల కంటే ఎక్కువ మంది భక్తులు ప్రయాగ్ రాజ్‌కు రావాలని ఆశిస్తుంటారు. సదరన్ ట్రావెల్స్ ప్రయాగ్ రాజ్ ఘాట్ల వద్ద డీలక్స్ అండ్ స్టాండర్డ్ టెంటెడ్ వసతిని ఏర్పాటు చేయడంతో మంచి స్పందన వస్తోంది. సరస్వతీ పుష్కరాలు, ఛార్ధామ్ యాత్రతోపాటు వారణాసి పవిత్ర పుణ్య క్షేత్రానికి లక్షలాది మంది భక్తులు సదరన్ ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్నారు. 14రోజుల యూరోపియన్ ప్యాకేజీలు ఈ సీజన్లో అత్యంత ప్రాచుర్యం పొందాయి. ఐరోపాతోపాటు, సదరన్ ట్రావెల్స్ సింగపూర్, మలేషియా, థాయిలాండ్, దుబాయ్, ఆస్ట్రేలియాతోపాటు ప్రపంచవ్యాప్తంగా టూర్ ప్యాకేజీలను అందిస్తోంది.

రూ.5000లు టోకెన్ అమౌంట్ చెల్లిస్తే చాలు

తమ వార్షిక ఫ్లాష్ సేల్ - హాలిడే మార్ట్ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని సదరన్ ట్రావెల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఏవీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వార్షిక 'హాలిడే మార్ట్'ను ఆ సంస్థ రిజినల్ డైరెక్టర్ కార్తిక్, శ్రీ చరణా మ్యూనికేషన్స్ సీఎండీ బుస్సా శ్రీనివాస్ గుప్తా నేతృత్వంలో ప్రారంభించారు. ఈ సంద్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. హాలిడే మార్ట్ విక్రయ సమయంలో కస్టమర్లు తమకు టూర్ ప్యాకేజీలను తగ్గింపు ధరలతో బుక్‌చేసుకోవచ్చన్నారు. ప్యాకేజీ మొత్తాన్ని చెల్లించాల్సి అవసరం లేదని, కేవలం రూ.5000 టోకెన్ అమౌంట్ చెల్లిస్తే సరిపోతుందన్నారు. లక్కీడ్రాలు సైతం తీస్తామని, అందులు సిగపూర్ టూర్ ప్యాకేజ్‌లు, గోల్డ్ బిస్కెట్, రూ.25లక్షలు విలువైన బహుమతులు గెలుచుకోవచ్చన్నారు.

సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'స్టాప్ రోడ్ యాక్సిడెంట్' క్యాంపెయిన్

- 100 స్కూళ్లను ఎంపిక చేసి నగదు ప్రోత్సాహక బహుమతులు : డాక్టర్ గురవారెడ్డి



నవతెలంగాణ-బేగంపేట్...

సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న 59 లక్షల పాఠశాల విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే రోడ్ సేఫ్టీ మార్గదర్శకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 41 వేల స్కూళ్లను ఎడ్యుకేట్ చేయాలనే సామాజిక సేవా దక్పథంతో "స్టాప్ రోడ్ యాక్సిడెంట్"క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ చైర్మెన్, కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ ఏవి గురవారెడ్డి తెలిపారు. సోమవారం కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వాహనాల సంఖ్యలో ఒక శాతం మాత్రమే భారతదేశంలో ఉంటే, రోడ్డు ప్రమాదాలు మాత్రం 11 శాతం జరుగుతున్నట్టు అంచనా అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధానంగా మూడు రకాల కారణాలని చెప్పారు. మొదటిది రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్, విద్యార్థులకు, డ్రైవర్స్ ఇతరులకు ఎడ్యుకేషన్ మొదలైనవి, రెండోది ఇంజనీరింగ్ స్కిల్స్ రోడ్ల నిర్మాణం, ఎక్కడ మలుపు ఉండాలి ఎంత మేర ఉండాలనే విషయాలు, మూడోది ఎన్ఫోర్స్మెంట్ హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం, ఎమర్జెన్సీ ట్రామా కేర్ గోల్డెన్ అవర్ లో హాస్పిటల్‌కు చేరకపోవడం వంటివి అన్నారు. ఈకారణాలవల్ల మన దేశంలో ప్రతి ఏటా ఐదు లక్షల యాక్సిడెంట్లు జరుగుతుంటే దాదాపు 1.5 లక్షల మంది చనిపోతున్నట్టు అంచనా అన్నారు. మరి కొంతమంది క్షతగాత్రులై జీవితాంతం అంగవైకల్యంతో బాధపడుతున్నారని తెలిపారు.

పేదలకు వైద్య, విద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో 2021 లో డాక్టర్ గురవారెడ్డి నేతత్వంలో సర్వేజనా ఫౌండేషన్ ప్రారంభమైంది. అప్పటినుంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా ఆర్థోపెడిక్ ఆపరేషన్లు, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఆర్థోపెడిక్ డాక్టర్లకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు మొబైల్ ఎక్సరే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించి వైద్య సేవలను ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నారు.

స్టాప్ రోడ్ యాక్సిడెంట్ థీమ్ ను ప్రతి విద్యార్థికి, పాఠశాలకు చేర్చి అవగాహన కల్పించాలని లక్ష్యంతో ఇప్పటికే అన్ని పాఠశాలలకు స్టాప్ రోడ్ యాక్సిడెంట్ పై క్విజ్, ఎక్సె రైటింగ్, డ్రాయింగ్, స్లోగన్, సిగ్నల్స్ తో కూడిన పార్కులో ఏర్పాటు వంటి అంశాలను నిర్వహించాలని సూచించింది. ఉగాది పర్వదినాన 100 ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేసి నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు మెరిట్ సర్టిఫికెట్లను ప్రచారం చేస్తామని డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. జనవరి 11 నుంచి 17వ తేదీ వరకు జరిగే రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా 2025 సంవత్సరానికి ప్రకటించిన నీవే రోడ్ సేఫ్టీ హీరో అనే థీమ్‌ను అందరిలోకి తీసుకువెళ్లడానికి కృషి చేస్తామని తెలిపారు.

శాస్త్రీయ విద్యా పరిరక్షణకు పోరాడుదాం



- నూతన జతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దాం : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి

నవతెలంగాణ-ఓయూ

శాస్త్రీయ విద్యాపరిరక్షణకు పోరాడుదామని, నూతన జతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 55వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఆయన జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఓయూ కార్యదర్శి రవి నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ. ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యల పై రాజీ లేకుండా పోరాటం చేసే ఏకైక సంఘం దేశంలో ఎస్ఎఫ్ఐ మాత్రమే అని అన్నారు .ఈ 55 ఏండ్ల ప్రస్థానంలో ఎందరో ఎస్ఎఫ్ఐ నాయకులు అమరులయ్యారని, వాళ్ల త్యాగాలతో ఎస్ఎఫ్ఐ మరింత ముందుకు వెళుతుందని అన్నారు. విద్యా ప్రయివేటీకరణ, విద్యాకాషాయకరణ, విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా అనునిత్యం ఉద్యమిస్తుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మోడీ నియంతృత్వ పరిపాలనలో ప్రజాస్వామ్య అపహాస్యం అవుతున్నదని, రాజ్యాంగంలోని హక్కులు హరిస్తున్నారన్నారు జమిలీ ఎన్నికలతో తీసుకొచ్చి రాష్ట్రాల హక్కులను హరించేలా పెత్తనం చేస్తున్నదని దుయ్యబట్టారు. నూతన జాతీయ విద్యా విధానం ముసుగులో ఈ దేశంలో విద్యా విధానాన్ని సామ్రాజ్యవాద దేశాలకు వ్యాపారం చేసుకునేలా రెడ్ కార్పెట్ పలుకుతున్నదని, విద్యలో శాస్త్రీయ దృక్పథం లేకుండా తుడిచిపెడుతుందని అన్నారు. అందుకే మోడీ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న కారణంగా ఎస్ఎఫ్ఐ నాయకుల మీద భౌతిక దాడులకు తెగబడుతున్నారని దేశద్రోహ చట్టాలను ప్రయోగిస్తున్నారని అన్నారు. విశ్వ విద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతీస్తున్నారని, పరిశోదక విద్యార్థులకు ఫెలోషిప్ లేకుండా చేశారని అందుకే విద్యారంగాన్ని పరిరక్షణకు రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అందరం కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షులు ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులు కృష్ణ, పవన్ కళ్యాణ్, శ్రీను, మల్బూర్, అజయ్ క్రాంతి విష్ణు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల సంరక్షణకు కృషి : రైల్వే ఎస్పీ చందన దీప్తి

నవతెలంగాణ-ఓయూ



రైల్వే ప్రయాణికుల రక్షణతో పాటు నేరాల నియంత్రణకు జీఆర్పీ పోలీసులు పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రైల్వే ఎస్పీ చందన దీప్తి తెలిపారు. సోమవారం లాలాగూడలోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో జీఆర్పీ యాన్యువల్ సమావేశం నిర్వహించారు. 2024వ, సంవత్సరంలో జీఆర్పీ పరిధిలో జరిగిన క్రైమ్‌లు, రికవరీలు, నేరస్థుల అరెస్టుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా రైల్వే ఎస్పీ మాట్లాడుతూ నేరాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు జీఆర్పీ పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రాపర్టీ నేరాలు, ఎన్ డీపీఎస్ యాక్ట్, మొబైల్ పోన్ల చోరీ, కిడ్నాప్‌లు తదితర నేరాలు జరుగకుండా నిఘా ముమ్మరం చేసినట్టు తెలిపారు. ఇటీవల దేశంలోని అన్ని జీఆర్పీ పోలీసులతో నేషనల్ జీఆర్పీ సమావేశం జరిగిందని చెప్పారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన మరిన్ని జాగ్రత్త చర్యలతో పాటు రైల్వే ప్రయాణికుల రక్షణపై సమీక్ష నిర్వహించినట్టు వివరించారు. రైల్వే ప్రయాణికులకు రక్షణ కల్పించడంతో పాటు నేరాలను అదుపు చేసేందుకు జీఆర్పీ పోలీసులు ఎనలేని కషి చేస్తున్నారని వెల్లడించారు.

హాస్టల్స్ ఓనర్స్ అప్రమత్తంగా ఉండాలి.

- ఎస్సార్ నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథరెడ్డి

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



నూతన సంవత్సరం సందర్భంగా ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాస్టల్ యజమానులు బాధ్యతగా ఉండాలని, సోమవారం సాయంత్రం ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ హాస్టల్స్ యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పని చేయాలని, సెక్యూరిటీ గార్డ్స్ ఉండాలని, హాస్టల్ ముందు లైటింగ్ ఏర్పాట్లు చేయాలని హాస్టల్ లోపల ఉన్న వారి కోసంవచ్చే వారి పేర్లు రిజిస్టర్లో నమోదు చేయాలని తెలిపారు. ఎలాంటి దొంగతనాలు, గొడవలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా హాస్టల్ యజమానులపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే హాస్టల్ లోపల రూములు కూడా తనిఖీ చేస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి నుంచి ఒకటో తారీకు రాత్రి వరకు హాస్టల్ యజమానులు అప్రమత్తంగా ఉండి, పోలీసు వారికి సహకరించి నూతన సంవత్సరం ప్రశాం తంగా ముగిసేలాగా అన్ని విధాల జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు.



జేఎస్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ- సిటీబ్యూరో

వనస్థలిపురంలోని జేఎస్ హాస్పిటల్స్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్, ప్రొఫెసర్ శ్యామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జయంతి మాట్లాడుతూ.. తమహాస్పిటల్ లో ప్రతి నెల 4వ ఆదివారం ప్రజలకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పించి... మందులు కూడా ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. వైద్య పరీక్షలపై 25 శాతం డిస్కౌంట్ కూడా ఇస్తున్నామని తెలిపారు. వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని...దాదాపు 300 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలతో పాటు ఆర్థో, ఓబీఎస్, గైనకాలజీ, జనరల్ ఫిజిషియన్ సేవలు అందించామన్నారు. అనంతరం అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్, ప్రొఫెసర్ శ్యాం మాట్లాడుతూ. కార్పొరేట్ వైద్యం నేడు చాలా ఖరీదుతో కూడుకున్నదని... అలాంటిది జేఎస్ హాస్పిటల్ లో ప్రతి నెలా 4 వ ఆదివారం ఉచితంగా వైద్యం, మందులు అందజేయడం అనేది గొప్ప విషయం అన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జయంతి లను ఆయన శాలువాతో సన్మానించి అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి పేదలను అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు చింతల రవి కుమార్, గణేష్ టెంపుల్ చైర్మెన్ రామ్మోహన్, పలు కాలనీల ప్రతినిధులు ఆనంద్ రాజ్, లగ్గోని శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
12
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

నవతెలంగాణ 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను, బోరబండ ఇన్‌స్పెక్టర్ వీర శేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్ మీరా, సీనియర్ రిపోర్టర్ ప్రసాదరావు, అమీర్‌పేట్ జోన్ ఇన్‌చార్జి రమేష్‌లతో కలిసి సోమవారం బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ నిజాలు- నిర్భయంగా, ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ వార్తలు రాస్తూ, అధికారుల దృష్టికి తీసుకువచ్చే పత్రిక నవతెలంగాణ అని కొనియాడారు.

న్యూఇయర్ వేడుకలు..
నేడు అర్ధరాత్రి వరకు మెట్రో సర్వీసులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లను నడిపిస్తున్నట్టు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 న్యూ ఇయర్ వేడుకుల నేపథ్యంలో ఉదయం 6 నుంచి అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్ల తిరుగుతాయని, చివరి రైలు అర్ధరాత్రి (జనవరి 1న) 12.30 గంటలకు బయలుదేరి చివరి స్టేషన్‌కు 1.15 నిమిషాలకు చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల తర్వాత ప్రతి ఒక్కరూ రవాణా ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా ఇండ్లకు చేరుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎండీ తెలిపారు. మెట్రో రైలు, స్టేషన్లలో సిబ్బంది, పోలీసుల నిఘా ఉంటుందని, ప్రయాణికులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మెట్రో ఎండీ విజ్ఞప్తి చేశారు.

అన్ని వేళలా అండగా ఉంటా..

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

కాలనీల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను అన్ని వేళలా అండగా ఉంటానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన సనత్ నగర్ డివిజన్ లోని ఉదయ్ నగర్ కాలనీ కమిటీ సభ్యులు సోమవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కాలనీలో సమస్యలు ఏమైనా ఉంటే తన దష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన అధ్యక్షుడు విష్ణు వర్మ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి శ్యాం సుందర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సంతోష్ తదితరులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, బీఆర్ఎస్ సనత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి , శాంతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనివ్వాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి
- ప్రజావాణిలో పలు అర్జీలు స్వీకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణికి ప్రజల నుండి వచ్చిన విన్నపాలపై ప్రాధాన్య తనిచ్చి సమస్యల సత్వర పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజల నుంచి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి కమిషనర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర పరిధిలో తనిఖీ చేసి అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీచేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై నివేదిక అందించాలని సూచించారు. అందుకు ప్రత్యేక అడిషనల్ సీసీపీ నియమించి ఆయన పర్యవేక్షణలో సమస్యల పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సీసీపీని ఆదేశించారు. తాను టౌన్ ప్లానింగ్ అర్జీలపై వారం వారం సమీక్షించడం జరుగుతుందని, క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలకు వెనుకాడ వద్దని కమిషనర్ సీసీపీని ఆదేశించారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 3 విన్నపాలు రాగా, సత్వర పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించడం జరిగింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 48 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 29, ట్యాక్స్ విభాగానికి 9, సి.ఇ మెయింటెనెన్స్ 3, ఫైనాన్స్, హెల్త్, ల్యాండ్ అక్విజిషన్ 2 ఫిర్యాదుల చొప్పున, హౌసింగ్, వెటర్నరీ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 82 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 35, సికింద్రాబాద్ జోన్‌లో 18, శేరిలింగంపల్లి జోన్‌లో 9, చార్మినార్ జోన్‌లో 8, ఎల్బీనగర్ జోన్ లో 11, ఖైరతాబాద్ జోన్ లో ఒక విన్నపం అందింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, సుభద్ర దేవి, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక, సరోజ, సత్యనారాయణ, రఘు ప్రసాద్, యాదగిరి రావు, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సి.సి.పి లు గంగాధర్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, వాటర్ వర్క్స్ డి.జి.ఎం. సాయి రమణ, హౌసింగ్ ఈ ఈ పి.వి రమణ, రాజేశ్వర్ రావు, యు.బి.డి డైరెక్టర్ శ్రీనివాస రావు, ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ మూర్తి రాజు, సి.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, డిప్యూటీ సి.ఇ.ఓ పనస రెడ్డి, రెవెన్యూ జె.సి మహేష్ కులకర్ణి, యు.సి.డి జె.సి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

- అధికారులకు జేఏసీ నేతల వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్‌లో ఎన్నికలు నిర్వహించాలని కంటోన్మెంట్ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఎన్నికలు నిర్వహించకుండా నిర్వహించకుండా నామినేటెడ్ సభ్యుడితో పరిపాలన సాగిస్తుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్ని పార్టీల నేతలు ఏకమయ్యారు. జేఏసీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం నాడు ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను, బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుదేశ్వరను, సీఈఓ మధుకర్ నాయక్‌ను కలసి వినతి పత్రం సమర్పించి వెంటనే ఎన్నికలు నిర్వహించే విదంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి 5ఏండ్లకు ఒక్కసారి ఎన్నికలు నిర్వహించాలి కానీ దానికి విరుద్ధంగా 10 ఏండ్లుగా ఎన్నికలు నిర్వహించక పోవడం శోచనీయమన్నారు. ఇది కచ్చితంగా ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి విరుద్ధమని చెప్పారు. 4ఏండ్లుగా బీజేపీకి చెందిన ఒకే వ్యక్తితో పరిపాలన చేస్తున్నారని, అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రకటన చేసి జీహెచ్ఎంసీలో విలీనం చేస్తామని ప్రకటనను వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా విలీనం చేయండి లేదా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అందుకోసం ప్రజా పోరాటం, అవసరమైతే న్యాయస్థానాల ద్వారా పోరాటానికి తాము సిద్ధమని తెలిపారు.

గంగపుత్రుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

గంగపుత్రుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం 'గంగాపుత్ర స్థానిక సంఘం' వార్షిక క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీ.సీ. వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు పాటు పడుతున్నామని తెలిపారు. సంఘం అధ్యక్షులు డాక్టర్ దేశబోయిన రఘు, గౌరవాధ్యక్షులు కైరంకొండ సత్యనారాయణ, సంజీవ్ కుమార్, సంఘం ప్రతినిధులు పూసా రాజ్ కుమార్, యాదగిరి, కిరణ్ కుమార్, శ్యాం ప్రసాద్, విశాల్, నరేశ్, కప్పర బోయిన రఘు, వల్లాల సుధాకర్, సదానంద్, కంటే సంపత్ , వివేకానంద్, సునీల్ కుమార్, నేతలు కంది నారాయణ, కైరంకొండ యాదగిరి పాల్గొన్నారు.



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

నవతెలంగాణ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం మధురా నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ, సబ్ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ గౌడ్, నవతెలంగాణ సీనియర్ రిపోర్టర్ ప్రసాదరావు, అమీర్‌పేట జోన్ ఇన్‌చార్జి రమేష్ గోవర్ధన రెడ్డిలతో కలిసి మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ నవతెలంగాణ పత్రికలో క్రమశిక్షణతో కూడిన రిపోర్టర్ల బృందం ఉందని, కుల మతాలకు, రాజకీయ నాయకులకు అతీతంగా, ఉన్నది ఉన్నట్టు, వాస్తవాలు రాసే పత్రిక నవ తెలంగాణ అని అన్నారు.

సామాజిక దృక్పథంతో

ఉపాధికి పెద్దపీట

వెస్లీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల డైరెక్టర్ డా.బి.విమల్ సుకుమార్

వెస్లీ విద్యా విధానం

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

వెస్లీ విద్యా సంస్థలు సామాజిక దృక్పథంతో విద్యార్థుల ఉపాధి కల్పన కోసం పెద్దపీట వేస్తున్నట్టు సీఎస్ఐ మెదక్ డైయాసిస్ ట్రెజరర్, వెస్లీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల డైరెక్టర్ డా.బి.విమల్ సుకుమార్ అన్నారు. సోమవారం వెస్లీ కళాశాలలో వెస్లీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.ఎం.యోహాన్ , నవతెలంగాణ సీనియర్ పాత్రికేయులు తలారి శ్రీనివాసరావుతో కలిసి 2025 క్యాలెండర్, ఆఫీస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అనేక సంవత్సరాలుగా ఉన్నత విద్యా వికాసానికి తోడ్పాటునిస్తున్నట్టు చెప్పారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగానే నూతన కోర్సులు ప్రవేశ పెట్టి, ఇక్కడ విద్యను అభ్యశించిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పన, క్రమశిక్షణతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. పత్రికలు విద్యా వికాసానికి చేయూత ఇవ్వాలని సూచించారు. నాటి ప్రజాశక్తి నుంచి నేటి నవ తెలంగాణ వరకు అందిస్తున్న సేవాలు ప్రశంసించారు. నవతెలంగాణ కుటుంబ సభ్యులకు క్రిస్మస్, నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వెస్లీ ఉద్యోగులు యశ్వంత్ కుమార్, డా.వి.ఆర్.కె.రాజు,డా. ఎన్.కేశవ రెడ్డి ,పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధి పనులపై చర్చ

- కంటోన్మెంట్ బోర్డు సమావేశం..
- ఎమ్మెల్యే శ్రీ గణేష్, నామినేటెడ్ సభ్యులు రామకృష్ణల వాదోపవాదనలు..



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్‌లో కారిడార్ విస్తరణ పనులు, మంచినీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, ప్రజా సంక్షేమ అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన భవిష్యత్ కార్యక్రమాలపై అధికారులు చర్చించారు సోమవారం బోర్డు కార్యాలయంలో కంటోన్మెంట్ బోర్డు సమావేశం నిర్వహించారు. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నుంచి నుందునేశ్వర్ అధ్యక్షతన కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్ సమక్షంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ నామినేటెడ్ సభ్యుడు. రామకృష్ణ తదితరులు అధికారులు ఈ సమావేశం లో పాల్గొన్నారు. జూబ్లీ బస్టాండ్ నుంచి శామీర్‌పేట్ వరకు ప్యాట్నీ నుంచి మేడ్చల్ వరకు కొనసాగే క్యారిడార్ గురించి.. ఏ విధంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి ఏ విధంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్న విషయంపై చర్చించారు. ఈ విషయంలో బోర్డు నామినేటెడ్ సభ్యుడు 200 ఫీట్ల విస్తరణ కాకుండా దాన్ని కుదించాలని డిమాండ్ చేశారు. ఇందుకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ స్పందించి యధావిధి కొనసాగించాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రోడ్ల పనులు కన్నా ముఖ్యమైన చాలా సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే వాదనకు దిగారు. తాను డిమాండ్ చేయబట్టి బస్టాండ్ వద్ద ఉన్న 30 లక్షల నుంచి 70 లక్షలు పెరిగిందని దీంతో 40 లక్షలు ఆదాయం బోర్డుకు పెరిగిందని బోర్డుకు ఖర్చు లేకుండా ఆదాయం పెరిగే కొనరులను సమీక్షించాలని ఆయన బ్రిగేడియర్ కు చెప్పారు ఇంకా నీటి సమస్య ఇతర సమస్యలపై కూడా చర్చించారు. అంతకుముందు దివంగత నేత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. సమావేశం అనంతరం అనంతరం సీఈవో తదితర అధికారులు, కంటోన్మెంట్ పారిశుధ్య సిబ్బందికి పరికరాలనును అందజేశారు



సెట్విన్ కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్‌లోని సెట్విన్ కేంద్రం కార్యకలాపాలను విస్తరించేందుకు ఏర్పాట్లు జరుపుతున్నామని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తెలిపారు. సితాఫలమండిలో నిర్మిస్తున్న సెట్విన్ భవనం కొత్త అంతస్తుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో సెట్విన్ ద్వారా వివిధ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతుల విద్యార్థులకు శిక్షణను కల్పించి ఉపాధిని ఏర్పరిచామని, మరిన్ని కొత్త కోర్సులను ప్రారంభించేందుకు వీలుగా అదనంగా వసతిని కల్పించేందుకు భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని, వివిధ కోర్సుల నిర్వహణకు వీలుగా భవన సముదాయాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు. సితాఫలమండీ సెట్విన్ సెంటర్ ఇన్‌చార్జి అనిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పరిశోధక విద్యార్థుల సబ్మిషన్ గడువు పొడిగించాలి'



నవతెలంగాణ-ఓయూ

2016, 2017, 2018 బ్యాచ్‌ల పరిశోధక విద్యార్థుల సబ్మిషన్ గడువును పొడిగించాలని కోరుతూ సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలోని పలు కాలేజీల డీన్స్, ప్రిన్సిపాల్స్‌కు విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధక విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. సోషల్ సైన్స్ డీన్ ప్రొ.అరుణ జ్యోతి,సైన్స్ డీన్ ప్రొ.కరుణ సాగర్,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం,సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన అనంతరం ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు, పీ.హెచ్డీ పరిశోధక విద్యార్థులు మాట్లాడారు. 2018 సంవత్సరంలో జాయిన్ అయిన పీహెచ్.డి విద్యార్థులకు కరోనా లాక్ డౌన్ వల్ల రెండు సంవత్సరాల కాలంపాటు పరిశోధన నిలిచి పోయిందన్నారు.గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి మొదటి తరంగా పరిశోధన చేస్తున్న విద్యార్థులకు పెల్లోషిప్స్ లేక అనేక ఇబ్బందులను ఎదుర్కోన్నట్టు చెప్పారు. అనేక ఆర్థిక సమస్యలతో సతమవుతున్న సందర్భంలో యూనివర్సిటీ యంత్రాంగం డెడ్ లైన్‌లు పెట్టడం వల్ల అనేక ఇబ్బందులకు గురై సబ్మిషన్ చేయలేకపోతున్నారని తెలిపారు. పీ.హెచ్డీ పరిశోధనకు తమకు అదనంగా సంవత్సరకాలం పాటు గడువును పొడగించాలనీ, ప్రోగ్రెస్ సెమినార్-2కు, రిసెర్చ్ డిజైన్ సెమినార్ కు కూడా అనుమతివ్వాలని, ప్రీ పీహెచ్డీ విద్యార్థులు మరోసారి పరిక్ష రాసేందుకు అనుమతి కల్పించాలని కోరారు. దీనికి డీన్స్, ప్రిన్సిపల్స్ సానుకూలంగా స్పందించారు. వారి విజ్ఞప్తిని వీసీ, రిజిస్ట్రార్ దష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, డీబీఎస్ఏ రాష్ట్ర కో ఆర్డినేటర్ జంగిలి దర్శన్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు అరుణ్,విద్యార్థి నాయకులు కాంతి ప్రణయ్ కుమార్, అరవింద్ వివిధ విభాగాల పరిశోధక విద్యార్థులు సంధ్యారాణి,సంధ్య, అలేఖ్య, ముత్యాలరావు, శ్రీనివాస్, రాకేష్, విజయ్, రాఘవేంద్ర, రవి, శ్రవంతి, లింగస్వామి,రమేష్,వెంకటేష్, శ్రీకాంత్, రమేష్,ప్రవీణ్, పాల్గొన్నారు.

నామినేటెడ్ సభ్యుడు మాటలతో ప్రజలను మోసగిస్తున్నాడు

- ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ లేనిపోని మాటలతో ప్రజలను మోసం చేస్తూ పదవులు కాపాడుకుంటూ వ్యాపార లావాదేవీలకే బోర్డు సమావేశాలు నిర్వహిస్తున్నాడని ఎమ్మెల్యే శ్రీ గణేష్ విమర్శించారు. ఆయన సంక్షేమం విస్మరించి లాభ పేక్ష కోసమే పని చేస్తాడని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు సోమవారం సాయంత్రం కంటోన్మెంట్ పికెట్ లోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చేస్తుంటే అది ఓర్చుకోలేక రామకృష్ణ మతిభ్రమించిన మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. బోర్డు సమావేశాల్లో తాను మాట్లాడుతున్న తీరుకు బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఓర్చుకోలేకనే ఈ విధంగా చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లు మార్చకుండా రోడ్డు టెండర్లు ఒకరికే ఎప్పుడూ ఇస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ప్రజా సంక్షేమం పట్టించుకోకుండా కేవలం పదవుల కోసమే రామకృష్ణ పని చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాని విమర్శించడం సమంజసం కాదన్నారు. చౌకబారు విమర్శలు రామకృష్ణ మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

కంటోన్మెంట్
ఎమ్మెల్యే శ్రీ గణేష్ బోర్డు
నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఒకరిపై
ఒకరు మాటలతూటాలను పేల్చుకుంటున్నారు
తాజాగా సోమవారం బోర్డు సమావేశం జరిగిన
అనంతరం సమావేశంలో రామకృష్ణ తీరుపై
ఎమ్మెల్యే, ఎమ్మెల్యే తీరుపై రామకృష్ణ
వేరువేరుగా విలేకరుల సమావేశం
ఏర్పాటు చేసి

ఎమ్మెల్యేకు అవగాహన లేదు

- బోర్డు నామినేటర్ సభ్యుడు రామకృష్ణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు ఎలాంటి అవగాహన లేదని ప్రజా సమస్యల పట్ల అభివృద్ధి పట్ల శిక్షణా తరగతులు ఇవ్వాలని కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఎద్దేవా చేశారు. బోర్డు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడిన తీరు చాలా అవగాహన రహిత్యంలో ఉందని, రోడ్లు ప్రతిపాదిస్తే రోడ్ల అవసరం లేదని ఎమ్మెల్యే తిరస్కరించటం ఏంటని ప్రశ్నించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి ఎమ్మెల్యేను ఎప్పుడూ చూడలేదని చెప్పారు . ఎమ్మెల్యే అవగాహన లేకుండా ప్రజా సమస్యల పట్ల బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేకు శాసనసభ స్పీకర్, గవర్నర్, అనుమతిస్తే శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అమిత్ షాను మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేయాలి

సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపిన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా ను మంత్రి వర్గం నుంచి తొలగించాలని యూసఫ్ గూడా బస్తి అడ్డా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సోమవారం సీపీఐ(ఎం) నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి విగ్రహం ముందు నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ మాట్లాడుతూ రాజ్యాంగం పై చర్చ జరుగుతున్న సందర్భంగా రాజ్యాంగ పదవిలో అంబేద్కర్‌ను అవమానించడం క్షమించరాని నేరం అని, దేశద్రో హం కింద కేసు పెట్టి అమిత్ షాను జైల్లో పెట్టాలని పిలుపుని చ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన భారత రాజ్యాంగంపై దాడి చేస్తూ మనుధర్మాన్నే దేశ ప్రజలపై రుద్దాలనే ప్రయత్నంలో భాగంగానే ఇవన్నీ జరుగుతున్నాయని, దేశంలో 2016లో నోట్ల రద్దు అ విపరీతమైన వైపరీత్యాలు వచ్చాయన్నారు. 2017లో జీఎస్టీతో రాష్ట్రాల హక్కులను హరించి, పన్నులు అన్ని కేంద్రం తీసుకుంటుందని అన్నారు . 2019లో కరోనాలో దేశ సంపద మొత్తం పెట్టుబడిదారులకు, అదానీ, అంబానీలకు కట్టబెట్టినటువంటి బీజేపీ ఈరోజు రాజ్యాంగాన్ని రద్దు చేసి ఒకే దేశం, ఒకే ఎన్నికలు, రాజులు, బానిస పాలన కిందికి వచ్చే పాలన చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రాల హక్కులు, ప్రజల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు టి సాయి శేషగిరిరావు ,జే స్వామి, పార్టీ నాయకులు దండు సత్యనారాయణ, వై యాదగిరి, బి లక్ష్మణ్ ,ఏ ఆర్ నరసింహా, సోమేశ్, రఘు, కుమార్, శంకర్ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్‌ను
ఆవిష్కరించిన బాబా ఫసియుద్దీన్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

నవతెలంగాణ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసివుద్దీన్ బోరబండలోని తన కార్యాలయంలో నవతెలంగాణ జూబ్లీహిల్స్ సీనియర్ రిపోర్టర్ ప్రసాదరావు, అమీర్‌పేట జోన్ ఇన్‌చార్జి రమేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నవతెలంగాణ పత్రిక రాజకీయ పార్టీలకు, కుల, మతాలకు, అతీతంగా ఉన్నది ఉన్నట్టు నిజాలు రాసే పత్రిక అని అభినందించారు.



కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే భర్తరఫ్ చేయాలి

నవతెలంగాణ-బేగంపేట్

అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను వెంటనే భర్తరఫ్ చేయాలని, పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ(ఎం) సనత్ నగర్ జోన్ కన్వీనర్ జి.నరేష్, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను వాక్యాలను ఖండిస్తూ సోమవారం సీపీఐ(ఎం) సనత్ నగర్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పాటిగడ్డ బస్తీలో ప్ల కార్డ్స్ ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే అమిత్ షా దేశ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట డివిజన్ నాయకులు వెంకటేష్, బాలస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.



తన రాతను తిరిగి రాయడానికి

మనాలికి చెందిన టెన్జిన్ డోల్మా 15 ఏండ్ల వయసులో వివాహం చేసుకుంది. 30 ఏండ్ల వయసులో పరుగు ప్రారంభించింది. హిమాలయాల్లో అత్యంత భయంకరమైన మారథాన్‌లలో కొన్నింటిని గెలుచుకుని తన పట్టణంలోని ఏకైక మహిళా మారథానర్‌గా నిలిచింది. హిమాచల్ ప్రదేశ్‌లోని ఆసియాలోనే ఎత్తైన గ్రామమైన కోమిక్‌లో జన్మించిన డోల్మా పేదరికంతో పోరాడుతున్న ఆ కుటుంబంలోని నలుగురు తోబుట్టువులలో చిన్నది. బాల్య వివాహం వల్ల అవకాశాలను పోగొట్టుకునే చాలా మంది మహిళల్లా కాకుండా డోల్మా తన రాతను తానే తిరిగి రాసుకుంది. అత్తమామల రూపంలో ఆమెకు ఓ సహాయక వాతావరణం కనిపించింది. ఏడేండ్ల కిందట మనాలిలో 21కె మారథాన్ చేయాల్సిందిగా స్నేహితురాలు సలహా ఇచ్చినప్పుడు డోల్మా ఎంతో ఇష్టంగా తన పేరు నమోదు చేసుకుంది. ఆ రేసులో ఆమె పోలీసు కుటుంబాల నుండి వచ్చిన మహిళలతో సహా అనుభవజ్ఞులైన రన్నర్లను ఓడించింది. అంతేకాదు హెల్ అల్ట్రాను సమయ పరిమితిలో పూర్తి చేసిన మొదటి మహిళగా అవతరించింది. ఇదే ఆమెను సముద్ర మట్టానికి 10,000 అడుగుల ఎత్తులో జరిగిన క్రూరమైన రేసు లాహౌల్‌లోని స్నో మారథాన్‌కు తీసుకెళ్లింది.

స్ఫూర్తినిచ్చే జీవితాలు

ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోతోంది. ఏడాదికేడాది సాధికారత దిశగా మహిళలు పరుగులు తీస్తూనే ఉన్నారు. మహిళా వ్యాపారవేత్తలుగా తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటున్నారు. సామాజిక అసమానతలను సవాల్ చేస్తూ సమానమైన ప్రపంచాన్ని సృష్టించేందుకు శ్రమిస్తూనే ఉన్నారు. స్టార్టప్‌ల నుండి సామాజిక మార్పుకై ఉద్యమాలు నడిపిన మహిళల సాహస గాథలు మనచుట్టూ ఎన్నో ఉన్నాయి. ఈ ఏడాది కొత్త ఆవిష్కరణలకు వారు నిదర్శనంగా నిలిచారు. కలలు కనే ప్రపంచం కోసం అసమాతలను ధిక్కరించే స్వరాలుగా వెలిశారు. 2024ను మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చే ఏడాదిగా మార్చిన వారి చిరుపరిచయాలు నేటి మానవిలో...

వయసు అడ్డంకులు బద్దలు కొట్టి

డెబ్బై రెండేండ్ల విజి వెంకటేష్... ది మ్యాక్స్ ఫౌండేషన్‌కు భారతదేశంతో పాటు దక్షిణాసియాకు రీజియన్ హెడ్‌గా ఉన్నారు. ఇది లాభాపేక్షలేని సంస్థ. భారతదేశంలోని క్యాన్సర్ కేర్ కమ్యూనిటీకి మూలస్తంభం. ఈ రంగంలో ఆమెకు 35 ఏండ్ల అనుభవం ఉంది.



2002 నుండి ఈమె ది మాక్స్ ఫౌండేషన్‌లో పనిచేస్తున్నారు. గ్లివెక్ ఇంటర్నేషనల్ పేషెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రాంకు నాయకత్వం వహిస్తున్నారు. స్థానిక నోవార్టిస్ అంకాలజీ యాక్సెస్ ప్రోగ్రామ్‌లో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. గత ఏడాది ఈమె అఖిల్ సత్యన్ దర్శకత్వంలో నటుడు ఫహద్ ఫాసిల్‌తో కలిసి 'పచ్చుం అల్భుతావిలక్కుమ్' చిత్రంతో ఆమె సినీ రంగ ప్రవేశం కూడా చేశారు.

వైరల్ దాదీలు

50 ఏండ్లు పైబడిన ఏడుగురు మహిళలతో కూడిన ఓ వీడియో ఈ ఏడాది ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాది మంది వీక్షకుల హృదయాలను దోచుకుంది. వారే బాలీవుడ్ చిత్రం బాడ్ న్యూజ్‌లోని తౌబా తౌబా పాటకు నృత్యం చేసిన మహిళలు. కర్ణాటకలోని బెల్గామ్‌లో ఒక సాధారణ వృద్ధాశ్రమం వలె ప్రారంభమైనది శాంతై వృద్ధాశ్రమం. ఇప్పుడు భారతదేశం అంతటా ఖ్యాతిని పొందింది. దానికి కారణమైన ఈ వృద్ధ మహిళలకు ధన్యవాదాలు చెప్పాల్సిందే. వారు తమ నృత్య కదలికలతో సోషల్ మీడియాలో ప్రసిద్ధ పాటలకు నృత్యం చేస్తూ తమ యవ్వనాన్ని పునరుజ్జీవింపజేస్తున్నారు. వారిని ఇప్పుడు ఇంటర్నెట్‌లో "వైరల్ దాదీలు" అని పిలుస్తున్నారు. దాదీ అంటే హిందీలో అమ్మమ్మ. గత సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఇన్‌స్టాగ్రామ్ ఛానెల్ ప్రస్తుతం 37,000 మంది ఫాలోవర్లను కలిగి ఉంది. అనేక మంది యువ సోషల్ మీడియా వినియోగదారులతో పాటు ప్రముఖులు వారికి మద్దతు ఇస్తున్నారు.



నటనతో పాటు...

సినిమాకి అతీతంగా నటి సమంతా రూత్ ప్రభు... నటనతో పాటు D2C ఫ్యాషన్ ప్రపంచంలోకి కూడా అడుగు పెట్టింది. నోరిష్ యుతో సహా బ్రాండ్‌ల సీడ్ ఫండింగ్ రౌండ్‌లలో కూడా పాల్గొంది. ఇటీవలె వెల్‌నెస్ స్టార్టప్, సీక్రెట్ ఆల్కెమిస్ట్‌లో సహ వ్యవస్థాపకురాలిగా పెట్టుబడి పెట్టింది. జుట్టు పెరుగుదల, కీళ్ల నొప్పులు, చర్మ సంరక్షణ కోసం ఈ సంస్థ నూనెలను ఉత్పత్తి చేస్తోంది. 'నేను ఈ ఉత్పత్తులను నమ్ముతున్నాను. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజానికి మంచి చేసే బ్రాండ్‌లలో భాగం కావడం చాలా అవసరం. అర్థవంతమైన ప్రభావాన్ని చూపే ఆలోచనలు, బ్రాండ్‌ల విషయంలో నేను సంతోషిస్తున్నాను. అయితే నా ఆశయాలు గొప్ప ఉద్దేశ్యంతో ముడిపడి ఉండాలి. అర్థవంతమైన ప్రభావాన్ని చూపాలి' అంటుంది సమంతా రూత్.





స్టీమ్‌లో మహిళలకు సాధికారత

ఫెమినిస్ట్ అప్రోచ్ టు టెక్నాలజీ అనే సంస్థను 2007లో లింగ సమానత్వం కోసం తన గొంతు విప్పిన న్యాయవాది గాయత్రి బురగోహైన్ స్థాపించారు. మహిళల జీవితాలను రూపొందించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని ఆమె గుర్తించారు. 'మహిళలు సాంకేతిక నైపుణ్యాలను కలిగి ఉంటే, సామాజిక అడ్డంకులను ఛేదించగలరు, స్వాతంత్ర్యం పొందగలరు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో తమ గొంతులను నొక్కి చెప్పగలరు' అని నమ్మే గాయత్రి ఈ లాభాపేక్ష రహిత సంస్థ స్థాపించారు. ఏండ్లుగా ఇది మూడు ప్రధానమైన లక్ష్యలతో పని చేస్తుంది. అవే యంగ్ ఉమెన్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్, గర్ల్స్ ఇన్ స్టీమ్ ప్రోగ్రామ్, కలెక్టివిజేషన్ ఇనిషియేటివ్. మహిళా సాధికారత కోసం పని చేస్తున్న ఈ సంస్థకు పూణేతో పాటు చుట్టుపక్కల ఉన్న పట్టణ మురికివాడలు, గ్రామీణ ప్రాంతాలు, ఢిల్లీలోని లజ్‌పత్ నగర్, జార్ఖండ్‌లోని గిరిదిహ్, పాట్నా, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలలో సాంకేతిక కేంద్రాలు ఉన్నాయి.



వైకల్యాన్ని జయించింది

గీతా కన్నన్ పోలియోతోపాటు నీటి భయంతో పెరిగింది. శరీర కదలికలపై నియంత్రణను తిరిగి పొందడానికి మూలకంతో స్నేహం చేసింది. తన వైద్యం కోసం చేసిన ప్రయాణంలో నీటితో అనుబంధం ఏర్పడింది. ప్రస్తుతం 43 ఏండ్ల వయసులో చెన్నైకి చెందిన ఈమె పారాలింపిక్ స్విమ్మింగ్ ఛాంపియన్. ఈ ఏడాది మార్చిలో జరిగిన తమిళనాడు రాష్ట్ర స్థాయి పారాలింపిక్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. ఇద్దరు పిల్లల తల్లి అయిన ఈమె దక్షిణ చెన్నై శివారులోని తాంబరంలోని తన ఇంటి నుండి పెరియమేడు వరకు ప్రతిరోజూ 34 కిలోమీటర్లు ప్రయాణిస్తోంది. ఇందులో రాంప్, కుర్చీ లిఫ్ట్‌తో కూడిన ఏకైక కొలను ఉంది. ఈ కుర్చీ లిఫ్ట్ ఆమె నీటిలోకి, బయటికి రావడానికి సహాయం చేస్తుంది. అనేక మంది పారా స్విమ్మర్లు, ఔత్సాహికులకు గీత గేమ్ ఛేంజర్‌గా మారారు.



యక్షగానాన్ని ముందుకు తీసుకెళుతూ...

బెంగళూరులో పెరిగిన ప్రియాంక మోహన్ చిన్నప్పటి నుండి యక్షగానమే ప్రపంచంగా బతికింది. ఎందుకంటే ఆమె ఇల్లు యక్షగాన కళాకారులకు ఓ కేంద్రం. తండ్రి యక్షగాన ఔత్సాహికుడు. ఆ కళా రూపాన్ని ప్రోత్సహించేవారు. నగరంలో ప్రదర్శనలు ఇవ్వడానికి దక్షిణ కన్నడ నుండి కళాకారులను తీసుకువచ్చేవారు. కళపై తండ్రి ప్రేమను చూసి ప్రియాంక కూడా యక్షగానానికే అంకితమయ్యింది. అయితే ఆమె 10వ తరగతి తర్వాత కళకు కొంత విరామం ఇచ్చింది. ఆ విరామ సమయంలోనే కళకు విలువ కట్టి, సరికొత్త దృష్టి కోణంతో చూడటం మొదలుపెట్టింది. ఇప్పుడు యక్షగానాన్ని ప్రదర్శించే, నేర్పించే అతికొద్ది మంది మహిళల్లో ప్రియాంక కూడా చేరిపోయింది. తండ్రి ప్రారంభించిన యక్షదేగులతో కళను ముందుకు తీసుకెళుతోంది.



ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా ఆయన సీఎంతో చర్చించారు. నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్టు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే విషయంలో రేవంత్ దార్శనికతను సత్య నాదెళ్ల ప్రశంసించారు. సర్కార్ చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ 50 నగరాల్లో ఉంచగలవని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటనీ, ప్రస్తుతం 10 వేల మందికి ఉపాధి కల్పిస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందనీ, హైదరాబాద్‌తోపాటు తెలంగాణవ్యాప్తంగా ఆ సంస్థ పెట్టుబడులు పెంచుతూ పోతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌ను టెక్నాలజీ డొమైన్‌లో ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారిస్తున్న ఏఐతో సహా వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణమైన వ్యవస్థ అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ మద్దతుగా నిలవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులను అందుబాటులో ఉంచేందుకు తాము చేస్తున్న కృషిని రేవంత్ వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

టి.లక్ష్మారెడ్డి, కార్యదర్శులుగా సిహెచ్.రాములు, సోమశేఖర్, ఎం.రాజశేఖర్ రెడ్డి, వి.శాంతి కుమార్, జి.సమ్మారావు, డి.సత్యానంద్, జి.నాగమణి, బి.రాజు, కె.రంజిత్ కుమార్, ఎస్.రవి, ప్రసాద్‌గౌడ్, మల్లారెడ్డి, కె.రవికుమార్, జి.శ్రీధర్, ఎ.సింహాచలం, వెంకటప్పను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా మస్తాన్‌రావు, కృష్ణయ్య వ్యవహరించారు. నూతన కమిటీని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అభినందించారు.

తెలంగాణ ఆత్మబంధువు

(మొదటిపేజీ తరువాయి)



పెట్టుకుంటారు. దేశానికి మన్మోహన్ చేసిన సేవలు చిరస్మరణీయం. అందువల్ల ఆయనకు భారత రత్న ఇవ్వాలని తీర్మానిస్తున్నాం. పార్టీలకతీతంగా మన్మోహన్‌సింగ్ పట్ల ఏకాభిప్రాయం వ్యక్తం చేయాల్సిన అవసరం ఉంది. ఆయనకు, జైపాల్ రెడ్డికి ఎంతో సన్నిహిత సంబంధం ఉంది. ఆయన నాయకత్వంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్. అలాంటి మహానుభావుడి విగ్రహాన్ని హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆయన విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో సభ్యుల సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నాం. తెలంగాణ గడ్డపై మన్మోహన్ సింగ్ విగ్రహం పెట్టడం సముచితం అని మేం భావిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లిన సమయంలో ఆయన సతీమణి తనతో మాట్లాడారనీ, తెలంగాణ పట్ల ఆయన ఆసక్తిగా ఉండేవారంటూ ఆమె చెప్పారని సీఎం గుర్తు చేసుకున్నారు. కుటుంబాన్ని, పిల్లలను గొప్ప విలువలతో తీర్చిదిద్దారనీ, దేశ యువతకు ఆయన జీవితం ఆదర్శప్రాయమని చెప్పారు. ఆర్థికంగా, రాజకీయంగా, సాంకేతికంగా దేశాన్ని ముందుకు నడిపించడంలో మన్మోహన్‌సింగ్ కృషి మరువలేనిదని రేవంత్ ఈ సందర్భంగా నివాళులర్పించారు.

గుదిబండగా మెట్రోలు !

(మొదటిపేజీ తరువాయి)

శాటిలైట్ నగరాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య 20 దాటుతుంది) మెట్రోలు పరుగులు తీస్తున్నాయి. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న లేదా అనుమతి పొందిన లేదా సుమారు పాతిక నగరాల్లో ప్రతిపాదనలు సిద్ధమైన దశల్లో మరో వెయ్యి కిలోమీటర్ల మెట్రో ట్రాక్ ఉంది. అయితే ఇంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్న వారి సంఖ్య మాత్రం నిరాశాజనకంగా ఉంటోంది.

దూర ప్రయాణాలకే అనుకూలం

మెట్రో రైళ్లు ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉంటాయి. పర్యావరణహితమైనవి. అయినప్పటికీ ప్రయాణికులను ఆకర్షించడంలో సబర్బన్ మెట్రో రైళ్లు విఫలమవుతున్నాయి. దానికి కారణం పట్టణ ప్రాంత వాసుల్లో అనేక మందికి మెట్రోల అవసరం లేకపోవడమే. ప్రయాణ దూరం తక్కువగా ఉన్న చోట మెట్రో అవసరం పెద్దగా ఉండడం లేదు. మన దేశంలో ఈ దూరం చాలా చోట్ల తక్కువగానే ఉంటోంది. తమ ఇంటికి సమీపంలో అందుబాటులో ఉన్న ప్రయాణ సౌకర్యాల వైపే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతారు. 'భారతీయ నగరాల్లో జనాభా ఎక్కువ. కాబట్టి ప్రజలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. ప్రజలు అధిక సంఖ్యలో మెట్రోలను ఉపయోగిస్తారని అనుకోవడం అవాస్తవం' అని ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చైర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గీతం తివారీ చెప్పారు. దూర ప్రాంత ప్రయాణాలకు మెట్రో తరహా వ్యవస్థలు ఆకర్షణీయంగా ఉంటాయని, అయితే లక్నో, జైపూర్, కొచ్చి, తదితర నగరాల్లో సైతం ఆరేడు శాతం మంది కంటే ఎక్కువగా దూర ప్రాంత ప్రయాణాలు చేయడం లేదని ఆయన తెలిపారు.

డిమాండ్ లేక వెలవెల

'ఏదైనా నగరంలో మెట్రో వ్యవస్థను విస్తరించినప్పటికీ అది ఎక్కువ మందికి ఉపయోగపడదు. ఎందుకంటే కొన్ని పెద్ద నగరాల్లో మాత్రమే దూర ప్రయాణాలు ఉంటాయి.

కాబట్టి వ్యవస్థను విస్తరించినప్పటికీ ప్రయాణికుల సంఖ్య పెద్దగా పెరిగేదేమీ ఉండదు' అని తివారీ చెప్పారు. రాజధాని ఢిల్లీలోని కొన్ని మెట్రో కారిడార్ల పనితీరు బాగుంది. అయితే చెన్నయ్ వంటి పెద్ద నగరాల్లో సైతం ముందుగా అంచనా వేసిన డిమాండ్‌లో నాలుగో వంతో లేక ఎనిమిదో వంతో ఉంది. నెలో లేదా రెండు నెలలో డిమాండ్ లేకపోవడం కాదు. మెట్రో సర్వీసులు మొదలై సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా డిమాండ్ తక్కువగానే ఉంటోంది.

ఖర్చు అధికం...ఆదాయం స్వల్పం

2014-2022 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం మెట్రో రైల్ ప్రాజెక్టుల కోసం రూ.90,000 కోట్లు విడుదల చేసింది. వివిధ రాష్ట్రాల్లోని చిన్న చిన్న నగరాలు సైతం మెట్రో రైళ్లు కావాలని కోరుతున్నాయి. దీనికి ప్రధాన కారణం వాటిలో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానమే. ఆర్థికంగా లాభదాయకంగా లేకపోయినా రాష్ట్రాలు మెట్రోల వైపే చూస్తున్నాయి. అవి ఉంటే రాష్ట్రానికి గర్వకారణమని భావిస్తున్నాయి. మరోవైపు పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉపయోగించే బస్సుల సంఖ్య తగ్గిపోతోంది. కిలోమీటరు దూరం మెట్రోను నిర్మించాలంటే రూ.500 కోట్లకు పైగానే ఖర్చవుతుంది. ఇంత ఖర్చు చేసినా ఢిల్లీ, మెట్రో వంటి నగరాల్లో ఆ కిలోమీటరు ప్రయాణం రోజూ కేవలం 10,000 నుండి 20,000 వేల మందికి మాత్రమే ఉపయోగపడుతోంది. అదే ఆ ఐదు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే ఐదు వందల నాణ్యమైన మెట్రో వంటి బస్సులు వస్తాయి. అవి రోజూ నాలుగైదు లక్షల మందిని గమ్యస్థానాలకు చేరుస్తాయి.

బస్సుల సంఖ్యనూ పెంచాలి

పైగా మెట్రో రైళ్లకు అనుసంధానంగా ప్రయాణికుల కోసం బస్సులు నడపాల్సి వస్తోంది. అరవై కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని నిర్మిస్తే అది 60 చదరపు కిలోమీటర్ల పరిధిలో ప్రయాణికులకు సేవలు అందిస్తుంది. కానీ నగర విస్తీర్ణం ఐదు వందల నుండి వెయ్యి చదరపు కిలోమీటర్ల వరకూ ఉంటుంది. అలాంటప్పుడు అవి ప్రజలకు విస్తృత సేవలు ఎలా అందించగలవు? కేవలం మెట్రోలపై ఆధారపడితే సమస్య పరిష్కారం కాదు. ఉదాహరణకు బెంగళూరులో మెట్రోను ప్రవేశపెట్టడానికి ముందు బస్సుల సంఖ్యను పెంచలేదు. ఇప్పుడు బస్సు ప్రయాణికుల సంఖ్య పడిపోయింది. అటు మెట్రో ప్రయాణికులూ పెరగలేదు. ఫలితంగా రోడ్లపై ద్విచక్ర వాహనాల జోరు కన్పిస్తోంది. కాబట్టి చౌకగా అందుబాటులో ఉండే ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయి.

వైద్య బీమా కంపెనీల దోపిడీ

నవతెలంగాణ- బిజినెస్ డెస్క్

దేశంలోని పలు వైద్య బీమా కంపెనీలు పాలసీదారుల క్లెయిమ్‌లను పరిష్కరించకుండా.. ఓ విధంగా దోపిడీకి పాల్పడుతున్నాయి. బీమా ఇచ్చే సమయంలో క్యాష్‌లెస్, మొత్తం మేమే భరిస్తామని చెప్తుతూ పాలసీలు చేయిస్తున్న సంస్థలు.. ఆ తర్వాత పాలసీదారు అనారోగ్యంతో హాస్పిటల్ పాలు అయితే చెల్లింపుల్లో కొసర్లు, కోతలు పెట్టడమే కాదు.. కొన్ని సార్లు పూర్తిగా తిరస్కరిస్తున్న ఘటనలు అమాంతం పెరిగాయి. ఇన్సూరెన్స్ రెగ్యూలేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) రిపోర్ట్ ప్రకారం.. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో విలువ పరంగా 29 శాతం క్లెయింలు తిరస్కరణకు గురైయ్యాయి. దీంతో పాలసీదారులపై రూ.16,000 కోట్ల పైగా భారం పడింది. తాము చేసుకున్న బీమా తిరస్కరణకు గురి కావడంతో ఈ మొత్తాన్ని వారు తమ జేబు నుంచి భరించాల్సి వచ్చింది. దీంతో తమకు హామీకి తగ్గట్లుగా సేవలు అందలేదని అంబుడ్స్‌మెన్‌కు 34,000కు పైగా ఫిర్యాదులు అందాయి. అంటే బీమా కంపెనీల పనితీరు స్పష్టమవుతోంది.

దేశంలోని ఆరోగ్య బీమా సంస్థలు మొత్తం ఫైల్ అయిన క్లెయిమ్‌లలో 71.3 శాతం విలువైన క్లెయిమ్‌లను మాత్రమే పరిష్కరించాయి. 2023-24లో దాదాపు రూ.1.2 లక్షల కోట్ల విలువైన క్లెయిమ్‌లు ఫైల్ అయ్యాయి. వాటిలో రూ.1.1 లక్షల కోట్ల విలువైన 3 కోట్ల కొత్త క్లెయిమ్‌లు, అంతక్రితం సంవత్సరాలకు సంబంధించిన రూ.6,290 కోట్ల క్లెయిమ్‌లు ఉన్నాయి.

మొత్తం క్లెయిమ్‌లలో రూ.83,493 కోట్ల విలువైన 2.7 కోట్ల క్లెయిమ్‌లను బీమా సంస్థలు పరిష్కరించాయి. సంఖ్యా పరంగా 82 శాతం క్లెయిమ్‌లు పరిష్కరించగా, విలువ పరంగా 71.3 శాతం చెల్లింపులు జరిగాయి. ఇందులో తమ షరతులకు అనుగుణంగా లేవని రూ.15,100 కోట్ల విలువ చేసే వైద్య బీమా క్లెయిమ్‌లను నిరాకరించాయి. అదనంగా రూ.1,093 కోట్ల విలువైన 3.6 లక్షల పాలసీలు తిరస్కరించబడ్డాయి.

పెండింగ్‌లో 6.4 శాతం క్లెయిమ్‌లు

రూ.7,584 కోట్ల విలువైన 6.4 శాతం క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. 2023-24లో బీమా సంస్థలు రూ.1.1 లక్షల కోట్ల విలువైన ఆరోగ్య బీమా ప్రీమియాలు వసూలు చేశాయి.

ఇందులో ప్రయివేటు బీమా సంస్థలు రూ.34,503 కోట్లు వసూలు చేశాయి. ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు రూ.40,993 కోట్లు వసూలు చేశాయి. స్టాండ్‌అలోన్ ఇన్సూరెన్స్ కంపెనీలు రూ.32,180 కోట్ల ప్రీమియంలను నమోదు చేశాయి.

ప్రభుత్వ సంస్థలు భేష్..

దేశంలోని 20 ప్రయివేటు వైద్య బీమా కంపెనీలు గతేడాది 2023లో 80 శాతం లోపే క్లయిమ్ మొత్తం చెల్లింపులు చేశాయని ఇటీవల ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబీఏఐ) ఒక రిపోర్ట్‌లో తెలిపింది. వైద్య బీమా చెల్లింపులు, పరిష్కారాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగైన పనితీరును కనబర్చాయి. గరిష్టంగా 98 శాతం మేర చెల్లింపులు చేసిన సంస్థలు ఉన్నాయి. ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ మాత్రం ఏకంగా 98.74 శాతం మొత్తం చెల్లిస్తూ టాప్‌లో ఉండటం విశేషం.

మరో పీఎస్‌యూ ఓరియంటల్ ఇన్సూరెన్స్ కూడా సగటున 97.35 శాతం మొత్తాన్ని చెల్లించింది. ప్రయివేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సి ఎర్గో సగటున 71.35 శాతం మొత్తం క్లెయిమ్ చెల్లింపులు చేసింది. ఐసీఐసీఐ లంబార్డ్ 63.98 శాతం చెల్లించగా.. ఈ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న స్టార్ హెల్త్ మాత్రం 54.61 శాతం క్లెయిమ్ చెల్లింపులు చేయడం గమనార్హం. ఆరోగ్య బీమా వ్యాపారంలోని 29 బీమా సంస్థలలో కేవలం నాలుగు బీమా కంపెనీలు మాత్రమే 2023 సంవత్సరంలో 90 శాతం కంటే ఎక్కువ క్లెయిమ్ చెల్లింపు నిష్పత్తిని (క్లెయిమ్‌ల సంఖ్యపై) కలిగి ఉన్నాయి. దాదాపు పది బీమా సంస్థలు 80 శాతం కంటే తక్కువ క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లను కలిగి ఉన్నాయి.

ఉపాధ్యాయునిపై మతోన్మాదుల దాడి అత్యంత హేయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై మతోన్మాద మూకలు దాడికి పాల్పడడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళితుడైన ఉపాధ్యాయుడు కంబలి రాములు తరగతి గదిలో ఒక విద్యార్థిని లెక్కలు అడుగుతూ నిల్చోబెట్టగా.. ఈ సందర్భాన్ని సోషల్ మీడియాలో వ్యక్రీకరిస్తూ మాల వేసుకున్న విద్యార్థిని నిలబెట్టారనే సాకుతో మతోన్మాద మూకలు భక్తి ముసుగులో రాములుపై దాడి చేసి కక్షపూరితంగా కాళ్లు మొక్కించి అవమానపరిచారని పేర్కొన్నారు. ఈ అల్లరి మూకలు తమకుతాము ధర్మరక్షకులుగా చెప్పుకుంటూ గూండాలుగా ప్రవర్తిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. అంబేద్కర్, రాజ్యాంగంపై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం, దాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఖండించకపోవడం తదితర చర్యలన్నీ ఇట్లాంటి మూకలకు మరింత ఊతమిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తమ్మినేని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మోడీ కూడా స్పందించడం లేదన్నారు. పెత్తందారీ ధోరణి, అధికార దర్పాన్ని ప్రదర్శించడం శోచనీయమని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వలీ ఉల్లాఖాద్రీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జెవి చలపతిరావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర నాయకులు తేజ మాట్లాడుతూ అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే కేంద్ర మంత్రివర్గం నుంచి ఆయన్ను బర్తరఫ్ చేయాలని కోరారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తెచ్చేందుకు మనువాదులు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శిం చారు. అంబేద్కరిజం, మార్క్సిజం అంటే వారికి కంటగింపుగా ఉందన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసి హిందూరాజ్యం స్థాపించాలని భావిస్తున్నారని అన్నారు. పార్లమెంటులో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా పక్కదారి పట్టించడంలో భాగంగానే అమిత్‌షా ఇలాంటి వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్, సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు, ఎం దశరథ్, ఎం మహేందర్, సీపీఐ నగర నాయకులు స్టాలిన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సంధ్య, ఝాన్సీ, అరుణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ట్రాన్స్‌జెండర్లు - 3
మొత్తం-3,41,313

మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ టీచర్స్ నియోజకవర్గం
ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్‌లు - 274

పురుష ఓటర్లు - 16,364
మహిళా ఓటర్లు - 9,557
మొత్తం- 25,921

వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ నియోజకవర్గ ఎన్నికల వివరాలు
ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్‌లు - 200

పురుష ఓటర్లు - 14,940
మహిళా ఓటర్లు - 9,965
మొత్తం- 24,905



అమెరికా,హైదరాబాద్ ఫ్రెండ్లీ మ్యాచ్!

యుఎస్ఏ, హెచ్‌సీఏ చీఫ్‌ల భేటీలో నిర్ణయం

హైదరాబాద్ : అండర్-19 స్థాయిలో అమెరికా, హైదరాబాద్ జట్లు స్నేహపూర్వక మ్యాచుల్లో తలపడేందుకు అవసరమైన కార్యాచరణ రూపకల్పనకు అమెరికా క్రికెట్ బోర్డు చైర్మెన్ వేణు రెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ ఓ అంగీకారానికి వచ్చారు. సోమవారం మర్యాదపూర్వకంగా సమావేశమైన వేణు, జగన్‌లు క్రికెట్ అభివృద్ధిపై విస్తృత స్థాయిలో చర్చించారు. హైదరాబాద్, అమెరికా జట్లు స్నేహపూర్వక సిరీస్‌ల కోసం పర్యటించేందుకు త్వరలోనే టూర్ క్యాలెండర్ తయారు చేయాలని భావించారు. వేణురెడ్డితో భేటీలో చర్చించిన అంశాలపై హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అధికారికంగా ప్రకటన చేస్తామని జగన్‌మోహన్‌రావు తెలిపారు.



దీప్తికి 'చిరు' సహాయం

రూ.3 లక్షల నగదు ప్రోత్సాహం అందజేత

హైదరాబాద్ : 2024 పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత స్టార్ పారా అథ్లెట్, తెలంగాణ అమ్మాయి దీప్తి జీవాంజికి కేంద్ర మాజీ మంత్రి, సినీ నటుడు చిరంజీవి ఆర్థిక సహాయం అందించారు. సోమవారం గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీలో జరిగిన ఓ కార్యక్రమంలో దీప్తిని చిరంజీవి ఘనంగా సన్మానించారు. రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. దీప్తి ప్రతిభ, శ్రమకు తగిన గుర్తింపు లభించిందని చిరంజీవి తెలిపారు. జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, చాముండేశ్వరనాథ్‌ తీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చేతులెత్తేశారు

- ఛేదనలో భారత్ 155 ఆలౌట్
- యశస్వి జైస్వాల్ ఒంటరి పోరాటం వృథా
- 184 పరుగులతో ఆసీస్ ఘన విజయం
- 2-1తో టెస్టు సిరీస్‌లో కంగారూల ఆధిక్యం

గెలుపు కోసం ఒక్క రోజులో 400 పరుగులు కొట్టాలంటే..బ్యాటర్లు అందుకు సిద్ధం. డ్రా కోసం ఓ రోజంతా వికెట్లు కాపాడుకునే పరిస్థితికి సైతం బ్యాటింగ్ లైనప్ సిద్ధమే.

కెప్టెన్ రోహిత్ శర్మ చెప్పినట్లు.. మెల్‌బోర్న్‌లో టీమ్ ఇండియా ఈ రెండూ చేయలేదు. విజయానికి అవసరమైన 369 పరుగులు కొట్టలేక, డ్రాకు అవసరమైన డిఫెన్స్ చేయలేక చేతులెత్తేసింది. ఫలితంగా, 12 ఏండ్లలో తొలిసారి భారత్ బాక్సింగ్ డే టెస్టులో పరాజయం పాలైంది. ఆతిథ్య ఆస్ట్రేలియా 184 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 2-1తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆధిక్యం దక్కించుకుంది. ఈ ఓటమితో డబ్ల్యూటీసీ ఫైనల్స్‌లో టీమ్ ఇండియా ఆశలు గల్లంతయ్యాయి!.

నవతెలంగాణ-మెల్‌బోర్న్

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (84, 208 బంతుల్లో 8 ఫోర్లు) బాధ్యతాయుత అర్థ సెంచరీతో చేసిన ఒంటరి పోరాటం వృథా అయ్యింది. రిషబ్ పంత్ (30, 104 బంతుల్లో 2 ఫోర్లు) మినహా మరో బ్యాటర్ రెండెంకల స్కోరు దాటలేదు. 369 పరుగుల భారీ ఛేదనలో భారత్ 79.1 ఓవర్లలో 155 పరుగులకు కుప్పకూలింది. రోహిత్ శర్మ (9), కెఎల్ రాహుల్ (0), విరాట్ కోహ్లి (5), రవీంద్ర జడేజా (2), నితీశ్ కుమార్ రెడ్డి (1) విఫలం అయ్యారు. ఆసీస్ పేసర్లు పాట్ కమిన్స్ (3/28), స్కాట్ బొలాండ్ (3/39) మూడేసి వికెట్లు పడగొట్టగా.. స్పిన్నర్ నాథన్ లయాన్ (2/37), ట్రావిశ్ హెడ్ (1/14) ఆకట్టుకున్నారు. ఆఖరు రోజు ఆట చివరి సెషన్లో ఏకంగా ఏడు వికెట్లు పడగొట్టిన కంగారూలు బాక్సింగ్ డే టెస్టులో మెరుపు విజయం సాధించారు. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కంగారూ కెప్టెన్ పాట్ కమిన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. భారత్, ఆస్ట్రేలియా ఆఖరు, ఐదో టెస్టు జనవరి 3 నుంచి సిడ్నీలో ఆరంభం కానుంది.

జైస్వాల్ ఒక్కడే :

369 పరుగుల ఛేదనలో భారత బ్యాటర్లు తేలిపోయారు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (84) మరో అర్థ సెంచరీతో మెప్పించాడు. ఛేదనలో డ్రా కోసమే బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియా.. అదే వ్యూహంతో ఆడింది. కెప్టెన్ రోహిత్ శర్మ (9, 40 బంతుల్లో) సహజశైలికి భిన్నంగా ఆడాడు. 40 బంతుల్లో ఒక్క బౌండరీ సాధించలేదు. మరో ఎండ్‌లో యశస్వి జైస్వాల్ సైతం ఆచితూచి ఆడాడు. దీంతో ఆసీస్ తొలి వికెట్ కోసం 17వ ఓవర్ వరకు వేచి చూడక తప్పలేదు. కమిన్స్‌కు మళ్లీ రోహిత్ వికెట్ కోల్పోయాడు. అదే ఓవర్లో కెఎల్ రాహుల్ (0) సైతం పెవిలియన్ చేరాడు. గుడ్ లెంగ్త్ బంతితో రాహుల్‌ను సైతం కమిన్స్ అవుట్ చేశాడు. అప్పటికి భారత్ స్కోరు 25/2. విరాట్ కోహ్లి (5) లంచ్ విరామం వరకైనా వికెట్ నిలుపుకోలేదు. పాత పద్దతిలోనే ఆఫ్ స్టంప్ ఆవల వెళ్తున్న బంతిని వెంటాడి వికెట్ ఇచ్చేశాడు. భారత్ 33/3తో లంచ్ విరామానికి వెళ్లింది.

రెండో సెషన్లో భారత్ అద్భుత పోరాట పటిమ చూపించింది. రిషబ్ పంత్ (30)తో యశస్వి జైస్వాల్ జోడీ నాల్గో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. ఈ జోడీ క్రీజులో ఉండగా భారత్ మ్యాచ్ రేసులో నిలిచింది. టీ విరామం వరకు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. 112/3తో భారత్ టీ విరామానికి వెళ్లింది. ఆ తర్వాత టీమ్ ఇండియా కథ మారింది. ట్రావిశ్ హెడ్ ఓవర్లో పంత్ దూకుడుగా ఆడటం కొంపముంచింది. ఆ తర్వాత లోయర్ ఆర్డర్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. రవీంద్ర జడేజా (2), నితీశ్ కుమార్ రెడ్డి (1), ఆకాశ్ దీప్ (7), జశ్‌ప్రీత్ బుమ్రా (0), మహ్మద్ సిరాజ్ (0) అలవోకగా వికెట్లు సమర్పించుకున్నారు. యశస్వి జైస్వాల్ వివాదాస్పద డీఆర్‌ఎస్ రివ్యూకు అవుట్ కాగా.. వాషింగ్టన్ సుందర్ (5 నాటౌట్, 45 బంతుల్లో) అజేయంగా నిలిచాడు. భారత్ చివరి ఏడు వికెట్లను కేవలం 34 పరుగులకే కోల్పోయింది. 79.1 ఓవర్లలో 155 పరుగులకే కుప్పకూలి టీమ్ ఇండియా ఓటమి చవిచూసింది. అంతకుముందు, ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు ఆలౌటైంది. భారత పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా (5/57) ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.





స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 474/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 369/10

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : 234/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) అలెక్స్ (బి) కమిన్స్ 84, రోహిత్ శర్మ (సి) మార్ష్ (బి) కమిన్స్ 9, కెఎల్ రాహుల్ (సి) ఖవాజా (బి) కమిన్స్ 0, విరాట్ కోహ్లి (సి) ఖవాజా (బి) స్టార్క్ 5, రిషబ్ పంత్ (సి) మార్ష్ (బి) హెడ్ 30, రవీంద్ర జడేజా (సి) అలెక్స్ (బి) బొలాండ్ 2, నితీశ్ కుమార్ రెడ్డి (సి) స్మిత్ (బి) లయాన్ 1, వాషింగ్టన్ సుందర్ నాటౌట్ 5, ఆకాశ్ దీప్ (సి) హెడ్ (బి) బొలాండ్ 7, జశ్‌ప్రీత్ బుమ్రా (సి) స్మిత్ (బి) బొలాండ్ 0, మహ్మద్ సిరాజ్ (ఎల్బీ) లయాన్ 0, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం :(79.1 ఓవర్లలో ఆలౌట్) 155.**

వికెట్ల పతనం : 1-25, 2-25, 3-33, 4-121, 5-127, 6-130, 7-140, 8-150, 9-154, 10-155.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 16-8-25-1, పాట్ కమిన్స్ 18-5-28-3, స్కాట్ బొలాండ్ 16-7-39-3, మిచెల్ మార్ష్ 3-2-2-0, నాథన్ లయాన్ 20.1-6-37-2, ట్రావిశ్ హెడ్ 5-0-14-1, మార్నస్ లబుషేన్ 1-1-0-0.



ఐసీసీ అవార్డు రేసులో బుమ్రా

దుబాయ్ : భారత పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ అవార్డు రేసులో నిలిచాడు. 2024 ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, ఐసీసీ మెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ నామినీలను ఐసీసీ సోమవారం వెల్లడించింది. జో రూట్ (ఇంగ్లాండ్), కమిందు మెండిస్ (శ్రీలంక), హ్యారీ బ్రూక్ (ఇంగ్లాండ్) సహా జశ్‌ప్రీత్ బుమ్రా ఈ అవార్డుకు నామినేట్ అయ్యారు. అవార్డు రేసులో ముగ్గురు బ్యాటర్లతో పేసర్ బుమ్రా పోటీపడుతున్నాడు. ఈ ఏడాది 13 టెస్టుల్లో 14.92 సగటుతో బుమ్రా 71 వికెట్లు పడగొట్టాడు. ఐసీసీ మెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు సైతం బుమ్రా నామినేట్ అయ్యాడు. జో రూట్, ట్రావిశ్ హెడ్, హ్యారీ బ్రూక్‌లతో బుమ్రా ఇక్కడ పోటీపడుతున్నాడు. భారత్ నుంచి ఇతర క్రికెటర్లు ఎవరూ ఐసీసీ అవార్డుకు నామినేట్ అవ్వలేదు. ఐసీసీ అవార్డు జ్యూరీ, అభిమానుల ఓటింగ్‌తో అవార్డు విజేతలను నిర్ణయిస్తారు.

విజయాల ఏడాది!

2024 భారత్‌కు అద్భుత విజయాలను అందించింది. పారిస్‌లో మను బాకర్, నీరజ్ చోప్రా, హాకీ జట్టు పతక మెరుపులతో దేశం గర్వపడేలా చేశారు. 11 ఏండ్ల నిరీక్షణకు తెరదించుతూ టీమ్ ఇండియా ఐసీసీ టీ20 ప్రపంచకప్ సాధించింది. పారా షూటర్ అవనీ లేఖర పారిస్‌లో పతక గురి తప్పలేదు. చదరంగంలో గుకేశ్, కోనేరు హంపి ప్రపంచ విజేతలుగా నిలిచి ఈ ఏడాది మరింత మధురం చేశారు.



రౌండప్ 2024

నవతెలంగాణ క్రీడావిభాగం

17 ఏండ్ల తర్వాత మళ్లీ.. :

2007 ఐసీసీ టీ20 ప్రపంచకప్ నెగ్గిన భారత్.. మళ్లీ పొట్టి కప్‌ను ముద్దాడలేదు. అమెరికా వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో 17 ఏండ్ల తర్వాత మళ్లీ భారత్ విజేతగా నిలిచింది. ఉత్కంఠభరిత ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 7 పరుగుల తేడాతో మెరుపు విజయం సాధించింది. ఈ విజయంతో దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని తాకాయి. సమిష్టిగా రాణించిన టీమ్ ఇండియా 11 ఏండ్ల ఐసీసీ టైటిల్ నిరీక్షణకు తెరదించింది. చారిత్రక విజయంతో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఈ ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు.





ఒలింపిక్స్‌లో జోరు :

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఆరు పతకాలు సాధించింది. పతకాల సంఖ్య పరంగా నిరాశపడినా.. యువ అథ్లెట్ల ప్రదర్శన దేశం గర్వపడేలా చేసింది. నీరజ్ చోప్రా సిల్వర్ మెడల్ సాధించగా.. షూటింగ్‌లో మను బాకర్ చారిత్రక రెండు కాంస్యాలు దక్కించుకుంది. సరబ్జోత్ సింగ్, స్వప్నిల్ సింగ్, అమన్ సెహ్రావత్‌లు పతకాలు సాధించారు. హాకీ ఇండియా మరోసారి కాంస్య పతకంతో దేశం సంబురాలు చేసుకునేలా చేసింది. రెండు కాంస్య పతకాలతో చరిత్ర సృష్టించిన మను బాకర్.. 0.1 పాయింట్ తేడాతో హ్యాట్రిక్ మెడల్ చేజార్చుకున్న సంగతి తెలిసిందే.



పారా అథ్లెట్ల చరిత్ర :

పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ ఆల్‌టైమ్ అత్యుత్తమ ప్రదర్శన చేసింది. ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, 13 కాంస్యాలు సహా 29 పతకాలు గెల్చుకుంది. పారా షూటర్ అవని లేఖర పారాలింపిక్స్‌లో రెండు బంగారు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచింది. సుమిత్ అంతిల్, మారియప్పన్ తంగవేలు, ధరంబీర్, సూర్మ ప్రవీణ్ కుమార్‌లు పతక వేటలో అదరగొట్టారు. పారిస్ మెరుపులతో పారాలింపిక్స్ చరిత్రలో భారత్ పతకాల సంఖ్య అర్థ సెంచరీ దాటేసింది.

చదరంగంలో హవా :

చదరంగంలో 2024 మరుపురాని విజయాలను అందించింది. దొమ్మరాజు గుకేశ్ 18 ఏండ్ల వయసులోనే ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించాడు. 14 రౌండ్ల పాటు చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో పోటీపడిన గుకేశ్ ఆఖరు రౌండ్లో అసమాన విజయంతో టైటిల్ సొంతం చేసుకుని చరిత్ర సృష్టించాడు. ఫిడె క్యాండిడేట్స్ విజేతగా నిలిచి సంచలనం సృష్టించిన గుకేశ్ అక్కడితో ఆగిపోలేదు. ఫిడె ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలుగు తేజం కోనేరు హంపి చరిత్ర సృష్టించింది. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడిన టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా నిలువటం హంపికి ఇది రెండోసారి. గుకేశ్ చెస్‌లో రారాజుగా నిలువగా.. హంపి చదరంగం రాణిగా నిలిచింది.

టేబుల్ టెన్నిస్‌లోనూ.. :

మనిక బత్రా, ఆకుల శ్రీజ, అహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ, దియలు ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు తొలి పతకం అందించారు. 1972 నుంచి జరుగుతున్న ఈ పోటీల్లో భారత్ ఇప్పటివరకు సెమీఫైనల్‌కు చేరలేదు. తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ఈ చారిత్రక విజయంలో కీలక పాత్ర పోషించింది.





విజయాల్లోనూ తగ్గేదేలే..

నవచిత్రం

ఈ ఏడాది పలు సినిమాల సక్సెస్‌లో హీరోయిన్ల పాత్ర చాలా కీలకంగా నిలిచింది. తమ అత్యద్భుత నటనతో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేశారు. హీరోలకు దీటుగా పాటలు, ఫైట్లలోనూ తగ్గేదేలే.. అంటూ సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేశారు. మహిళా దర్శక, నిర్మాతలు సైతం సంచలన విజయాలకు సూత్రధారులుగా నిలిచారు. తమదైన ముద్రతో సరికొత్త సక్సెస్‌ల ఒరవడికి నాంది పలికి, అందర్నీ గర్వపడేలా చేశారు. తెలుగు సినిమా సత్తాని చూపించడంలో కీ రోల్ ప్లే చేసిన మహిళాశక్తికి హ్యాట్సాఫ్.

రీల్ .. రౌండప్ 2024

- **ఈ** ఏడాది అత్యధిక కలెక్షన్లతో మోతమోగించిన 'పుష్ప2' సినిమాలో శ్రీవల్లి పాత్రని ఇట్టే మర్చిపోలేం. పుష్పరాజ్‌గా అల్లుఅర్జున్‌కి దీటుగా తన నటనతో, హావభావాలతో **రష్మిక మందన్నా** సిల్వర్‌స్క్రీన్‌పై నట విశ్వరూపాన్ని చూపించింది. పాన్ ఇండియా మార్కెట్‌ని షేక్ చేస్తూ కేవలం 21 రోజుల్లో రూ. 1705 కోట్ల రూపాయల్ని కొల్లగొట్టిన ఈ సినిమా విక్టరీలో రష్మికది కూడా కీ రోల్ అని వేరేచెప్పక్కర్లేదు.
- ఇక అమాయక కానిస్టేబుల్ పాత్రలో **ప్రియాంక మోహన్**‌ని తప్ప వేరే వారిని ఊహించుకోలేం అన్నట్టుగా ఉన్న ఆమె నటని మెచ్చుకోవాల్సిందే. నాని కథానాయకుడిగా తెరకెక్కిన 'సరిపోదా శనివారం' సినిమాలో చారులతగా ప్రియాంక నటనకి అందరూ ఫిదా అయిపోయారు.
- ఇల్లు, భర్త, తగిన సంపాదనతో సంతోషంగా ఉంటే చాలు అనుకునే ఓ సాధారణ మధ్య తరగతి ఇల్లాలుగా 'లక్కీభాస్కర్' సినిమాలో **మీనాక్షి చౌదరి** పడే ఆవేదనకు ఎవ్వరైనా సరే కన్నీటిపర్యంతం అవ్వకుండా ఉండలేరు. ఉన్నంతలో భర్త తనని సంతోషంగా చూసుకుంటే చాలు అని మురిసిపోయే పాత్రలో మీనాక్షి నటన అందరితో ఆహా..అనిపించింది. దుల్కర్‌సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన 'లక్కీభాస్కర్' చిత్రం మంచి ఆదరణతోపాటు వసూళ్లలోనూ అదరగొట్టింది.
- 'టిల్లు స్క్వేర్'లో బ్యూటీఫుల్ స్పై ఏజెంట్‌గా **అనుపమ పరమేశ్వరన్** నటన ట్రెండీగా ఉంటూ అందర్నీ మాయ చేసింది. ఆమె అందం, అభినయం కుర్రకారుని చూపు తిప్పుకోనియ్యకుండా చేసింది. అంతేకాదు సినిమా వంద కోట్ల క్లబ్‌లో జాయిన్ అవ్వడంలోనూ ముఖ్యభూమిక పోషించింది.
- ఈ ఏడాది మోతమోగిన పాటల్లో 'ఆ కుర్చీ మడత బెట్టి..' ఒకటి. ఈ ఫాస్ట్ బీట్ పాటకి నాయిక **శ్రీలీల** వేసిన స్టెప్స్ మామూలుగా లేవు. ఓ స్ప్రింగ్‌లా ఆమె చేసిన డాన్స్ ప్రేక్షకుల్ని మంత్రముగ్దుల్ని చేసింది. మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబోలో తెరకెక్కిన 'గుంటూరు కారం' సినిమాలో అమ్ముగా శ్రీలీల అటు నటనతోను, ఇటు డ్యాన్స్‌తోనూ ప్రేక్షకుల్ని అలరించింది. టాక్ పరంగా ఈ సినిమా బాగోలేకపోయినా రూ.180 కోట్ల గ్రాస్‌ని కలెక్ట్ చేసింది.
- ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా **భాగ్యశ్రీ బోర్సే** వంటి నూతన కథానాయికలు పలువురు పరిచయం అవ్వగా, బాలీవుడ్ నుంచి శ్రీదేవి తనయ **జాన్వీకపూర్** 'దేవర'తో, అలాగే 'కల్కి'తో **దీపికాపదుకొనె** తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. ఈ సినిమాల విజయాల్లో వీళ్లు ముఖ్యపాత్ర పోషించారు.
- సినిమా నిర్మాణంలోనూ మహిళా నిర్మాతలు తమదైన ముద్ర వేశారు. సంచలన విజయాలతో ఎవరికీ తీసిపోమని నిరూపించారు.
- ఈ ఏడాది చిన్న సినిమాగా విడుదలైన 'కమిటీకుర్రోళ్ళు' విశేష ప్రేక్షకాదరణతో మంచి కలెక్షన్లను సాధించి, పెద్ద స్థాయి సక్సెస్‌ని కైవసం చేసుకుంది. పలు వెబ్ సిరీస్‌ల నిర్మాణంతోనే కాకుండా నటిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్న **నిహారిక కొణిదెల** ఈ సినిమాతో నిర్మాతగా మంచి విజయాన్ని దక్కించుకున్నారు.
- ప్రపంచ వ్యాప్తంగా రూ.1100 కోట్ల వసూళ్ళని కొల్లగొట్టిన 'కల్కి'లాంటి భారీ బడ్జెట్ చిత్రాన్ని తీసిన క్రెడిట్ **ప్రియాంక దత్, స్వప్నాదత్**‌లదే. భిన్న కథాకథనాలతో నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్, అమితాబ్‌బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె వంటి హేమాహేమీలతో 'కల్కి' లాంటి సినిమా తీయడం సాహసమని చెప్పకతప్పదు.
- అలాగే ఈ ఏడాది విడుదలైన చిన్న సినిమాల్లో సక్సెస్‌పరంగా బాగా సౌండ్ చేసిన సినిమా 'ఆయ్'. ఈ సినిమా నిర్మాతల్లో **విద్యా కొప్పినీడి** ఒకరు కావడం విశేషం. సున్నితమైన అంశాలకు మంచి వినోదాన్ని జోడిస్తూ నిర్మించిన ఈ సినిమా సైతం మంచి ఆదరణతో భారీ వసూళ్ళని రాబట్టింది.
- ఊహించని కలెక్షన్లు సాధించి పాన్ ఇండియా మార్కెట్‌ని కూడా నివ్వెరపోయేలా చేసిన సినిమా 'హను-మాన్'. తేజా సజ్జా, ప్రశాంత్‌వర్మ కాంబోలో భర్త నిరంజన్‌రెడ్డితో కలిసి **చైతన్య రెడ్డి** ఈ సినిమా తీశారు. ఇది ఏకంగా రూ.350కోట్ల గ్రాస్‌ని కలెక్ట్ చేసి సంచలన విజయం సాధించింది.
- ఇక దర్శకుడు త్రివిక్రమ్ సతీమణి **సాయి సౌజన్య** సైతం ఈ ఏడాది సక్సెస్‌ని సాధించిన వారిలో ఉన్నారు. దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో 'లక్కీభాస్కర్' చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ భాగస్వామ్యంతో నిర్మించారు. అటు ప్రేక్షకుల ప్రశంసలతోపాటు ఇటు మంచి వసూళ్ళని ఈ సినిమా సొంతం చేసుకుంది.
- **డా.హరిత గోగినేని** వంటి పలువురు దర్శకత్వ ప్రతిభతోనూ ప్రేక్షకుల్ని మెప్పించారు. విడుదలకు ముందే దాదాపు 70 ప్రతిష్టాత్మక అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో అవార్డులు పొందిన 'ఫియర్' సినిమాకి హరిత గోగినేని దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి థియేటర్లలోనూ మంచి ఆదరణ లభించింది. మొత్తమ్మీద టాలీవుడ్‌ని గర్వపడేలా చేసిన ఈ మహిళాశక్తికి జయహో చెప్పాల్సిందే.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

కేంద్ర హెూం మంత్రి పదవికి
అమిత్ షా అనర్హుడు

- ఆయనను పదవి నుంచి తొలగించాల్సిందే
- వామపక్ష నేతల డిమాండ్ • దేశవ్యాప్తంగా ఆందోళనలు




నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగ రూపశిల్పి బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా కేంద్ర హెూంమంత్రి పదవికి అనర్హుడని, ఆయనను ఆ పదవి నుంచి సత్వరమే తొలగించాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను కించపరుస్తూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన బేషరతుగా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. పశ్చిమబెంగాల్, త్రిపుర, బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, హర్యానా, రాజస్థాన్, ఒడిశా, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, గోవా, పంజాబ్, మహారాష్ట్ర, ఢిల్లీ, పుదుచ్చేరితో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడారు. అమిత్ షా వ్యాఖ్యలు భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా హిందుత్వ దాడిలో భాగమని స్పష్టం చేశారు. అమిత్ షాకు రక్షణగా ప్రధాని నరేంద్రమోడీ అనుసరిస్తున్న వైఖరి దారుణమన్నారు. ఈ విషయంలో ఎన్డీఏ పక్షాలు ఆలోచన చేయాలని తెలిపారు. సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐఎంఎల్ (లిబరేషన్), ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు ఉమ్మడిగా ఇచ్చిన పిలుపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, ఇతర వామపక్ష నేతలు సిద్ధేశ్వర్ శుక్లా, అమర్జీత్ కౌర్, సుచేతాడే, ఆర్ ఎస్ దాగర్, ధర్మేంద్ర కుమార్ తదితరులు మాట్లాడారు. ఒడిశాలోని భువనేశ్వర్, కటక్, బెర్హంపూర్, జాజ్‌పూర్‌లో జరిగిన ఆందోళనల్లో వందలాది మంది పాల్గొన్నారు. హర్యానాలోని జిల్లా కేంద్రాల్లో నిరసనలు జరిగాయి. త్రిపురలో అగర్తల, బలోనియా, ఉదయ్‌పూర్, కమలాపూర్‌లలో భారీ నిరసన ర్యాలీలు జరిగాయి. పశ్చిమ బెంగాల్‌లోని రాయ్‌గంజ్‌లో వామపక్ష పార్టీలు రోడ్డును దిగ్బంధించాయి.

'గోటితో పోయేదాన్ని...'

- సంధ్య థియేటర్ సంఘటనపై పవన్‌కల్యాణ్
- జనవరి నుంచి నెలలో 14 రోజులు జిల్లాల పర్యటనలు



అమరావతి : 'గోటితో పోయే దానిని గొడ్డలిదాకా తెచ్చుకు న్నారు' అని సంధ్య థియేటర్ సంఘటనపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. మీడియా ప్రతినిధులతో సోమవారం ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఆ సంఘటన దురదృష్టకరమని అన్నారు. తొక్కిసలాటలో మరణించిన మహిళ కుటుంబాన్ని పుష్ప సినిమా యూనిట్ పరామర్శించి క్షమాపణలు కోరి ఉంటే బాగుండేదని చెప్పారు. అలా చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. క్షమాపణ చెప్పడానికి అనేక విధానాలు ఉంటాయని, వీటిలో ఎక్కడో మానవతా దృక్పథం లోపించిందని చెప్పారు. ఈ సమస్యలో హీరోను ఒక్కరినే ఒంటరిని చేశారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సినీపరిశ్రమతో గౌరవం, మర్యాదతో వ్యవహరించిందన్నారు. పుష్ప సినిమా విషయంలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి చాలా ప్రోత్సాహం అందించారని, స్పెషల్ షోలు, టికెట్ రేట్స్ పెంచుకోవడానికి అనుమతిచ్చారన్నారు. చట్టం అందరికి ఒకేలా పనిచేస్తుందనే విధంగా రేవంత్‌రెడ్డి వ్యవహరించారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక నుండి నెలలో 14 రోజులు తన పేషీతోసహా తాను జిల్లాల్లో పర్యటిస్తానని చెప్పారు. సమస్యలకు సత్వర పరిష్కారం, భిన్న పరిస్థితులపై అధ్యయనం చేస్తామన్నారు. మొదటి ఆరు నెలల్లో పాలనపై పట్టు పెంచుకున్నామని గత ఐదేళ్లలో పట్టుతప్పిన కార్యనిర్వాహక వ్యవస్థను గాడిలో పెడుతున్నామన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యనిర్వాహక వ్యవస్థను దిగజార్చా రని, గత ఐదేళ్లలో బ్యూరోక్రసీ అట్టడుగుకు దిగజారిం దని కేంద్రం నుంచి ఓ అధ్యయన నివేదిక వచ్చిందన్నారు. తప్పు జరుగుతున్నప్పుడు ఎందుకు మాట్లాడలేకపోయారని కలెక్టర్ల సదస్సులో అడిగితే ఎవరూ నోరు మెదపలేకపోయారన్నారు. అటవీశాఖ అధికారులపై ప్రజల్లో ప్రతికూలమైన అభిప్రాయం వ్యక్తమవుతోందని, నిజాయితీ గల అధికారుల పనితీరుతోనే అధిగమించాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో ఎర్రచందనం ఖాళీచేసేశారని చెప్పారు. జనసేనలో నాగబాబు తనతో సమానంగా పనిచేశారని, తొలుత అనకాపల్లి ఎంపి అభ్యర్థిగా, అనంతరం రాజ్యసభకు అనుకున్నామని అన్నారు. కూటమి పొత్తులో భాగంగా గెలిచే సీటును బిజెపికి వదులుకున్నామన్నారు. అందుకే నాగబాబుకు ఎమ్మెల్సీ ఇస్తున్నామన్నారు.

రూ.21వేల కోట్లు దాటిన రక్షణ ఎగుమతులు

- స్కార్పియన్ జలాంతర్గాములపై రెండు ఒప్పందాలు



మావు(మధ్యప్రదేశ్) : దశబ్ద కాలంలో భారతదేశ రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ.21వేల కోట్లను దాటాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం చెప్పారు. దశాబ్ద కాలం క్రితం రూ.2వేల కోట్ల మేరకే ఎగుమతులు వుండేవన్నారు. 200ఏళ్ళ నాటి మావు కంటోన్మెంట్‌లో ఆర్మీ వార్ కాలేజ్ (ఎడబ్ల్యుసి)లో అధికారులను ఉద్దేశించి సింగ్ ప్రసంగించారు. 2029నాటికి రూ.50వేల కోట్ల రక్షణ ఎగుమతులను సాధించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భవిష్యత్ సవాళ్ళను ఎదుర్కొనేందుకు సైనికులను సన్నద్ధం చేయడంలో మిలటరీ శిక్షణా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. యుద్ధ రంగంలో కూడా సమూలమైన మార్పులు అనేకం చోటు చేసుకున్నాయన్నారు. సమాచార యుద్ధం, కృత్రిమ మేధస్సు ప్రాతిపదిక సాగే యుద్ధం, పరోక్ష యుద్ధాలు, ఎలక్ట్రో మాగ్నటిక్ యుద్ధం, రోదసీ యుద్ధం, సైబర్ దాడులు ఇలా సాంప్రదాయేతర పద్ధతుల్లో యుద్ధాలు చేయడం పెను సవాలుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

రెండు ఒప్పందాలపై సంతకాలు

స్కార్పియన్ తరహా జలాంతర్గాములకు సంబంధించిన రూ.2,867 కోట్ల విలువైన రెండు ఒప్పందాలపై రక్షణ శాఖ సోమవారం సంతకాలు చేసింది. డిఆర్‌డిఓ అభివృద్ధిపరిచిన ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్ మాడ్యూల్ (ఎఐపి) నిర్మాణానికి సంబంధించిన ఒప్పందం ఒకటి కాగా, రెండోది ఎలక్ట్రానిక్ హెవీ వెయిట్ టార్పెడో (ఇహెచ్‌డబ్ల్యుటి)కి సంబంధించిన ఒప్పందం.

ఎన్నికల్లో పోటీకి ఆర్థిక సహకారం అందించండి

ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా

- ఇచ్చే ప్రతిపైసా విద్యా, ఉద్యోగ పురోగతికి ఖర్చు చేస్తామంటూ ప్రజలకు విజ్ఞప్తి
- 'ఎంఎస్4జంగ్ పుర' హ్యాష్ ట్యాగ్ తో ప్రచారం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు ఆర్థిక సహకారం అందించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా కోరారు. అందులో భాగంగా ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రజల నుంచి ఆర్థిక సహకారం కోరుతూ సోమవారం ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. దీనిద్వారా ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసారి కూడా సమర్ధవంతంగా ప్రచారం చేసేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. "నేను ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారీ మీ ఆర్థిక సహకారం వల్లే విజయం సాధించా. ఈసారి కూడా నాకు మీ ఆర్థిక సహకారం కావాలి. మీరు విరాళంగా ఇచ్చే ప్రతి రూపాయి ఢిల్లీలో ఉద్యోగ, విద్యా రాజకీయాల అభివృద్ధికి దోహదపడుతుంది. నగరంలో విద్య, పాలనా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలకు ఆర్థిక వనరులు కూడా మూలంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు. కాగా, తన ప్రచారాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆప్ సోషల్ మీడియా ప్లాట్ ఫాంపై 'ఎంఎస్4జంగ్ పుర' అనే హ్యాష్‌ట్యాగ్‌ను ప్రారంభించింది. మరోవైపు "సపోర్ట్ అండ్ ఫండ్ మనీశ్ సిసోడియా" అనే నినాదంతో నీలం, పసుపు పోస్టర్ విడుదల చేసింది. అయితే 2015 నుంచి పటపర్‌గంజ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సిసోడియా, ఈసారి జంగ్‌పురా నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు.

అర్చకులకు నెలకు రూ. 18 వేల గౌరవ వేతనం...: ఆప్ చీఫ్ కేజ్రీవాల్

నిరుద్యోగ మహిళలకు నెలవారీ స్టైఫండ్ స్కీంపై భారీ వివాదం నడుస్తోన్న వేళ ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరో స్కీం ప్రకటించారు. హిందు, సిక్కు పూజారులు (అర్చకులకు) నెలకు రూ.18 వేల గౌరవ వేతనం అందించే కొత్త పథకాన్ని ప్రకటించారు. సోమవారం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. 'హిందు పూజారులు, గురుద్వారా గ్రంథిలు మన ఆచారాలను భవిష్యత్ తరాలకు అందజేయడంలో కీలక పాత్ర పోశిస్తున్నారు. నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. అయితే దురదృష్టవశాత్తు వారి ఆర్థికస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదు. కానీ నిబంధనల ప్రకారం వీరికి నెలకు రూ.18 వేల గౌరవ వేతనం ఇవ్వొచ్చు.' అని చెప్పారు. 'పూజారీ గ్రంథి సమ్మాన్ యోజన' పేరుతో ప్రవేశపెట్టనున్న ఈ స్కీం రిజిస్ట్రేషన్ నేటి (మంగళవారం) నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు. కన్నాట్ ప్లేస్ లోని ప్రాచీన హనుమాన్ మందిరాన్ని దర్శించుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కేజ్రీవాల్ వెల్లడించారు. కాగా మరోసారి ఢిల్లీ పీఠాన్ని దక్కించుకునేందుకు ఆప్ వరుసగా ఉచిత పథకాలను ప్రకటిస్తోంది. మరోసారి అధికారంలోకి వస్తే వృద్ధుల కోసం సంజీవని, మహిళల కోసం మహిళా సమ్మాన్ యోజన స్కీంలను అమలు చేస్తామని కేజ్రీవాల్ ప్రకటించారు. ఈ నెల ప్రారంభంలో మహిళలకు నెలకు రూ. 2,100 స్టైఫండ్ అందించే మహిళా సమ్మాన్ స్కీంను ఆయన ప్రకటించారు. ఇందుకు తగ్గట్లుగానే ఆప్ నేతలు ఈ స్కీం కోసం రిజిస్ట్రేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు. అయితే మరోసటి రోజే కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ 'మహిళా సమ్మాన్' స్కీం ఉనికిలో లేదని, అందువల్ల వ్యక్తిగత డేటాను పంచుకోవద్దని కోరింది. దీంతో అసలు వివాదం మొదలైంది.

మహిళలకు ఉపాధి కల్పిస్తే మూతపడక తప్పదు

- ఎన్‌జిఓలకు తాలిబన్ల హెచ్చరిక



కాబూల్ : ఆఫ్గనిస్తాన్‌లో తాలిబన్ల అరాచకాలకు అంతు లేకుండా పోతోంది. ఇప్పటికే మహిళలపై అనేక రకాలైన ఆంక్షలు అమలు చేస్తూ వచ్చిన తాలిబన్ నాయకత్వం తాజాగా దేశంలోని స్వచ్ఛంద సంస్థలకు ఒక హెచ్చరిక జారీ చేసింది. మహిళలకు ఉపాధి కల్పించడం ఆపాలని లేదా ఆ సంస్థలను మూసుకోక తప్పదని హెచ్చరించింది. మహిళలకు ఉపాధి కల్పిస్తున్న దేశ, విదేశీ ప్రభుత్వేతర సంస్థలు, గ్రూపులన్నీ వెంటనే మూతపడతాయని పేర్కొంది. తలపై హిజాబ్, బురఖాలు సరిగా ధరించనందున ఆఫ్ఘన్ మహిళలకు ఉపాధి కల్పించడాన్ని ఆపేయాలంటూ రెండేళ్ళ క్రితమే ఎన్‌జిఓలను తాలిబన్లు ఆదేశించారు. వాటిని అమలు చేయని సంస్థలు తాజా ఆదేశాలతో మూతపడతాయి. ఈ మేరకు ఆర్థిక వ్యవహారాల శాఖ ఆదివారం రాత్రి ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టింది. తాజా ఆదేశాలను అమలు చేయని పక్షంలో ఇక ఆ ఎన్‌జిఓలకు దేశంలో పనిచేసేందుకు లైసెన్స్ కోల్పోతాయని హెచ్చరించింది. ఇప్పటికే బహిరంగ ప్రదేశాల్లో కనిపించరాదని, అనేక ఉద్యోగాలు చేయరాదని మహిళలపై తాలిబన్లు ఆంక్షలు విధించారు. ఆరవ తరగతి తర్వాత ఆడపిల్లలు చదువుకోరాదంటూ వారిని ఇళ్ళకే కట్టడి చేశారు.

ఇళ్ళకు కిటికీలు వద్దు

మహిళలు ఇళ్ళల్లో పనిచేసుకుంటూ వుంటే బయటకు కనిపించరాదని, అలా కనిపించేందుకు ఆస్కారముండే కిటికీలను నిర్మించరాదని తాలిబన్ నేత ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. పాత ఇళ్ళకు వుండే కిటికీలను శాశ్వతంగా మూసివేయాలని, కొత్త ఇళ్ళలో అసలు కిటికీల నిర్మాణమే వద్దని ఆ ప్రకటన స్పష్టం చేసింది.

మనుస్మృతి దహనం చేశారనే ఆరోపణలతో..

- బనారస్ యూనివర్సిటీలో 13 మంది విద్యార్థుల అరెస్టు
- ఏటీఎస్‌తో విచారణ



లక్నో : మనుస్మృతి దహనం చేశారనే ఆరోపణలతో వారణాసిలో బనారస్ హిందూ యూనివర్సిటీ(బీహెచ్‌యూ)కి చెందిన 13 మంది విద్యార్థులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. వీరికి వారణాసి జిల్లా కోర్టు 14 రోజుల కస్టడీ విధించింది. మనుస్మృతి దహన్ దివస్ సందర్భంగా డిసెంబరు 25న మనుస్మృతిని బీహెచ్‌యూలో భగత్ సింగ్ స్టూడెంట్స్ మోర్చా (బీఎస్ఎం)కు చెందిన విద్యార్థులు దహనం చేశారు. (1927లో డిసెంబరు 25న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనుస్మృతిని దహనం చేసిన సందర్భంగా ప్రతీ ఏడాది డిసెంబరు 25న 'మనుస్మృతి దహన్ దివస్'గా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే). దీనిపై 13 మంది విద్యార్థులపై తీవ్ర అభియోగాలతో డిసెంబరు 26న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బీహెచ్‌యూ భద్రతా అధికారి ఓం ప్రకాష్ తివారీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా లంక పోలీస్‌స్టేషన్‌లో ఈ ఎఫ్ఐఆర్ దాఖలయింది. బీఎస్ఎం విద్యార్థులు, అధ్యాపకులు, భద్రతా సిబ్బందిపై దాడి చేశారని, ఇతర విద్యార్థులపై కూడా ఘర్షణకు దిగారని ఫిర్యాదులో ఆరోపించారు. సామరస్య వాతావరణానికి భంగం కలిగించేవిధంగా ప్రవర్తించారని ఆరోపించారు.ఈ ఫిర్యాదు ఆధారంగా బీఎన్ఎస్‌లోని తీవ్ర నిబంధనలు సెక్షన్ 132 (ప్రభుత్వ ఉద్యోగులను వారు విధుల నిర్వర్తించకుండా నిరోధించడం, దాడి చేయడం), సెక్షన్ 196(1) (మతం, జాతి, పుట్టిన ప్రాంతం, నివాసం, భాష మొదలైన వాటి ఆధారంగా ప్రజల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం), సెక్షన్ 299 (మత విశ్వాసాలను అవమానించడం, మతపరమైన భావాలను రెచ్చగొట్టడం) వంటి వాటితో కేసు నమోదు చేశారు. ఇందులో కొన్ని సెక్షన్ల ప్రకారం కనీసం పదేండ్ల వరకూ జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఈ కేసులో ముఖేష్ కుమార్, సందీప్ జైస్వాల్, అమర్ శర్మ, అరవింద్ పాల్, అనుపమ్ కుమార్, లక్ష్మణ్ కుమార్, అవినాష్, అరవింద్, శుభం కుమార్, ఆదర్స్, ఇప్సితా అగర్వాల్, సిద్ధి తివారీ, కాత్యాయని బి రెడ్డిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు వీరికి కస్టడీ విధించడంతో చౌకాఘాట్‌లోని జిల్లా జైలుకు తరలించారు. అక్కడ వీరిని యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) బృందం విచారణ చేస్తోంది.కాగా, విద్యార్థులను అరెస్టు చేయడాన్ని బిఎస్ఎం తీవ్రంగా ఖండించింది. విద్యార్థుల అరెస్టును బ్రాహ్మణీయ, హిందూత్వ శక్తుల ఆదేశంతో జరిగిన అణచివేత చర్యగా విమర్శించింది. యూనివర్శిటీ సిబ్బంది చేసిన కల్పిత ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది.మా గొంతును ఎంతగా అణచివేయాలని చూస్తే, అది మరింత దృఢంగా నిలుస్తుందని స్పష్టం చేసింది.అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.అలాగే విద్యార్థుల నుంచి సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారని,వారి కుటుంబ సభ్యులకు అరెస్టు సమాచారం కూడా ఇవ్వలేదని, ఇది సుప్రీంకోర్టు,జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలను స్పష్టంగాఉల్లంఘించడమేనని పేర్కొంది.

గాజాలో ఆస్పత్రులపై దాడులు ఆపండి



డబ్ల్యూహెచ్ఓ చీఫ్ పిలుపు

- చలితో మరో నెలరోజుల చిన్నారి మృతి
- ఇప్పటివరకు ఆరుగురు శిశువుల కన్నుమూత
- గత 24గంటల్లో 27మంది పాలస్తీనియన్లు మృతి



జురిచ్ : గాజాలో ఆస్పత్రులపై దాడులను ఆపాల్సిందిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనామ్ గెబ్రెయెసెస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. గత కొద్ది రోజులుగా ఒక దాని తర్వాత మరొకటి వరుసగా ఆస్పత్రులపై దాడులు చేస్తూ విధ్వంసాన్ని సృష్టించడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత వారంలో ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ ఆస్పత్రిపై ఇజ్రాయిల్ సైన్యం వరుస దాడులకు దిగి, మెజారిటీ భాగాన్ని అగ్నికి ఆహుతి చేసింది. ఆస్పత్రులన్నీ కదన రంగాలుగా మారాయని, ఆరోగ్య వ్యవస్థ తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని గెబ్రెయెసెస్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ప్రస్తుతమున్న తరుణంలో గాజా ప్రజలకు పూర్తి స్థాయిలో ఆరోగ్య సంరక్షణ వుండాలని ఆయన పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన మానవతా సాయం కూడా అందించాల్సి వుందన్నారు. తక్షణమే కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. డబ్ల్యూహెచ్ఓ, ఇతర భాగస్వాములతో కలిసి గాజా ప్రజలకు మౌలికంగా అవసరమైన వైద్య సరఫరాలు, ఆహారం, తాగు నీరు వంటివి సరఫరా చేస్తోందని, కానీ ఇజ్రాయిల తన దాడులతో వాటిని అడ్డం గొడుతోందని విమర్శించారు. కమల్ అద్వాన్ ఆస్పత్రిపై దాడి చేసి అదుపులోకి తీసుకున్న డైరెక్టర్ హుస్సేన్ అబూ సఫియాను ఆర్మీ స్థావరంలో వుంచినట్లు మీడియా వార్తలు తెలిపాయి. మరోవైపు గాజాలో గత 24గంటల్లో 27మంది పాలస్తీనియన్లు మరణించగా, 149మంది గాయపడ్డారు. అత్యంత శీతల గాలులతో నెల రోజుల బాలుడు గాజాలోని అల్ అక్సా ఆస్పత్రిలో కన్నుమూసింది. అంతకు ముందు రోజే ఆ బాలుడి కవల సోదరుడు ఇదే కారణంతో చనిపోయాడని మీడియా వార్తలు తెలిపాయి. ఇప్పటివరకు చలి కారణంగా గాజాలో ఆరుగురు శిశువులు మరణించారు. ఒక వృద్ధుడు కూడా కన్నుమూశాడని అధికారులు తెలిపారు. మానవతా సాయం రవాణా చేస్తున్న ట్రక్కుల విషయంలో సరైన ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ప్రపంచ ఆహార కార్యక్రమాన్ని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం విమర్శించింది. ట్రక్కులకు సరైన ఎస్కార్టు వుండడం లేదని, వాటి గురించి సమాచారం కూడా అందుబాటులో వుండడం లేదని విమర్శించింది. ఇదంతా డబ్ల్యూఎఫ్‌పీ నిర్వహణా వైఫల్యమని వ్యాఖ్యానించింది.

బిజినెస్

విల్మర్‌తో భాగస్వామ్యానికి అదానీ గ్రూపు గుడ్‌బై..!



న్యూఢిల్లీ : సింగపూర్‌కు చెందిన విల్మర్ ఇంటర్నేషనల్‌తో భాగస్వామ్యంగా ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ అదానీ విల్మర్ లిమిటెడ్ నుంచి అదానీ గ్రూప్ బయటికి రానుంది. ఈ వంట నూనెల కంపెనీలో ఇరువురికి 43.97 శాతం చొప్పున వాటాలున్నాయి. అదానీ విల్మర్‌లోని తమ పూర్తి వాటాలను విక్రయించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ సోమవారం వెల్లడించింది. అదానీ విల్మర్‌లో తమకు ఉన్న 31.06 శాతం వాటాను విల్మర్ ఇంటర్నేషనల్‌కు విక్రయించడంతో పాటుగా.. మిగతా 13 శాతం వాటాను పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనల మేరకు బహిరంగ మార్కెట్‌లో విక్రయించనున్నట్లు తెలిపింది. ఈ విలువ దాదాపు రూ.16వేల కోట్ల పైగా ఉంటుందని అంచనా. 2025 మార్చి 31 నాటికి ఈ విక్రయ ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉందని అదానీ గ్రూపు తెలిపింది. ఈ భాగస్వామ్యం నుంచి వైదొలుగుతోన్న నేపథ్యంలోని ఆ కంపెనీ బోర్డులో నుంచి తమ డైరెక్టర్లు తప్పుకోనున్నారని పేర్కొంది.

మారుతి డిజైర్ @ 30 లక్షల అమ్మకాలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన సెడాన్‌లలో ఒక్కటైన డిజైర్ మోడల్‌లో 30 లక్షల యూనిట్లను విక్రయించినట్టు ఆ కంపెనీ తెలిపింది. ఇది తమకు ప్రధాన మైలురాయి అని ఆ సంస్థ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. తమ కార్ల శ్రేణీలో డిజైర్ ఒక కీలకమైన మోడల్‌గా ఉందని తెలిపింది. తొలిసారి 2008లో దీన్ని ఆవిష్కరించామని పేర్కొంది. 2015 నాటికి 10 లక్షల యూనిట్లను, 2019 నాటికి 20 లక్షల యూనిట్లను విక్రయించినట్టు పేర్కొంది. 17 ఏండ్లలో 48 దేశాలకు 2.60 లక్షల యూనిట్ల పైగా ఎగుమతి చేసినట్టు వెల్లడించింది.

మహిళల కోసం ఐసీఐసీఐ ప్రూ ప్రత్యేక పాలసీ

న్యూఢిల్లీ : జీవిత బీమా పరిశ్రమలో తొలిసారి మహిళల కోసం ప్రత్యేక ఆరోగ్య పాలసీ 'ఐసిఐసిఐ ప్రూ విష్'ను విడుదల చేసినట్టు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ తెలిపింది. ఇందులో రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార, గర్భాశయ క్యాన్సర్లు, గుండె జబ్బుల వంటి క్లిష్టమైన వ్యాధుల నిర్ధారణపై ఆరోగ్య కవర్ మొత్తంలో 100 శాతం తక్షణమే చెల్లించనున్నట్లు వెల్లడించింది. ప్రీమియం మొత్తం 30 సంవత్సరాల పాటు స్థిరంగా ఉంటుందని పేర్కొంది. ఇందులో ప్రీమియం హాలీడే.. అంటే కస్టమర్ ప్రీమియం చెల్లింపు వ్యవధిలో ఎప్పుడైనా 12 నెలల పాటు ప్రీమియంలను చెల్లించకుండా ఉండే అవకాశం ఉందని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ప్రొడక్ట్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా తెలిపారు. ఇందులో ప్రసూతి సమస్యలు, నవజాత పుట్టుకతో వచ్చే వ్యాధులకు సంబంధించిన కవర్ తీసుకునే అవకాశాన్ని కూడా అందిస్తున్నామన్నారు.

అమెజాన్ కొత్త ఏడాది ఆఫర్లు

బెంగళూరు : వచ్చే కొత్త ఏడాదిలో ఇంటిని మెరుగుపర్చుకోవడం కోసం ప్రత్యేకంగా హోమ్ షాపింగ్ స్ప్రీ ఆఫర్లను అందిస్తున్నట్టు అమెజాన్ ఇండియా తెలిపింది. 2025 జనవరి 3 నుంచి 7 వరకు నిర్వహించనున్న ఈ సేల్‌లో ప్రత్యేక కూపన్లు సహా క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చని పేర్కొంది. ఓరియెంట్, హావెల్స్, బాష్, లైఫ్ లాంగ్ తదితర ఎన్నో ప్రముఖ బ్రాండ్స్ నుంచి బెస్ట్ సెల్లర్స్ పైన ఉత్తేజభరితమైన డీల్స్ ఆనందించవచ్చని పేర్కొంది. వాటర్ హీటర్లు, కిచెన్ ఉపకరణాలు, ఫర్నీచర్‌పై ఆకర్షణీయ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని తెలిపింది.

సామ్‌సంగ్ నుంచి డజన్‌పైగా ఏసీ మోడళ్లు..!


గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ ఇండియా వచ్చే వేసవి కాలం మార్కెట్‌ను అందిపుచ్చుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా 2025లో డజన్ పైగా కొత్త ఎయిర్ కండీషనర్ల మోడళ్లను విడుదల చేయాలని యోచిస్తోన్నట్టు పేర్కొంది. దీంతో దేశంలో రూమ్ ఏసీ విభాగంలో కీలక బ్రాండ్‌గా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపింది. వచ్చే ఏసీ అమ్మకాల్లో 20 శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేస్తోంది.

మార్చి నాటికి 3 శాతం జీఎన్‌పీఏలు

- ఆర్బీఐ రిపోర్ట్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ ముగింపు నాటికి భారత బ్యాంక్‌ల స్థూల నిరర్థక ఆస్తులు 2.6 శాతంగా ఉన్నాయని ఆర్బీఐ తన ఫైనాన్సీయల్ స్టెబిలిటీ రిపోర్ట్‌లో వెల్లడించింది. 2026 మార్చి ముగింపు నాటికి 3 శాతానికి చేరొచ్చని అంచనా వేసింది. ప్రజల అధిక అప్పులు, దీర్ఘకాలిక భౌగోళిక రాజకీయ వైరుధ్యాలు ఆర్థిక స్థిరత్వానికి ప్రమాదాలను కలిగించొచ్చని విశ్లేషించింది. సోమవారం ఆర్‌బిఐ విడుదల చేసిన ఈ రిపోర్ట్‌లో.. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జిఎన్‌పిఎ 2.6 శాతానికి తగ్గి 12 ఏండ్ల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 0.6 శాతానికి పరిమితమయ్యాయి.ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ చెల్లింపుల విషయంలోనూ పొరబాట్లకు ఆస్కారం లేకుండా ఇకపై ఆయా చెల్లింపుల వ్యవస్థల ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేసేటప్పుడు అవతలి వ్యక్తి పేరు కనిపించనుందని ఆర్బీఐ తెలిపింది. ఈ సదుపాయాన్ని అభివృద్ధి చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌కు (ఎన్‌పీసీఐ)కి సూచించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1కల్లా దీన్ని అందుబాటులోకి తెచ్చేలా చూడాలని పేర్కొంది. ప్రస్తుతం యూపీఐ చెల్లింపుల్లో ఈ సదుపాయం ఉంది.

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పించిన కేటీఆర్



వతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అజ్మీర్ దర్గాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చాదర్ సమర్పించారు. ప్రతి ఏటా ఉర్సు సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి చాదర్‌ను సమర్పించడం ఆనవాయితిగా వస్తోంది. ఈ క్రమంలో సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి మహమూద్ అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మత పెద్దలకు చాదర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

- టీజీఎస్‌డబ్ల్యుఆర్ఈఐ కార్యదర్శి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భువనగిరి ఆర్మ్డ్ పోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కళాశాల కనుమరుగవుతుందని జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని తెలంగాణ ప్రభుత్వం, టీజీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ కళాశాలని మరింతగా బలోపేతం చేస్తూ ఆ ఫలాలను ఎక్కువ మంది విద్యార్థినులకు అందించాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తుందని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా లోని లక్ష్మీదేవిగూడం, బీబీనగర్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ ఆర్మ్డ్ పోర్సెస్ ప్రపరటరీ డిగ్రీ కళాశాలని ఘటకేసర్ ప్రాంతంలోని సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలల క్యాంపస్‌కి తరలించి రెగ్యులర్ అండర్ గ్రాడ్యూయేట్ కోర్సులతో పాటు అదనంగా మిలిటరీ విద్య శిక్షణని విద్యార్థినులందరికీ అందించాలని సొసైటీ నిర్ణయించిందని పేర్కొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల నిరసన
- దిష్టిబొమ్మల దహనం



నవతెలంగాణ- విలేకరులు

అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఆయా పార్టీలు, ప్రజాసంఘాల నేతలు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మునుగోడు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో, నకిరేకల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. చిట్యాలలో అంబేద్కర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేతెపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. సూర్యాపేట స్థానిక కొత్త బస్టాండ్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. సూర్యాపేటలో స్థానిక కొత్త బస్టాండ్ ఏరియాలో, బస్సుల్లో ప్రయాణికులకు బీజేపీ ఫాసిస్టు విధానాలపై కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. కోదాడ పట్టణంలో నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూ డిమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్, సీపీఐ (ఎంఎల్) న్యూ డిమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. భద్రాచలం, చర్ల, పినపాక, మణుగూరు, దమ్మపేట, సుజాతనగర్, ఇల్లందు, అశ్వారావుపేట మండలాల్లో అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం చేశారు. హైదరాబాద్ శాలిబండ చౌరస్తా నుంచి చార్మినార్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్‌ను అవమానపరచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్ డిమాండ్ చేశారు. మల్కాజిగిరి మండలం ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. హనుమకొండ, ములుగు, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి ధర్నా చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

- మహిళలపై లైంగికదాడులు, హింసను అరికట్టాలి
- ఇందిరమ్మ ఇండ్లలో ఒంటరి మహిళలకు అవకాశం కల్పించాలి : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వంగా విఫలమైందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. దేశంలో మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న హింస, దాడులను అరికట్టడంలోనూ వైఫల్యం చెందిందని అన్నారు. సిద్దిపేటలో సోమవారం ఐద్వా జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి నవీన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా వర్క్‌షాప్‌లో మల్లు లక్ష్మి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక 11 ఏండ్ల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే 100% ధరలు పెరిగాయన్నారు. దేశంలో నిత్యం హత్యలు, లైంగికదాడులు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అదుపు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శిం చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అమలవుతున్న ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలకు కొంత ఉపశమనం ఉన్నప్పటికీ జనాభాకనుగుణంగా బస్సులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రతి నెలా మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసే ఎత్తడం లేదని, వెంటనే అమలు చేయాలని కోరారు. గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు సౌకర్యాన్ని ప్రతి పేద మహిళలకూ కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లల్లో ఒంటరి మహిళలకు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళ వ్యతిరేక విధానాలపై, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం రానున్న కాలంలో సర్వేలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అత్తిని శారద, ఉపాధ్యక్షులు మంజులత, సహాయ కార్యదర్శులు జాలిగపు శిరీష, ఇప్పకాయల శోభ, నాయకులు సంద బోయిన రాణి, దండు లక్ష్మి జ్యోతి, లక్ష్మి, శోభ, నరసవ్వ, మల్లవ్వ, విగ్నేశ్వరి, లావణ్య, వరలక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా సమ్మె విరమించండి

- సమస్యలను పరిష్కరించాలని సీఎం దృష్టికి తీసుకెళ్తాం : మంత్రులు పొన్నం, సీతక్క

సమగ్ర శిక్ష ఉద్యోగులు విధుల్లో చేరండి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గత 25 రోజులుగా సమ్మె చేస్తున్న దాదాపు 19,500 మంది సర్వ శిక్షా ఉద్యోగులు కేజీబీవి ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుతోపాటు వారి శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే సమ్మె విరమించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క కోరారు. సమ్మె చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారనీ, కేజీబీవీ పాఠశాలల్లో బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుతున్నారని గుర్తు చేశారు. సమ్మె చేస్తూ వారిని అక్కడ చదువుతున్న విద్యార్థులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయొద్దని సర్వ శిక్ష ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులతో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క సోమవారం హైదరాబాద్‌లో చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా వారు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రులకు నాయకులు వివరించారు. తాము కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో సుదీర్ఘకాలంగా చేస్తున్నామనీ, రెగ్యులరైజ్ చేయడం లేదా ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కూల్ అమలు చేయాలని మంత్రుల దృష్టికి తెచ్చారు. కేంద్రం పరిధిలో 60 శాతం రాష్ట్రం పరిధిలో 40 శాతం నిధులను భరించాల్సి ఉంటుందనీ, ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్య తెలంగాణలోనే లేదనీ, దేశవ్యాప్తంగా ఉందని కేంద్ర ప్రభుత్వం కోరితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి కేంద్రానికి ప్రతిపాదనలు పెడతామని వెల్లడించారు. 25 రోజులుగా కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేయడం వల్ల వారికి విద్యాబోధన జరగక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారనీ, తక్షణమే సమ్మె విరమించి ఉద్యోగులు విధుల్లో చేరాలని కోరారు. సమ్మె విరమిస్తే వారి సమస్యలపై ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పడిన ఉపసంఘంతో సమావేశానికి పిలుస్తామని వివరించారు. ఆ కమిటీలో తనతోపాటు మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కేశవరావు కూడా ఉన్నారని చెప్పారు. అందులో సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యల పై చర్చిస్తామన్నారు. ఆర్థికరేతర సమస్యలైన మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, సీఎల్స్ తదితర వాటిపై సాధ్యమైనంత వరకు ప్రభుత్వం పరిష్కరమయ్యేలా చూస్తుందని హామీ ఇచ్చారు. ఆర్థికపరమైన డిమాండ్లపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, పీఆర్టీయూటీఎస్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్, ఎం అంజిరెడ్డి, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, అసోసియేట్ ప్రెసిడెంట్ సురేందర్, సహదేవ్, నాయకులు ఖాదర్‌పాషా, క్రాంతి, అనిల్‌చారి తదితరులు పాల్గొన్నారు.


సమ్మెపై నేడు నిర్ణయం

మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క విజ్ఞప్తి మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం చేపట్టిన సమ్మెపై మంగళవారం నిర్ణయం తీసుకోవాలని ఆ సంఘం నిర్ణయించింది. సమ్మెను కొనసాగించాలా?, విరమించాలా?అనే అంశంపై నాయకులు చర్చించి నిర్ణయం తీసుకుంటారు.

ఏపీలో ప్రయివేటుకు హారతి

'గోదావరి-బనకచర్ల'లో సర్కారు కొత్త విధానం

- పదేళ్లపాటు నిర్వహణ కాంట్రాక్టు సంస్థలకే
- ఆదాయం తగ్గితే ప్రభుత్వం భర్తీ చేస్తుంది
- గేమ్ ఛేంజర్‌గా అభివర్ణించిన చంద్రబాబు



అమరావతి : తెలుగుతల్లికి జలహారతిగా రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టు ఆచరణలో ప్రైవేటు రంగానికి హారతిగా మారనుంది. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన వివరాల మేరకు ఈ ప్రాజెక్టును నిర్మించడంతో పాటు, పదేళ్లపాటు వారే నిర్వహించనున్నారు. ఆ తరువాతే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి రానుంది. హైబ్రిడ్ పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. హైబ్రిడ్ పద్ధతితోపాటు బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బిఒటి) విధానంలో రాష్ట్రంలో నిర్మించనున్న మొట్టమొదటి ప్రాజెక్టు ఇదే అవుతుంది. నిర్వహణ కోసం ప్రైవేటు సంస్థలు ఏ విధానాన్ని అవలంభిస్తాయన్న విషయాన్ని సిఎం స్పష్టత ఇవ్వలేదు. అయితే, లోటు ఏర్పడితే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పేరిట ప్రభుత్వమే భర్తీ చేస్తుంది అని ఆయన చెప్పారు. దీనికి సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును మరో మూడు నెలల్లో తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలనూ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పద్ధతిలో ఆయన మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ ప్రాజెక్టుకు తెలుగుతల్లికి జలహారతి అని పేరుపెట్టినట్లు తెలిపారు. దాదాపుగా 80 వేల కోట్ల రూపాయలతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా మారుతుందని చెప్పారు.

ప్రైవేటుకు ఇలా...

పలువురు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సిఎం జవాబిస్తూ.. టెండర్ల పద్ధతిలో ప్రైవేటు కాంట్రాక్టర్లను ఆహ్వానించి ప్రాజెక్టును వారే నిర్మించి నిర్వహించేలా చూస్తామని చెప్పారు. మొత్తం ప్రాజెక్టును ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తారా లేక ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందా అన్న ప్రశ్నకు ప్రాజెక్టు ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, నిర్వహణ ప్రైవేటు వారు చేస్తారని చెప్పారు. వారు పెట్టిన ఖర్చుకు తగిన విధంగా ఏడాదికి కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుందని, దానిలో ఇంకా లోటు ఉంటే ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. 'నీటిని ప్రజలకు అందించే బాధ్యత వారు చూస్తారు. దానికయ్యే ఖర్చు మనం చెల్లిస్తాం' అని చెప్పారు. 'జాతీయ రహదారుల నిర్మాణం ప్రైవేటు వ్యక్తులకు ఇస్తామని, అక్కడ వచ్చిన డబ్బులు తీసుకుని నిర్వహిస్తారని ఉదహరించారు. బనకచర్ల ప్రాజెక్టు ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టు కావడంతో మనం డబ్బులు ఇస్తామని, కాంట్రాక్టర్లు నిర్వహిస్తారని చెప్పారు. చెల్లింపుల కోసం సెస్ ఏర్పాటు చేస్తారా? అని ప్రశ్నించగా ప్రజలపై భారం వేయబోమని, ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. ఇంత పెద్దమొత్తం ప్రభుత్వం ఎలా సమకూర్చుకుంటుందని మరో మీడియా ప్రతినిధి అడగగా కేంద్రం నుండి కొంత వస్తుందని, కొంత రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, అదే సమయంలో ప్రాజెక్టు వల్ల పంటలు పండితే రాష్ట్ర ఆదాయమూ పెరుగుతుందని, ఆ రూపంలో వచ్చే ఆదాయం ద్వారా కొంత చెల్లింపులు చేస్తామని అన్నారు.

ప్రాజెక్టు ఇలా....

ఒకటో సెగ్మెంట్లో (పోలవరం-ప్రకాశం బ్యారేజీ) రూ.13,511 కోట్లు, రెండో సెగ్మెంట్ (ప్రకాశం బ్యారేజీ నుండి బొల్లాపల్లి రిజర్వాయర్)కు రూ.28,560 కోట్లు, మూడో సెగ్మెంట్ (బొల్లాపల్లి నుండి బనకచర్ల)కు రూ.38,041 కోట్లు మొత్తం రూ.80,112 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. పోలవరం నుండి ప్రకాశం బ్యారేజీకి 38 వేల క్యూసెక్కులు, సాగర్, శ్రీశైలం ఇతర ప్రాంతాల నుండి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు 24 వేల క్యూసెక్కులు, బొల్లాపల్లి నుండి బనకచర్లకు 24 వేల క్యూసెక్కులు నీటిని పంప్ చేస్తామని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పది లిఫ్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూడు చోట్ల టన్నెల్స్ తవ్వాలని, వీటి మొత్తం దూరం 38.01 కిలోమీటర్లు ఉంటుందని పేర్కొన్నారు. 16.7 కిలోమీటర్లు పైపులైను ద్వారా మళ్లిస్తామని చెప్పారు. ప్రాజెక్టు కోసం 47,999 ఎకరాలు సేకరించాలని, అటవీ భూమి 17 వేల ఎకరాలు ఉందని తెలిపారు. బొల్లాపల్లి రిజర్వాయర్ పరిధిలో 15 వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని వివరించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే రాయలసీమ హార్టికల్చర్, కోస్తా ఆక్వాకల్చర్ హబ్‌గా తయారవుతాయని అన్నారు. వీటితోపాటు విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అవసరాలు తీరుతాయని, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటే

బీసీలు ఇప్పుడు గుర్తొచ్చారా..?

- బీసీల జపం చేస్తున్న కవిత
- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేఏ పాల్



నవతెలంగాణ-కంఠేశ్వర్

అధికారం కోల్పోయాక ఎమ్మెల్సీ కవిత బీసీల జపం చేస్తున్నారని, ఇన్నాళ్లకు బీసీలు గుర్తొచ్చారా అని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేఏ పాల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసీ వర్గాలు కవిత ఉచ్చులో పడొద్దని, బీఆర్ఎస్ పదేండ్ల అధికారంలో ఏనాడూ వారి సంక్షేమం పట్టించుకోలేదని చెప్పారు. నిజామాబాద్ నగరంలోని ఓ హోటల్లో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వప్రయోజనాల కోసమే కల్వకుంట్ల కవిత బీసీల జపం చేస్తున్నారని ఆరోపించారు. బీసీలు ఇప్పటికైనా రాజకీయ చైతన్యం తెచ్చుకొని కవిత ఉచ్చులో పడొద్దని సూచించారు.

ఎమ్మెల్సీ కవిత కొత్త వేషం కట్టి బీసీల నినాదం అందుకున్నారని, బీసీ వర్గాలకు తాను అండగా ఉండటంతో ఆమెకు పాల్ భయం పట్టుకుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీ నినాదాన్ని ఎంచుకున్నాయని విమర్శించారు. ఆ ఎన్నికల్లో తాము గెలిస్తే.. ప్రజాశాంతి పార్టీ తరఫున ప్రతి గ్రామంలో ఉచిత వైద్యం, విద్య ఏర్పాట్లు చేస్తామన్నారు. చనిపోక ముందు డి.శ్రీనివాస్ తనతో మాట్లాడారని, కాంగ్రెస్ పార్టీ బీసీలను పీసీసీ చీఫ్‌గా నియమిస్తూ.. బానిసలుగా మారుస్తోందని అన్నారని ఆరోపించారు. మధుయాష్కీ తనను కలిసిన తర్వాతే రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇచ్చారని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నాయని విమర్శించారు.

రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతా చర్యలపై సమీక్ష

- దక్షిణ మధ్య జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ రైలు కార్యకలాపాల భద్రత మరియు సమయపాలనపై తీసుకోవలసిన చర్యలపై సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమీక్ష నిర్వహించారు. అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం 6 డివిజన్లు అనగా సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డీఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షాసమావేశంలో పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ జోన్‌లో రైళ్ల రాకపోకల భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. భద్రతకు సంబంధించిన సిగ్నలింగ్, ఇంజనీరింగ్, స్టేషన్ ఆస్తుల కు సంబంధించిన భద్రత సంబంధిత ఆస్తుల పనితీరుపై దృష్టి సారించి క్షేత్ర స్థాయి తనిఖీలను ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

'పీఎం ఇంటర్న్‌షిప్'నకు లక్షల్లో అప్లికేషన్లు

- 1.27 లక్షల అవకాశాలకు 6.21 లక్షల దరఖాస్తులు

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ పైలట్ స్కీమ్‌కు లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. 1.27 లక్షల అవకాశాలకు గానూ 6.21 లక్షల దరఖాస్తులు వచ్చి చేరాయి. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇంటర్న్‌షిప్ కోసం ఎంపిక ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించింది. ఇంటర్న్‌షిప్ పథకం గత యూనియన్ బడ్జెట్‌లో ప్రకటించబడింది. ఐదేండ్లలో టాప్ 500 కంపెనీల్లో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించటం దీని లక్ష్యం. ఈ పథకం ద్వారా యువత భిన్న వృత్తులు, ఉపాధి అవకాశాలలో నిజ జీవిత వ్యాపార వాతావరణానికి గురవుతుందని కేంద్రం వివరించింది. "ఇంటర్న్‌లకు నెలకు రూ.5000(12 నెలలకు) ఆర్థిక సహాయం అందుతుంది. ఇందులో రూ.4500 కేంద్ర ప్రభుత్వం ద్వారా, కంపెనీ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి నెలకు రూ.500 చెల్లిస్తుంది" అని పేర్కొన్నది.

ఈ ఏడాదిలో 60 సార్లు ఇంటర్నెట్ షట్ డౌన్

న్యూఢిల్లీ : భారత్‌లో ఈ ఏడాది 60 సార్లు ఇంటర్నెట్ షట్‌డౌన్ నమోదైంది. ఇది గతేడాది కంటే తక్కువే. అలాగే, గత ఎనిమిదేండ్లలో భారత్‌లో అతి తక్కువ సంఖ్యలో మొబైల్ ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు ఈ ఏడాదిలో నమోదయ్యాయి. సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్ నిర్వహించే ఇంటర్నెట్ షట్‌డౌన్స్ ట్రాకర్ సమాచారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సమాచారం ప్రకారం.. ఈ ఏడాదిలో 60 షట్‌డౌన్‌లు జరిగాయి. గతేడాది ఈ సంఖ్య 96గా ఉన్నది. జాతి హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌తో పాటు జమ్మూకాశ్మీర్‌లలో తక్కువ షట్‌డౌన్‌లు నమోదయ్యాయి. ఆర్టికల్ 370 రద్దు అనంతరం 2020 ఏడాదిలో జమ్మూకాశ్మీర్ అత్యధిక సంఖ్యలో ఇంటర్నెట్ షట్‌డౌన్‌లను చూసింది. గతనెలలో, హర్యానాలోని అంబాలాలో రైతు ఆందోళనల ఫలితంగా షట్‌డౌన్‌లు విధించబడ్డాయి. దేశంలో ఇంటర్నెట్ షట్‌డౌన్‌ల పట్ల డిజిటల్ హక్కుల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోడీ పాలనలో ఇది తీవ్రమైందని ఆరోపించారు. అయితే, ఇది మారాలనీ, ప్రజలకు వాక్‌స్వేచ్ఛ ఉండాలని తెలిపారు. భారత్‌లో ఇంటర్నెట్ షట్‌డౌన్‌లపై కేంద్రీకృత డేటా తమ వద్ద లేదని కేంద్రం శీతాకాల సమావేశాల్లో పార్లమెంటుకు తెలియజేయటం గమనార్హం.

విదేశీ సైనిక స్థావరాలను మూసివేయనున్న సెనెగల్

ప్రధానమంత్రి ఊస్మానే సోంకో



రక్షణ విధానాన్ని సమీక్షించడానికి, జాతీయ సార్వభౌమత్వాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా సెనెగల్ తన భూభాగంలోని అన్ని విదేశీ సైనిక స్థావరాలను మూసివేయనుందని ప్రధాన మంత్రి ఊస్మానే సోంకో ప్రకటించారు. సెనెగల్ ప్రధాన మంత్రి జాతీయ అసెంబ్లీలో సాధారణ విధాన ప్రకటన సందర్భంగా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. దీనిలో రాబోయే 25 సంవత్సరాలలో తమ పశ్చిమ ఆఫ్రికా దేశ పరివర్తనకు ఒక వ్యూహాన్ని ఆయన వివరించారు. రిపబ్లిక్ అధ్యక్షుడు సమీప భవిష్యత్తులో అన్ని విదేశీ సైనిక స్థావరాలను మూసివేయాలని నిర్ణయించుకున్నారని సోంకో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఏ నిర్దిష్ట దేశాల పేరును పేర్కొనలేదు. కానీ సెనెగల్‌లో దళాలు ఉన్న ఏకైక విదేశీ శక్తి ఫ్రాన్స్. ఫ్రాన్స్ తన పూర్వ ఆఫ్రికన్ కాలనీలలో అనేక చోట్ల ఎదురుదెబ్బలు చవిచూసింది. ఎందుకంటే మిలిటెంట్ తిరుగుబాట్లను ఎదుర్కోవడంలో వైఫల్యాలు, జోక్యం, దురాక్రమణ ఆరోపణల కారణంగా ప్రజలలో ఫ్రెంచ్ వ్యతిరేక భావన చెలరేగింది. ఆపరేషన్ బారేన్‌లో భాగంగా మాజీ వలసరాజ్యాల శక్తి సహెల్ ప్రాంతంలో 5,000 కంటే ఎక్కువ మంది సైనికులను కలిగి ఉంది. ఇది దశాబ్ద కాలంగా కొనసాగిన తిరుగుబాటు నిరోధక మిషన్. ఇది 2022 చివరిలో బమాకో మే 2021 తిరుగుబాటు తర్వాత సంబంధాలలో విచ్ఛిన్నం కారణంగా పారిస్ తన సైన్యాన్ని మాలి నుంచి ఉపసంహరించుకున్నప్పుడు ముగిసింది. డిసెంబర్ 2022లో, ఆఫ్రికన్ దేశం, రష్యా మధ్య సన్నిహిత సంబంధాన్ని పేర్కొంటూ పారిస్ సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ నుంచి దళాలను ఉపసంహరించుకుంది. బుర్కినా ఫాసో, మాలి, నైజర్ దేశాలు పారిస్‌తో తమ సైనిక భాగస్వామ్యాలను రద్దు చేసుకున్నాయి. 2011 నుంచి సహెల్‌ను పీడిస్తున్న ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సహాయం కోసం మాస్కో వైపు మొగ్గు చూపాయి.

ఈ నెల ప్రారంభంలో, సహెల్‌లో మిగిలి ఉన్న చివరి మిత్రదేశం నవం బర్‌లో ద్వైపాక్షిక సైనిక సహకార ఒప్పందాన్ని ముగించిన తర్వాత ఫ్రాన్స్ చాడ్ నుంచి తన దళా లను ఉపసంహరించుకోవడం ప్రారంభిం చింది. ఈ ఒప్పందం ఇకపై దేశ భద్రతా వాస్తవాలను లేదా పూర్తి సార్వభౌమాధికారం కోసం ప్రభుత్వ అంచనాను ప్రతిబింబించదని మాజీ ఫ్రెంచ్ కాలనీ పేర్కొంది. ఒక సంవత్సరం కంటే తక్కువ కాలం పదవిలో ఉన్న సెనెగలీస్ అధ్యక్షుడు బస్సిరౌ డియోమాయే ఫాయే, గత నెల చివర్లో ఏఎఫ్ పి వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన దేశం నుంచి ఫ్రెంచ్ సైనిక ఉనికిని తొలగించాలనే తన నిర్ణయాన్ని మొదట ప్రకటించారు. ఫ్రెంచ్ సైనిక స్థావరాలు పశ్చిమ ఆఫ్రికా దేశ సార్వభౌమ త్వానికి అనుకూల మైనవి కావని ఆయన అన్నారు. ఫ్రాన్స్ ప్రస్తుతం సెనెగల్‌లో 350 మంది సైనికులను కలిగి ఉంది. కానీ పశ్చిమ, మధ్య ఆఫ్రికాలో విస్తృత సైనిక పునర్నిర్మాణంలో భాగంగా ఆ బందాన్ని 100 మందికి తగ్గించాలని యోచిస్తోంది.

అమెరికాలో సరి కొత్త రికార్డుకు నిరాశ్రయుల సంఖ్య



2007లో ఫెడరల్ ప్రభుత్వం ఈ గణాంకాలను ట్రాక్ చేయడం ప్రారంభించినప్పటి నుంచి అమెరికాలో నిరాశ్రయుల సంఖ్య రికార్డు స్థాయికి చేరుకుంది. ఈ వారం విడుదల చేసిన డేటా ప్రకారం 771,000 మంది అమెరికాలో నిరాశ్రయులయ్యారు. ఇది 2023తో పోలిస్తే 18 శాతం పెరుగుదల. ఇది దశాబ్దాలలో అత్యంత తీవ్రమైన వార్షిక పెరుగుదలను సూచిస్తుంది. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శుక్రవారం ప్రచురించిన ఈ సంఖ్య అమెరికాలోని ప్రతి 10,000 మందిలో దాదాపు 23 మంది నిరాశ్రయులు. 2023లో 12 శాతం పెరుగుదల తర్వాత ఈ పెరుగుదల సంభవించింది. దీనికి అద్దెలు విపరీతంగా పెరగడం, కోవిడ్ మహమ్మారి సహాయం ముగియడం కారణమని ఆ శాఖ పేర్కొంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మధ్య, దిగువ ఆదాయ కుటుంబాలలో వేతనాలు నిలిచిపోవడం, వ్యవస్థాగత జాత్యహంకారం చూపే నిరంతర ప్రభావాలు, ప్రకతి వైపరీత్యాలు, స్థిరమైన గహాలను పొందలేని వలసదారుల ప్రవాహం దేశవ్యాప్తంగా సరసమైన గహాల కొరతను తీవ్రతరం చేస్తున్నాయి. మూడు సంవత్సరాల క్రితం ఇదే నెల అద్దె ఖర్చుల నుంచి 2024 జనవరిలో సగటు అద్దె 20 శాతం పెరిగిందని జాతీయ స్వల్ప ఆదాయ గహ కూటమి మార్చిలో రాసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రకారం, ఆశ్రయాలపై ఆధారపడిన లేదా బయట పడుకున్న పిల్లలతో ఉన్న కుటుంబాలలో ఈ సంవత్సరం 39 శాతం పెరుగుదల ఉంది. ఇది దాదాపు 2,59,000 మందికి సమానం. ఇది డేటా సేకరణ ప్రారంభమైనప్పటి నుంచి నమోదైన అత్యధిక సంఖ్య. జనవరి కల్లా దాదాపు 150,000 మంది పిల్లలు నిరాశ్రయులయ్యారని కూడా నివేదిక చూపిస్తుంది. ఇది మునుపటి సంవత్సరం గణన కంటే 33 శాతం పెరుగుదల.

ఇంతలో, 2023 నుంచి నిరాశ్రయులైన అనుభవజ్ఞుల సంఖ్య 8 శాతానికి తగ్గింది. కొత్తగా నిరాశ్రయులైన వ్యక్తుల గణాంకాలు బైడెన్ పరిపాలన సరసమైన గహాలకు నిధులను పెంచడం, నిరాశ్రయులను నివారించే లక్ష్యంతో సేవలను విస్తరించడం వంటి ప్రతిజ్ఞల మధ్య వచ్చాయి. అయితే, బలమైన అద్దెదారుల రక్షణలు, అద్దె నియంత్రణలు, మానసిక ఆరోగ్యం వ్యసనం, సేవలపై దష్టి పెట్టడం వంటి మరిన్ని వ్యవస్థాగత సంస్కరణలు అవసరమని న్యాయవాద సంఘాలు వాదిస్తున్నాయి. నగరాలు నిరాశ్రయులైన నివాసితులు బయట పడుకోవడాన్ని నిషేధించవచ్చని జూన్‌లో అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దేశవ్యాప్తంగా 100 కంటే ఎక్కువ అధికార పరిధులు ఆ దిశలో చర్యలు తీసుకున్నాయని అసోసియేటెడ్ ప్రెస్ రాసింది. ఎన్నికల ప్రచార సమయంలో అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అధిక గహ ఖర్చులకు కారణమని పదే పదే అక్రమ వలసలను ఎత్తి చూపారు. అమెరికన్ చరిత్రలో అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ నిర్వహించాలనే తన ప్రణాళిక ఇండ్ల ధరలను తగ్గిస్తుందని న్యూయార్క్ పోస్ట్ ఉటంకించింది. వలసలు, గహ ఖర్చులు ఆకాశం వైపు దూసుకు పోతున్నాయి అని ట్రంప్ అరిజోనాలో సెప్టెంబర్ ర్యాలీలో అన్నారు.